అభ్యుదయ

ఫిబ్రవరి 1979 ఒక రూపాయి



శ్రమజీవులు బర్ల మహేశ్వరదాస్

ఈ సంచిక నుండీ 'అభ్యుదయ' ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మాస పత్రికగా వెలువడుతుంది.

❋ 1979 సం. నవలల పోటీ వివరాలు ❋

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్ : : విజయవాడ - 520 004

కథా వస్తువు తెలుగు ప్రజల జీవితానికి సంబంధించినదై ఉండాలి. సమాజంలో వస్తున్న బహుముఖమైన మార్పులనూ, సంఘర్షణలనూ చిత్రించే; నూతన జీవితాన్నీ, విలువలనూ యిచ్చే వ్యవస్థకోసం ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను ప్రతిబింబించే నవలలను ఆహ్వానిస్తున్నాం.

పోటీ ముగింపు : **30** ఏప్రిల్ **'79,** ఫలితాల ప్రకటన : **22** జూన్ **'79**

మొదటి బహుమతి రు. 4,000,

2వ బహుమతి రు. 3,000, 3వ బహుమతి రు. 2,000

1. వ్రాత ప్రతి అరటావు సైజులో 200 పేజీలకు తగ్గకుండా 250 పేజీలకు మించకుండా వుండాలి.
2. కాగితానికి ఒకేవైపున, కనీసం ఒక అంగుళం మార్జిను విడిచి స్పష్టంగా సిరాతో రాసిగాని, టైపు చేసిగాని పంపాలి.
3. 'విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నవలల పోటీకి' అని కవరుపై రాసి పై అడ్రసుకు పంపాలి.
4. అనువాదమూ, అనుసరణా కాదని, అముద్రిత స్వతంత్ర రచన అని వ్రాతమూలకంగా తెలియజెయ్యాలి.
5. ప్రచురణకు ఏ కలంపేరు వాడినా రచయితలు తమ పూర్తి పేరు, చిరునామా రాయాలి.
6. నవల వ్యావహారిక భాషలోనే ఉండాలి.
7. బహుమతి పొందని నవలలు తిరిగి పంపడానికి తగు పోస్టేజి జత పర్చాలి.
8. బహుమతుల నిర్ణయంలో జడ్జీలుగా నియమించబడిన వారిదే తుది తీర్పు. వీటి గురించి ఏవిధమైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
9. బహుమతి పొందిన నవలలపై ఆరు సంవత్సరాల వరకు మాకు ప్రచురణ హక్కులుంటాయి.
10. పోటీ ఫలితాలు ది. 22-6-79న జరిగే బహుమతి ప్రదానోత్సవ సభలోనూ, జూన్ 23వ తేదీ "విశాలాంధ్ర" దినపత్రికలోనూ ప్రకటించబడతాయి.
11. ప్రచురించే నవలలను జడ్జీల సూచనల మేరకు రచయితలతో సంప్రతించి మార్పులూ, చేర్పులూ చేసే హక్కు ప్రచురణకర్తలకు ఉంది.
12. ఏ బహుమతికైనా అర్హమైన నవల లేదని జడ్జీలు భావించిన పక్షంలో ఆ బహుమతిని నిలిపివేసే హక్కు మాకుంటుంది.

ప్రళయం నుంచి ప్రగతికి

ఆంధ్రప్రదేశ్‌లోని తుపానుకు గురైన కోస్తా జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో ఈనాడు పచ్చని పంటచేలు బాలభానుని వెచ్చని కిరణాల గిలిగింతలకు కళకళలాడుతూ లాస్యం చేస్తున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బాగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇళ్ళనిర్మాణ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నది.

బహువిధాలైన పునరావాస కార్యక్రమాలు ప్రారంభం కావడంతో బాధితులలో అలముకున్న విషాదచ్ఛాయలు క్రమంగా విడిపోయి వారిలో ఆశాకిరణాలు వెల్లివిరుస్తున్నాయి.

"ఇళ్లు లేని వారికి ఇళ్లు" అనేది ఇంకెంత మాత్రం నినాదం కాదు. ఈ నినాదం కార్యరూపం ధరిస్తున్నది. నిర్మించ తలపెట్టిన 20,000 ఇళ్లలోనూ 13,000 ఇప్పటికే పూర్తయ్యాయి. వీటి నిర్మాణానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచీ, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచీ సహాయం అందుతూంది. తీరం పొడవునా తుఫాను రక్షక భవనాల నిర్మాణానికి ప్రాముఖ్యత నిస్తున్నారు.

ప్రళయానికి గురైన తీరప్రాంతం, ముమ్మరంగా జరిగే ఈ గృహనిర్మాణ పునరావాస కార్యక్రమాల ఫలితంగా తిరిగి ప్రగతి పథంలో అడుగెడుతూంది.

డి. జి. ఐ. అండ్. పి. ఆర్.
నెం: 35/78-79.
తారి: 1 1 179.

విషయసూచిక

సమాజం (కవిత) - 7
- శశిశ్రీ

అభ్యుదయ కవిత్వం - 'తిరుగుబాటు' ధోరణులు - 8

ముఖ్య నిర్ణయాలు - 15
- రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి

మినీ కవితలు
- శరత్‌కుమార్, జింబో,
ఉపద్రష్ట శాయి, వై. వి. ఎస్.
ఎస్. ఎన్. మూర్తి. అను రాజేంద్ర

భారతంలో భగవద్గీత ఎందుకు లేనట్లు? (వ్యాసం) - 17
- వై. సి. వి. రెడ్డి

ప్రేతకళ - 18
- మెంటమ్ కవిరాజ్

అపరాజిత విశ్వమహాకవి పాబ్లో నెరూడా (వ్యాసం) - 19
- సోమసుందర్

నా దేశం (కవిత) - 24
- పాబ్లో నెరూడ కవితకు వుప్పల లక్ష్మణరావు అనువాదం

'వుద్ధరిణి' (మినీ కథ) - 25
- వి. కె. విశ్వనాధశర్మ

ఆడపిల్లల తండ్రి (కథానిక) - 26
- చామర్తి దుర్గాప్రసాద్

సాలెగూడు కవి (కవిత) - 27
- ఎస్వీ

సమకాలీన సంఘం - సాహిత్యం - (వ్యాసం) - 28
- అక్కిరాజు రమాపతిరావు

(అహం)భావ విప్లవం (కవిత) - 31
- అదృష్ట దీపక్

ఒకప్పుడు - ఇప్పుడు (కవిత) - 33
- 'కోణార్క'

బలం ఉన్నవాడికన్న బలం లేనివాడు బలవంతుడు (స్కెచ్) - 34
- మంధా వెంకట రమణారావు

సముద్రానికీ సూర్యునికీ మధ్య (హిందీ కథానిక) - 36
- హిమాంశు జోషీ;
అనువాదం నిర్మలానంద్ కాత్యాయన్

బానిస (కవిత) - 40
- వి. సూర్యప్రకాశ్

పెద్ద మనుషులు (కవిత) - 42
- ఎమ్వీ రమేష్

డాస్ క్విక్సోట్ (అజర్బైజాన్ కథానిక) - 43
- ఇస్మాయిల్ షిక్లీ

సాహిత్య విమర్శ ధోరణులు (వ్యాసం) - 52
- టి. ఎల్. కాంతారావు

కూటికి పేదవారైతే... (మినీ కథ) - 56
- వై. ప్రభాకర్ రెడ్డి

ఆంధ్ర ప్రదేశ్‌లో బ్రెఖ్ట్ జయంతి (వ్యాసం) - 56
- కాట్రగడ్డ గంగయ్య

విప్లవకారుడు (కవిత) - 59
- బ్రెఖ్ట్ గీతానికి ఉప్పల లక్ష్మణరావు అనువాదం

వార్తా సంగ్రహం - 59

చరిత్ర పరిశోధనలో గ్రామ నామాల ప్రయోజనం - 61
- చర్చావేదిక

సమీక్ష - 62

వనిత ఉరఫ్ పతిత (కవిత) - 63
- రాధేయ

స్వీకారం - 65

లేఖలు - 66

అభ్యుదయ

సంచిక 2, సంపుటి 3 ఫిబ్రవరి 1979 సాలు చందా రూ. 10

సమాజం

శశిశ్రీ

ఉడకీ వుడకని అన్నం
అక్కడక్కడ వున్నవి రాళ్ళు సైతం
పంటి కింద రాయి పడినప్పుడు
తప్పడం లేదు బాధ
కూడు తినకుండ వుండలేము
రాళ్ళు నమలనూ లేము
అన్నం వుడికిందే అంతంత
అందుకు తోడు రాళ్ళ బాధ
ఉడక బెట్టడంలో నేర్పు
రాళ్ళేరడానికి చూపు
నేర్పు, చూపూ వుంటే
అన్నం శుభ్రంగా తినవచ్చు
సమాజానికి పట్టిన కళ్ళ జబ్బు
శస్త్ర చికిత్సతో నరిచేస్తే
రాళ్ళలాంటి ధనస్వాముల్ని
ఏరి పారేస్తే చాలు
సమాజం శుభ్రంగా బ్రతకవచ్చు
ముందుకు మునుముందుకు పోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మాస పత్రిక

అభ్యుదయ కవిత్వం, 'తిరుగుబాటు' ధోరణులు

అభ్యుదయ సారస్వతోద్యమం ప్రారంభమయ్యాక సారస్వతానికి సాంఘిక ప్రయోజనం వుండాలా, వుండనక్కర్లేదా అన్న సమస్య లేకుండా పోయింది. కళ, కళ కోసమే అన్న వాదం అడుగున పడిపోయింది. మునుపటి సారస్వత ఉద్యమాలకన్నా, సంఘాలకన్నా యీ ఉద్యమం విస్తృతంగా, పటిష్టంగా వుండడం వల్ల మాత్రమే జరిగిన పని కాదిది. దేశకాల పరిస్థితులవల్లా, లోకం పోకడవల్లా, సాంఘిక ప్రయోజనం లేని సారస్వతం పూర్తిగా అంత రించక పోయినా, రాను రానూ అంతరిస్తోంది. వ్యక్తి దృక్పథం కంటె సంఘ దృక్పథం ప్రబలమయ్యింది. ఈ పెద్ద పరిణామం రావడానికి, అభ్యుదయ సారస్వ తోద్యమం యిచ్చిన ప్రోద్బలం సాటిలేనిది. సారస్వత జగత్తులో మనిషి కంటె, చివరికి మనుషులదే పైచేయి అయ్యింది.

పూర్వపు అభ్యుదయ రీతి

తెలుగు సారస్వతంలో బలంగా సాంఘిక ప్రయోజన దృష్టిని, మొదట వీరేశలింగం అలవాటు చేశారు. తన సంఘ సంస్కరణోద్యమానికి, ఆయన సారస్వతాన్ని మహాయుధంగా ఉపయోగించారు. తరువాత గురజాడ అప్పారావు సంఘదురన్యాయాలను బయట పెట్టి, ఉన్నత నైతిక భావాలను ప్రాచుర్యానికి తేవడం కంటె సారస్వతానికి మంచి కర్తవ్యం యింకొకటి లేదని నొక్కి చెప్పారు. (చూ. 'కన్యాశుల్కం' మొదటి ముద్రణ పీఠిక). సాంఘిక ప్రయోజన దృష్టితో బాటు రసపుష్టి కూడా గురజాడ రచనలలో వున్నందున, ఎనభై ఏళ్ళ క్రితం ఆయన చేసిన యీ సిద్ధాంతీకరణ యిప్పటి వరకూ కవుల్నీ, రచయితల్నీ ఆకట్టుకునే వుంది.

అయితే ఆత్మాశ్రయ కవిత్వమూ, కాల్పనికోద్యమమూ విజృంభించిన దశలో ఆరోగ్యకరమైన గురజాడ పోకడకు కొంత కాలం గ్రహణం పట్టినట్ట య్యింది. ఈ దశలో వున్నప్పుడు – స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతూ వున్న కాలంలో కూడా, అప్పటి నవీన కవిత్వం బాహ్య ప్రపంచంతో సంబంధం పెట్టుకోకూడదని తీర్మానించుకున్నట్టుగా, దంతపు మేడలో తిష్టవేసుకూ్కు చుంది. కాని యీ గ్రహణ కాలంలోని గద్య సారస్వత పరిస్థితి కొంత నయం. "మాలపల్లి", జాతీయోద్యమ వస్తువుతో వేలూరి శివరామ శాస్త్రి కథలూ యీ రోజుల్లోనే వచ్చాయి.

కాల్పనిక కవితా దశలో యింకో వేపున, పాత శైలిలో మంగిపూడి వెంకట

శర్మ, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి కవులు, జానపద శైలిలో గరిమెళ్ళ సత్యనారాయణ వంటి వారూ సంఘ దృష్టిగల కవిత్వం రాశారు. ఆనాటి యీ అభ్యుదయ సాహిత్యం సాంఘిక దురన్యాయాల్నే కాకుండా, యితర జీవితరంగాలలోని దురన్యాయాల్ని కవితా వస్తువుగా తీసుకుంది. బ్రిటిష్ నిరంకుశ పాలనను మనసులో పెట్టుకుని చారిత్రక కథాంశాలతో దేశాభక్తిని ప్రభోధిస్తూ, పరపాలనను నిరసిస్తూ నాటకాలు మొదలైనవి వచ్చాయి ("రసపుత్ర విజయం" యిత్యాది). ఈ విధంగా రాజకీయాలు సారస్వతంలో ప్రవేశించాయి. గురజాడ అంతగా సారస్వత ప్రయోజన దృష్టి వీరికి లేక పోవచ్చును గాని, అంతగా స్పష్టత లేక పోవచ్చును గాని, దేశాభిమానంవల్ల వీరు సారస్వతాన్ని రాజకీయ సాధనంగా చేశారు. ఇదొక విధంగా ఆ రోజుల్లోని గుంభనమైన తిరుబాటు ధోరణి.

ఇంతకు చాలా ముందర కూడా, మన ప్రాచీన కావ్యాలలోనూ, తమ తమ నమ్మకాల కోసం కవులు బాహాటంగానే తిరుగుబాటు ధోరణులు అవలంబించినట్లు ఉదాహరణలు చాలా కనిపిస్తాయి. పోతన్న, ధూర్జటి రాజుల్ని కూళలనీ; వారిచ్చేది పడుపు కూడనీ; వాళ్ళు మత్తులనీ, వారి సేవ నరక ప్రాయమనీ ధిక్కరించారు. వీరికి ముందర మరీ ప్రాచీన కవుల్లోనూ, యీ ధోరణులు అనేక సందర్భాలలో దురధికారాన్నీ, దురన్యాయాల్నీ ఎదిరిస్తూ కనిపిస్తాయి.

గురజాడ అభ్యుదయ రీతికి, నవ్యకవిత్వంలో పట్టిన గ్రహణం ఎంతో కాలం లేదు. శిష్ట్లా, శ్రీశ్రీ, నారాయణ బాబు, ముద్దుకృష్ణ, పురిపండా, అప్పల స్వామి వంటి కవులు అభ్యుదయ సారస్వతోద్యమానికి పూర్వరంగంలో గురజాడ రీతిని అవలంబించారు. "జ్వాల" పత్రిక దీనికి వేదిక అయింది. వీరిది గురుజాడ లాగా సామాజిక వేదిక మాత్రమే కాదు – అది రాజకీయం, ఆర్థికం కూడా. అభ్యుదయ సారస్వతోద్యమం సంఘటితంగా, ఒక ఉద్యమ రూపంతో కృషిచేయటానికి పూనుకోక ముందర, వ్యక్తులుగా వీరు చెదురుగానైనా, అభ్యుదయ కవితా రీతిని పునరుద్ధరించారు.

శిష్ట్లా అడ్డం, శంక, అధైర్యం, అస్థిమితం – వీటిని హిరణ్యకశ్యపునితో పోల్చి యిలా వ్రాశారు :

"మూలము సమూలముగా త్రెంచి హృదయ
సభామంటపము పగిల్చి మనస్సు
విజృంభించి నరసింహ మూర్తిత్వము తాల్చును!
అప్పుడే ప్రహ్లాద కవిత్వ మాహ్లాదముగా
ఉద్భవిస్తుంది!",
('నవమి చిలుక' లో 'మున్నుడి')

"సుడిగాలి రేగిందిలే!
పిడుగు గర్జించిందిలే!"

అని పురిపండా, 'పులి పంజా!' అన్న తన గీతంలో, తన గేయం

"కుబుసం వదిలిన సర్పం" అని చెప్పారు.

నారాయణ బాబు ;

"అయితే నేడు కవిత కామినికే వచ్చింది ఖాయిలా
'అసలు గూటిలో నుంచే అదృశ్యమైందా కోయిలా ?
కల్పన కిది కాని రోజు
కవి కంఠంలో పట్టింది బూజు
కలదింకా నీకొక రోజు దులుపు బూజు"

కవి కంఠానికి బూజు దులిపే ప్రయత్నాలు యిలా మొదలయ్యాయి. కవుల ఆరాటం శిష్టా, నారాయణ బాబు గీతాల్లో స్పష్టాస్పష్టంగా కనిపిస్తే, పురిపండా, శ్రీశ్రీ డొంక తిరుగుడు లేకుండానే చెప్పారు. ((శ్రీశ్రీ గీతాలు సుప్రసిద్ధమైనవి కావడం వల్ల ఉదాహరించటం లేదు). ముఖ్యంగా గమనించ వలసింది, యీ బూజు దులుపే ప్రయత్నం, కవి కంఠంతో ఆగకుండా, ఒక పాతికేళ్ళలో, నైజాం రాజు వరకూ వ్యాపించింది. దాశరధి –

"విషము గుప్పించి నాడు నొప్పించి నాడు
మా నిజాం రాజు జన్మ జన్మాల బూజు".

నారాయణ బాబే యింకో గీతంలో "ప్రళయ తాండవం చేసే శివునకు వెనుక పాట పాడే కవులుంటే కావా" లని డిమాండు పెట్టింది, కవితా కామిని ఖాయిలా పడి, గూటిలో నుంచి కోయిల అదృశ్య మయ్యాకనే. ఆత్మాశ్రయ, కాల్పనిక కవిత్వాల మీద మోహం మొత్తడానికీ, తిరుగుబాటుకూ యివి సూచనలు.

ఉద్యమంగా అభ్యుదయ సారస్వతం రావడానికి ముందర, తిగుబాటు ధోరణిని అవలంబించిన వారు కొద్ది మందే అయినా, వారి గొంతులు కాల్పనిక కవిత్వపు కోకిలల కూజితాల కంటె బిగ్గరగానే వినిపించాయి. ముఖ్యంగా శ్రీ శ్రీ కాల్పనిక కవిత్వపు కుబుసం వదిలిన తరువాత వ్రాసిన గీతాల ఖావాలు చేదుగా తగిలినా, వాటి కమ్మని పాకం ఇటువంటివి చదివే అలవాటులేని పాఠకులకూ, కాల్పనిక కవులకు కూడా జిహ్వాకు రుచిగా తగిలింది. సంఘం, ఆర్థిక వ్యత్యాసాలు, మతం, కులం, సంప్రదాయం, భేషజం, పాత విలువలు – ఒకటేమిటి అన్నిటిని గద్దించి ప్రశ్నించడం, వాటిమీద తిరుగుబాటు చేయడం రాను రానూ కవులు అల వాటు చేసుకున్నారు. కొద్ది సార్లిది సబబు తప్పి జరిగినా, సాధారణంగా సబబుగానే జరుగుతూ వుండేది.

"ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి
నెత్తురు మండే శక్తులు నిండే
సైనికులారా రారండి !"

ఇది అప్పటి ఆవేశాని కొక ప్రతిధ్వని. ఈ ఆవేశానికి వృత్తం తట్టుకోలేదేమో ; వృత్తం స్థానంలో గీతం, గేయం, పాట వచ్చాయి. వచన కవిత్వమూ

వచ్చింది. ఉద్యమంగా వచన కవిత్వం రావడానికి చాలా ముందరే "వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో పద్యాల నడుముల్ విరగదంతాను" అని వార్నింగు వచ్చింది పఠాభి నుంచి.

ఇలా ముప్పయ్యేళ్ళ క్రితం ఛందోబందోబస్తుల్ని త్రెంచి వేయడం జరిగింది. ఇప్పుడది వచన కవిత్వంగా రాణింపు లోనికి వచ్చింది.

తిరుగుబాటు అన్నమాట మోటుగా వుండవచ్చును గాని, దానిలో విప్లవాంశ, అభ్యుదయాంశా వున్నాయి. మంచి కోసం జరిగే తిరుగుబాటు చెడ్డదేమీ కాదు. 1857 లో సైనికులు చేసిన తిరుగుబాటు విప్లవమే, అభ్యుదయం కోసం చేసిందే.

అపస్వరాలు

కాల్పనిక కవిత్వం మీద తిరుగుబాటుచేసి సాంఘిక ప్రయోజన దృష్టితో కవిత్వం రాసిన వారు, మొత్తంగా చూస్తే ఆరోగ్యకరమైన సాహిత్యాన్నే సృష్టించారు. అయితే అప్పుడప్పుడు అపస్వరాలు వినిపించడం జరిగింది. యూరప్ నుండి వచ్చిన మంచి గాలినే కాకుండా, ధూళిని కూడా మన కవులు పీల్చడం వల్ల జరిగిన పనిది. అంతుపట్టని సింబాలిజం, ఫ్రాయిడిజం, వెకిలితనం, జుగుప్స, బీభత్సం తలెత్తుచుండేవి గాని, అవి నిలవదొక్కుకోలేకపోయాయి. కొన్ని అపస్వరాలు :

"కనురెప్పల సెజ్జ మీద కళ్లజోడు ముక్కుతోడ
వ్యభిచరించె . . ." (నారాయణ బాబు)

మొత్తం గీతం అంతా యిలాగే ప్రతి సంధానంలోను సంభోగ దర్శనంతో సాగింది.

వ్యక్తావ్యక్త, అర్ధచైతన్య ప్రయోగానికని శ్రీశ్రీ రాసిన "కాసరమా వికారములు కార్చకు" అన్న దానితో మొదలైన పద్యాల్లో అంతుపట్టీపట్టని సింబాలిజం వుంది.

(చూ. "అధి వాస్తవికుల ప్రవేశం")

గమ్మత్తయిన సంవిధానంతో ఎంత తంటాలు పడినా అంతు పట్టని శ్రీ శ్రీ

"తురాయి కంటే, ఆ
కురాయి కంటే, కీ
చురాయి కంటే, హిమాంశు
రాయి గొప్పవాడు"

యిత్యాది "డికంపోజిషన్స్" గీతాలోక మచ్చు యిందుకు.

ఒళ్లు జలదరింపు పుట్టించే నారాయణ బాబు బీభత్స గీతం:

"నల్లని త్రాచు కోరలు
తెల్లని మశూచి కుండలు
గగనమ్మున చుక్కల
ఒళ్ళు తెలియని వుళ్ల బాధతో

వెక్కి వెక్కి రోదించింది చుక్కల ఆకాశం.''

ఇప్పటి లాగానే అప్పుడు తెలిసో తెలియకో గీతాలు ఒడుదుడుకులు గానూ, శైలి కుంటుతూనూ నడిపించడమూ వుంది. పైని ఉదాహరించిన శిష్టా గీతమే చూడండి. దీంట్లో పచ్చి గ్రాంధికాన్ని వ్యావహారికంతో కలగలపడం జరిగింది.

బలహీనతలెలా వున్నప్పటికీ, అభ్యుదయ సారస్వతోద్యమానికి పైని వివరించినది స్థూలంగా పూర్వం రంగం, గట్టి పునాది.

అభ్యుదయ రచయితల సంఘ స్థాపన

రెండో ప్రపంచ యుద్ధం, దాని మూలంగా భావాలలో ఏర్పడిన తీవ్రత, దారుణమైన కరువు, దేశస్వాతంత్ర్య కోసం ఉవ్వెత్తుగ ఉద్యమం, బ్రిటీష్‌వారి నక్కజిత్తులు, నావికుల తిరుగుబాటు, ఫాసిస్టు వ్యతిరేక పోరాటం, మహా యుద్ధంలో ప్రగతి శక్తుల ఘన విజయం, సోషలిస్టు శక్తులు ముస్ముందుకు పోతూ వుండడం, యింకో వేపున ఆంధ్రరాష్ట్రం కోసం ఆందోళన, నైజాం పాలన మీద తిరుగుబాటు యివీ, యిటువంటివీ అభ్యుదయ రచయితల సంఘ స్థాపనకు వెనుక ముందూ వున్న పరిస్థితులు. ఇంతకుపూర్వం సాహిత్యరంగంలో ఏర్పడివున్న సాంఘిక దృష్టికి మరింతగా స్పష్టత కల్పించాయి, యివి.

1943 ఫిబ్రవరిలో అభ్యుదయ రచయితల సంఘ స్థాపన, దాని మహాసభ రాష్ట్రమంతటా పెద్ద సంచలనాన్నే కలిగించాయి. సాంఘిక ప్రయోజన దృష్టి వున్న రచయితలు, కవులు పాతవారూ, కొత్తవారూ చాలామంది యీ సంఘంలో చేరారు. చేరకపోయినా దీని ప్రాబల్యంలోనికి వచ్చిన వారెంతో మంది వుండే వారు. అది జరిపిన సభల్లోనూ, నడిపిన పత్రికలలోనే కాకుండా యితరత్రా కూడా అభ్యుదయ రచనలు వెలువడడం పరిపాటయ్యింది. ఆ సంస్థ మీద ఆక్షింతల పడకపోలేదు గాని, ఆ జల్లు కొద్ది కాలంలోనే వెలసి పోయింది. వృద్ధులు, ప్రసిద్ధులూ అయిన పండితులు, రచయితలూ, సహృదయులూ దీని వేపు మొగ్గుచూపారు.

దురన్యాయాల పట్ల అసమ్మతి, నిరంకుశత్వానికి ధిక్కారంతోబాటు కొత్తతనం కోసం, మార్పు కోసం తపన కవిత్వంలోనూ, వచన రచనలోనూ మ్రోగింది. హేతుదృష్టితో సాహిత్య విమర్శలు వచ్చాయి.

అభ్యుదయ రచయితల ఉద్యమం కొత్త రోజుల్లో వచ్చిన మంచి గీతాల సంపుటం ''నయాగరా''. ఇది శ్రీశ్రీకి ప్రతిధ్వనిగా వినిపించినా, ప్రతిభ, పరాక్రమం నిండుగా వున్న కవిత.

''మానవ మేధస్సుకు
సంకెళ్లను తగిలించిన
గత సాంఘిక శిలాశాసనం
పడగొట్టను
పగిలిన నా నిప్పుల కంఠం

పలికిన విప్లవ గీతం!...
కదలని సమాజ హిమాలయంలో
కదిలే నవక్రాంతి బడబాగ్ని
మండించిన నా గీతం..."

అంటూ బెల్లంకొండ రామదాసు "అనార్కలీ సమాధిలో అశ్రుదీపికలు వెలిగించిం" దనీ "అక్బరును కండలుగా" ఖండించిందనీ ప్రకటించగా,

ఏల్చూరి సుబ్రహ్మణ్యం –

"రూక్షోజ్వల రుధిరదీప్తిక్ష్మానాథుల తలలు తరిగి
కండ కరగు కూలీలకు
రక్తమోడ్చు రైతులకు
వస్తున్నది ప్రజాశక్తి!...
బానిసత్వ విచ్ఛేదక
ప్రబల విజయ ప్రజాశక్తి
ఒస్తున్నది మహాశక్తి...
బంధీకృత ధనిక శక్తి
పొగగొట్టపు భుగ భుగలో.
తెల తెల్లలై వెల వెలలై
పోతున్నది..."

అని ఉద్ఘాటించారు. కుందుర్తి ఆంజనేయులు, అల్లూరి సీతారామరాజు మన్యంలో తిరుగుబాటు "మా చరిత్రలో వీచిన ఝుంఝూనిల వీచిక" అని కీర్తించి,

"కదలిందొక మహాయాత్ర
కలవారిపై దండయాత్ర"

అని ప్రకటించారు.

"నయాగరా" కవిత్రయంలో యీయన ధోరణిలో యిప్పుడు పూర్వపు తిరుగుబాటు లేక పోవచ్చును గాని, సంఘంలోని అశాంతినీ, అవినీతినీ సునిశిత మైన వచన గీతాల్లో తెలుపుతున్నారు. "నాలోని నాదాల"లో కుందుర్తి:

"నిన్నకు రేపుకూ మధ్య
చిన్న గది ఒకటి వుంది (ఇప్పుడు)
ఇరుకుగా వుంటుంది.
గరుకుగా గుచ్చుకుంటుంది:
గచ్చు చేసేటప్పుడు మేస్త్రీలు మోసం చేశారు."

నైజాం పాదుషాహీని ఖబడ్దార్ అని బెదిరించి సోమసుందర్,

"బానిస జనశల్యములను, ఏర్చి కూర్చి నిర్మించిన
నీ రాక్షస సింహాసన మదిగదిగో కదులుతోంది!"

అంటూ, నైజాం పైని జరిగే పోరాటంలో –

"ఒక వీరుడు మరణిస్తే, వేల కొలది ప్రభవింతురు!
ఒక నెత్తుటి బొట్టులోనే, ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"

అన్న నమ్మకం ప్రకటిస్తారు. దాశరధి నమ్మకమూ యిటువంటిదే:

"ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములన్ సృజించ నెమికల్ నుసి జేసి పొలాలు దున్ని బో
షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే; ముసలి నక్కకు రాచరికంబు దక్కునే?"

("మహాంధ్రోదయం")

ఇదే దశలో, తెలంగాణాలో జరుగుతోన్న నైజాం వ్యతిరేక పోరాటాన్ని మనసులో పెట్టుకుని వ్రాసిన "త్వమేవాహమ్" లో 'కవిత్వ హ్రస్వ లిపి' వెనక, విషాద వాతావరణం వెనక నివురుకప్పి వున్న నిప్పు వెచ్చగా తగుల్తుంది. ఇందులో అరుద్ర భరత వాక్యం:

"ప్రజ భయ పడకూడదు
ఇల నిజం గెలుస్తుంది
కనుక నీతి నిలుస్తుంది
జరా మరణాలిక కల
ధ్వజం కొన నిరంతర సమధర్మం చూస్తాం."

ప్రజా శత్రువుల్ని బోనులో నిలబెట్టి రమణా రెడ్డి:

"ఆరోపిస్తున్నాను నేను
ఈ నరహంతకుల మీద అభియోగం,
అరదండాలు మాత్రమే చాలవు;
మరణానికి మరణమే శిక్ష." ("సత్యం, శివం, సుందరం")

"తర తరాల బూజు" గా నిరసింప బడిన నైజాం పైని సారస్వతంలో చాలా ఉద్రేక పూరితమైన గీతాలు వచ్చాయి. సుంకర సత్యనారాయణ:

"..ధన హీను తల – కర్ష
కుని నిండు కల – కార్మి
కుని అసువు వెల – మృత్తి
కను గలువగని తెగువ
కదలి పిడికిటు లలుక
కదన భూమికి దుముక
భూకంప ముదయించెనూ
నైజాముఠాకాసి గాంఢ్రించెనూ

జ్వలితాగ్నులై – పొంగు
జలరాసులై తళ
తళ మెరుపులై ప్రజలు
ఫెళ ఫెళా ఫెళ ఫెళా
అరి మూక పై కురికి
తరిమి తన్నుచు నరికి
గర్జించి అని నిల్చిరీ హంతకుల
నిర్జింపంగా సాగిరీ."

ఈ దశలో కుందుర్తి ఆంజనేయులు "తెలంగాణా" అన్న పద్య కావ్యమూ, బొల్లిముంత శివరామకృష్ణయ్య "మృత్యంజయులు" అన్న నవల, యిలాంటివే యింకా ఎన్నో రచనలూ వచ్చేయి. వీటిలో ప్రత్యేక స్థానం గంగినేని వెంకటే శ్వరరావు "ఉదయిని" అన్న ఖండ కావ్య సంపుటానిది. "అర చేతిలో

మృత్యువు" అన్న ఒక ఖండ కావ్యంలో కవి, గెరిల్లా వీరుని చేత "మరణంపె తిరుగు బాటు, ఔను మనం తప్ప వీరులు లేరు!" అనిపిస్తారు.

తిరుగుబాటువారులకు యీ కవి నివాళి :

"నడచి నడచి బొబ్బలెక్కిన మీ పాదాలను, పాద ధూళిని
నా వెచ్చని కన్నీళ్ళతో క్షాళనం చేయవచ్చాను!
మీ గుండెలలో వెలిగే మహోజ్వాలాదర్శానికి
ఆకాశం తాకే స్వరూపం కల్పించి ఆయువు పోస్తాను."

("గెరిల్లాలతో ఒక నిమిషం")

"ప్రియుడు ప్రియురాలికి" లో –

"ఉత్తరం ముగించి పగవాడి గుండెకు మర తుపాకి గురిపెడుతున్నా
భయపడకు నా పేరు మృత్యుంజయుడు, నా కోసం ఎదురు చూడు."

(సశేషం)

మహాసభ ముఖ్య నిర్ణయాలు

కాకినాడలో డిసెంబరు 24, 25 వ తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 8వ మహాసభలో జరిగిన ముఖ్య నిర్ణయాలను వివరిస్తు, రాష్ట్ర సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ ఏటుకూరి ప్రసాద్ పంపిన సర్క్యులర్‌లో యిలా వుంది.

(1) సంఘ సభ్యత్వచందా ఇప్పటివరకూ సంవత్సరానికి రు. 6 – 00 లు ఉండేది. దీన్ని సంవత్సరానికి రు. 1– 00 లుగా మార్చాం. ఎక్కువ మంది రచయితలను, ముఖ్యంగా యువ రచయితలను మన ఆశయాదర్శాల పరిధిలోకి తీసుక రావాలన్నదే దీని ఉద్దేశ్యం.

(2) ఇంతవరకు "అభ్యుదయ"ను మాస పత్రికగా మన మద్రాసు శాఖ తెస్తోంది. దీన్ని యికనుండీ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం పక్షాన కొంత కాలం వరకు మద్రాసు నుండే నడపాలని నిర్ణయించుకున్నాం.

మిత్రులారా! ఈ రెండు నిర్ణయాలను అమలు పరచడంలో మనందరం కృషి చెయ్యాలి. ముఖ్యంగా పత్రికను నిర్వహించడం – నిలబెట్టుకోవడం చాలా అవసరం. మనందరం సం. చందా రు. 10. లే కాక విరాళాలు యిచ్చి, పోగుచేసి పంపాలి. మన మన ప్రాంతాలలో ప్రకటన వసూలుచేసి పంపడం కూడా అవసరం. పత్రికను రచయితలందరికీ పరిచయం చేద్దాం. వారి వారి రచనలను సేకరించి పంపటం ద్వారా మన కృషిని యినుమడింప చేయాలి. పత్రిక మన ఆయుధం. అలాగే ప్రతి ఊళ్ళోనూ ఏజన్సీల నేర్పాటు చేసి కనీసం 5 పత్రికలన్నా అమ్మించేలా చూడాలి. దీనికి ప్రచారం చెయ్యాలి. రచయితల ఉద్యమంలో దీన్నొక ముఖ్యభాగంగా గుర్తించాలి. పత్రిక చిరునామా :-

Abhyudaya, R - 3, Lloyds Estate, Madras-600 014.

మినీ కవితలు

పి. శరత్ కుమార్

పోస్టు

పోస్టు మాన్
పోస్టుకైనా పనికిరాని
పోస్టు గ్రాడ్యుయేట్లను
ఉత్పత్తి చేస్తున్న
మన విద్యా విధానం
మనల్ని
నిలువునా పోస్టుమార్టమ్
చేస్తోంది.

జింబో

సూర్యుడు

వ్యక్తిత్వాన్ని
నిలుపు కోవడం
ఒక్క సూర్యునికే
చెల్లు
మరి
చంద్రుడు
ఎలక్ట్రిక్ దీపాల్లో
వెల వెల పోతాడు

కళ్ళుండటం

కళ్ళుండటం
చూడ్డానికేనా ?
చూడ్డానికే కాదు
కళ్ళ ముందు జరిగే
కుళ్ళు కడగటాని
కూ్కడ

ఉపద్రష్ట సాయి

ఆకురాలు కాలం

వేలాడుతున్న
ఇంటికప్పు చాటున
వణుకుతున్న పిచ్చికలు,
రాలిపోయిన ఆకులతో
సోలిపోయిన శరీరంతో
మోడువారిన వేపచెట్టు
గుర్తుచేసాయి, జరిగేది
ఆకురాలే కాలమని.

ఋతువులు

కాలం పూసరవల్లి
రంగులకు బదులు
మార్చేది.
ఋతువులు.

వై. వి. ఎస్. ఎస్.
ఎన్. మూర్తి

స్మృతి

జీవితం
సిగరెట్టులా
మండుతుంది
రాలుస్తున్నది
స్మృతుల నుసి

ఆసు రాజేంద్ర

మాటల కొరడాలు

కొరడాలకు
కొందరి మాటలు జడుస్తాయి
కొందరి మాటలకు
కొరడాలు జడుస్తాయి.

బలం

రొయ్యి పిలిస్తే
కదలి కదలి రాకపోవచ్చు
పొయ్యి పిలిస్తే
పాకలో గుంజలు కూడ
పరిగెత్తు కొస్తాయి.

స్వార్థం

గొంగళీ పురుగు
దాని హిస్టరీ
సీతాకోక చిలుక
దాని మిస్టరీ

మనీ బెయిల్

మనీ లేకుంటే
మది జైల్లో
కోర్కెల ఖైదీలకు
బెయిల్ లేదు.

కాగిం పులి

సంఘం
కాగితం పులి
తడబడే కాలదీ
తరుము కొస్తుంది.

'టీ' అనే 'కీ'

మెదడు గడియారం
బద్ధకంతో మొద్దుబారితే
'టీ' అనే 'కీ' ఇవ్వండి
అది హుషారుగా పని చేస్తుంది.

ఉపన్యాసాలు

వల్లకాటిలో వర్షంలా
ఉపవాసాల బ్రతుకులపై
ఉపన్యాసాల ఊకదంపులు.

భారతంలో భగవద్గీత ఎందుకు లేనట్లు?

తెలుగు భారతంలో భగవద్గీత లేదు. శిల్ప దృష్టితో తిక్కన్న గారు అనువదించలేదనీ, క్లుప్తంగా రెండు మాటల్లో చెప్పినాడనీ అంటారు. కాని ఆస్తి హక్కుల కొట్లాటలో భగవద్గీత పనికి రాదనీ, ఔచిత్యంగా వుండదనీ ఆయనే భావించాడేమో. భారత యుద్ధం, భగవద్గీతతో మొదలుపెట్టేందుకు జంకినాడు. భగవద్గీతను తిక్కనగారు అనువాదం చేయలేరనా? చేయగలడు. తెలుగువారికి ఉన్న విషయాన్ని, ఉన్నతంగా చెప్పాలనుకొన్నాడు. పూర్వులను మన్నించాలన్న ధోరణిలో క్లుప్తీకరించాడు. లేకపోతే తిక్కన్నగారికి గౌరవాన్ని రాబట్టాలని ఆ కాసంత భగవద్గీతలోని విషయాన్ని ప్రక్షిప్తం చేసినారేమో! తిక్కన్న గారు కేవలం ఆస్తి హక్కుల కొరకు, పోరాటాన్ని చేసినట్లు చెప్పడమే సరియైనదని భావించినారని తోస్తుంది. ఊహాపోహలను అట్లుంచుదాం. భారతం ఎందుకు రాసినట్లు? అందులో భగవద్గీత ప్రయోజన మేమి? దాన్ని వేరేగా చెప్పి వుండవచ్చు కదా.

పరువూ ప్రతిష్టలకంటే బతుకు ముఖ్యమన్న తీవ్ర భావనలోనే కురు పాండవ యుద్ధం మొదలైంది. ''సిరి నాకేలందునా గ్రాసవాసో దైన్యంబులు వచ్చు'' అన్న ధర్మరాజు మాట విస్పష్టంగా వుంది. మానవ సహజంగా వుంది. ఆస్తికోసం పోరాడాల్నా, బతికేది మూనాళ్ళు – ఎందుకు శషభిషలు – ముక్కు మూసుకొని మునివృత్తిలో వుంటే పోదా అన్న సమాధానం సరిపోదనీ; – అందునా అనుబంధాలు – పుణ్య పాపాలు – ధర్మా ధర్మాలు చర్చించాలనీ – ఒక తికమక ఏర్పడింది. ఇదంతా ఆనాటి సామాజిక నీతుల్ని అధిగమించే ధైర్యం మానవునికి వున్నదనీ – అధిగమించినాడనీ తెలిసి కూడా భారతంలో భగవద్గీతను ప్రయత్న పూర్వకంగా చొప్పించారని తోస్తుంది. సామాజాన్ని ఒప్పించి యుద్ధం చేయాలన్న తహ తహ తర్వాతి వారికి ఎందుకొచ్చిందో? బతుక్కోసం యుద్ధమైనా చేస్తాడు. ఆకలిని సృష్టించే వాన్ని అతిదారుణంగా కూడా చంపవచ్చు, లేదా ఆ వ్యవస్థ మారదు. అన్నార్థుల బాధలు ఘనీభవించినపుడు – దుఃఖం ఘనీభవించినపుడు – తీవ్రమైన ఆవేశం వస్తుంది. అప్పుడు ఎంత సాహసానికైనా మానవుడు పూనుకుంటాడు. అదే జరిగింది భారతంలో. అదే నిజం. అలాంటప్పుడు భగవద్గీత ఎందుకో? చేసిన పనిని సమర్థించేందుకు, సామాజిక నీతులనుండి రక్షింపబడేందుకు. ధర్మమూ, న్యాయమూ 'లేనివాని' ప్రక్కన ఉంటాయి. సామాజిక నీతులు – అడ్డు పడుతాయి. ఏమైనా–ఆకలికి పోరాటం జరిగి తీరుతుంది, జరిగింది. ఆ పని ధర్మబద్ధ మవునా కాదా? ధర్మబద్ధమని నిరూపించాలి. లేకుంటే కృతక నీతులు అన్నార్థులను పొడిచి చంపుతాయి. సమంగా బతుకుదామని ఆలోచించలేని కారణంగా కృతకమైన నీతుల్ని సృష్టించుకొన్నారు. తెంపరులు

సుఖాల్ని ఒడుచుకొనేందుకు ప్రయత్నం అనాదిగా జరుపుతున్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, మోసాలూ — అన్నీ వృద్ధి అయినాయి. అయ్యేటట్లుగా చేస్తూనే వున్నారు. ఎప్పటికప్పుడు కృతక నీతులు పుట్టి పెరుగుతూనే వున్నాయి. ఫలాపేక్షలేని కర్మ యోగాన్ని భగవద్గీత నొక్కి చెప్తుతుంది. అధర్మ వర్తనుడుగా పాపకూపాల్లో పడిపోతానేమోనన్న శంకకు పరిష్కారంగా ఎంత చెప్పాల్సొచ్చింది! కృష్ణుడు లేకున్నా యుద్ధం జరిగివుండేదే. కారణాలు బలీయమైనవి. త్రోసి వేయరానివి — గ్రాసవాసోదైన్యమ్ములు. "సకల ధర్మాలూ — కూట నీతులూ — అన్నీ ఆకలి మంటల్లో దగ్ధమవుతాయి" — అన్న గొప్ప సందేశం, — లేదా ఒక సంఘటనాత్మక సందేశం — భారతంలో ప్రతిపాదింపబడింది. అయితే భగవద్గీత ఎందుకూ — అన్నదే సందేహం. అందునా ఫలాపేక్ష లేని కర్మ యోగాన్ని నూరిపోయడం ఎందుకూ — ఫలాపేక్షలేని పనిని భగవంతుడు ఆమోదిస్తాడు అన్న విరుపులో వుంది కీలకం — కృతకంగా, బుద్ధిపూర్వకంగా భగవంతుని లాగినారని తోస్తుంది. అలసిపోయినాం, అష్టకష్టాలూ పడినాం, అన్నం లేకపోతే బతకలేం, అన్నంకోసం ఆకరు వరకూ పోరాడుతాం—అన్న ఇచ్ఛ—దీక్ష తప్పవుతుందా! అన్నార్థుని పోరాటాలకు అందరూ కలిసి వస్తారు. ఆ రూపంలో ఆ పోరాటాన్ని సమర్థించకపోగా, ధర్మాధర్మాల విచికిత్సలో జనాన్ని ముంచినారు. విచికిత్సలో ఎటూ తేల్చుకోలేని ఒకానొక సంక్లిష్టమైన సిద్ధాంతాన్ని భగవద్గీతద్వారా కల్పించినారు. గట్టెక్కినా మనుకొన్నారు. ఎవరితోనూ చర్చించాల్సిన పనే లేదు. "ఆకలిని సృష్టించేవాన్ని ఎవరైనా తుద ముట్టించి తీరుతారు" అన్నది భారతంలోని ముఖ్య సందేశంగా వుంది.

ప్రేతకళ

మెంటమ్ కవిరాజ్

స్నిగ్ధ లేని చీకటి రాత్రి
నగ్నంగా నాట్యం చేస్తుంది
చల్లని గాలి
తారు రోడ్డు దగాపడిన
ప్రేయసిలా దిగులుగా దీనంగా
ప్రయాణికుల పాదాల స్పర్శ కోసం
ఎదురు చూస్తోంది

వెలుగును చూస్తే
భయపడే వేట కుక్కలు
మెల్లగా బయటకు వచ్చి
ధైర్యాన్ని పుంజుకొని
కదిలాయి ముందుకు

ప్రాణాలు నిలుపుకోడానికి
మానాన్ని అమ్ముకొనె జనం
యిళ్ళల్లోఅంటుకొంటుంది
అలజడి.

వేటకు బయలుదేరిన గుంపు
పోటీపడి కొంటుంది
అందాన్ని కక్కుర్తిగా
తమ శక్తిని ప్రదర్శిస్తు.

విటుల పిలుపులతో
కటిక దారిద్ర్యాన్ని మరచి
రాత్రి రాణులు - ధాత్రిని ఏలాలని
కలలు కంటున్నారు.

దూరాన ఎక్కడో గంటలు
వేట కుక్కలు గూటి వైపు పరుగు.
రాత్రి కళకళలాడిన యిళ్లల్లో
ప్రేతకళ పేరుకుపోతుంది.

అపరాజిత విశ్వమహాకవి పాబ్లో నెరూడా

సోమసుందర్

అనుస్యూత మానవ చైతన్యాన్ని గురించి అన్యాపదేశంగా కీర్తిస్తూ అపరాజిత విశ్వ మహాకవి పాబ్లో నెరూడా ఒకరమణీయ కవిత రచించాడు. అందులో ఆయన యిలా అంటాడు:

"కొన్నాళ్లు మనిషీ ఆడమనిషీ
అనవరత సహయాత్రికులు
తర్వాత కొన్నాళ్లు గడిచాక
నేను జీవించడం విరమించాక
దయచేసి నా కోసం ఇక్కడే వెదకండి!
పాషాణాలకీ విషాద సాగరాలకీ నడుమ..
కాంతి ఝంఝులకీ పొంగే నురగలకీ నడుమ..
ఇక్కడే వెదకండి నా ప్రియ సోదరులారా
నా కోసం ఇక్కడే.. ఇక్కడే... వెదకండి.
ఇదే భూస్థలికి మళ్ళీ నేను తిరిగి వస్తాను.
ఇంత కన్న మరేం చెప్పను చెప్పండి?
నా కొక కంఠమూ లేదు
నా కొక వక్త్రమూ లేదు
కేవలమున్నానా ఒక పవిత్రాత్మగా
కనుకనే ఇక్కడికే మళ్లీ తిరిగి వస్తాను!
జల జల పారే నీరులా...
ఉదధి సనాతన హృదయంలా!
ఇక్కడే భూస్థలిలో నా మహాపరినిర్వాణం..
ఇక్కడే నా మహత్వపూర్ణ పునరవతరణం..
ఇక్కడే నేనిపుడు నిశ్శబ్ద పాషాణాన్ని
ఇక్కడే రేపు జలజీవన చైతన్యాన్ని!......"

అంటూ 'నేను మళ్లీ తిరిగి వస్తాను' అనే గీతంలో పాబ్లో నెరూడా కొన్ని దశాబ్దాల వెనుకనే మానవ చైతన్యం అమరమనీ అనంతమనీ ధ్వనిపూర్ణంగా ఒక గొప్ప కవిత రాశాడు. అట్టివాడు అమరకవి కాక మరెవరు?

పాబ్లోనెరూడా జీవితాన్ని పరామర్శిస్తున్నపుడు 1974 వ సంవత్సరాన్ని మరచిపోలేము. (అది జులై నెల. 12 వ తేదీ.) ప్రపంచమంతటితో పాటూ

చిలీ దేశం కూడా పాబ్లో నెరూడా 70 వ జన్మదినాన్ని వైభవంగా జరుపుకోదల చింది. కాని అదే రోజున ప్రపంచ కవితా ప్రియులు అతని అకారణ మృత్యువుకు, కాదు ఫాసిస్టు దుర్మార్గులు కావించిన హత్యకు దురపిల్లవలసి వచ్చింది.

ఇలాంటి వేలాది హత్యలతో ఫాసిస్టు కుట్రదారుల హస్తాలు రక్తరంజిత మయ్యాయి. ఆకస్మికంగా విరుచుకుపడి, ప్రజలను భయభ్రాంతులొనర్చి, కుట్ర ద్వారా దేశాన్ని తమ ఇనుప గుప్పిట బంధించిన ఫాసిస్టు జంటా, అమెరికన్ సామ్రాజ్యవాదుల వత్తాసుతో విజృంభించారు. ప్రజాతంత్ర విధానంలో ఎన్నికైన సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలద్రోసిన మరుక్షణం నుంచీ గత చరిత్రలో ఫాసిస్టు లంతా చేసిన సకల దుర్మార్గాలకీ చిలీని ఆటపట్టుగా మార్చారు.

(చిలీ ప్రజాతంత్ర చరిత్రను బలవంతంగా హంతకులు మలుపు తిప్పిన ఆ దారుణ సంఘటన గురించి మానవజాతి ఆక్రోశంతో ప్రస్తావించుకోక తప్పదు. 1973 సెప్టెంబరు 4 వ తేదీ అర్ధరాత్రి, లాటిన్ అమెరికన్ దేశాలలో ప్రముఖమైనదీ, ప్రత్యేక వ్యక్తిత్వంతో భాసిస్తున్నదీ చిలీ దేశంలో ఫాసిస్టు జంటా విజృంభించింది. ఎన్నికల ద్వారా ప్రజాతంత్ర హక్కులతో ప్రభుత్వం నిర్వహిస్తున్న అతి వాద ప్రజాస్వామ్యవాది సాల్వడార్ అలెండే గోస్సెన్స్ 1976 సంవత్సరాంతం వరకూ పరిపాలన సాగించవలసి వుంది. పాప్యులర్ యూనిటీ బ్లాక్ (ప్రజాతంత్ర సమైక్య సంఘటన) ప్రతినిధిగా, పార్టీ నాయకుడుగా స్వర్గీయ అలెండీ 1974 లో మెజారిటీతో ఎన్నుకోబడ్డారు. అంతవరకూ చిలీలో రాజ్యాధికారం నెరపుతున్న జార్జి అలెగ్జాండ్రీని చిత్తుగా ఓడించాడు అమెరికన్ గుత్తపెట్టుబడిదారీ వర్గాల అండ దండలతో అభివృద్ధి నిరోధకుల ప్రతినిధిగా తత్పూర్వం అలెగ్జాండ్రీ అధికారం లోకి వచ్చాడు. 1971లో జరిగిన ఎన్నికలలో ప్రజాతంత్ర సమైక్య సంఘటన ప్రతినిధులను ఓడించడానికి సి. ఐ. ఏ. (అమెరికన్ గూఢచారి శాఖ) ఏజెంట్లు విచ్చలవిడిగా కోట్లాది డాలర్లు వెదజల్లారు. బాహాటంగా ఎన్నెన్నో కుట్రలు జరిపారు. అయినా వాళ్ల పథకం పారలేదు తదాదిగా కక్షకట్టిన మితవాద అభి వృద్ధి నిరోధక వర్గాలు, అమెరికన్ పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధులైన సి. ఐ. ఏ. ఏజెంట్ల సహాయంతో కుట్రలు సాగిస్తూనే ఉన్నారు. అఖరికీ దుర్మార్గుల కుట్రలు 19 3 సెప్టెంబరు 4 వ తేదీని ఫలించాయి.)

అలెండీని దుర్మార్గంగా హత్య చేశారు. దేశాధికారాన్ని ఫాసిస్టు మిలటరీ జంటా హస్తగతం చేసుకుంది. ఈ కుట్రలో భాగంగానే అలెండీకి కుడిభుజంలా పరిగణన గౌరవాదరాలు పొందిన మహాకవి నెరుడాను హత్య చేశారు. దశాబ్దాలుగా కష్టించి ప్రపంచ సాహిత్యంతో నింపుకొన్న నెరూడా గృహగ్రంథాలయాన్ని అగ్నికాహుతి చేశారు స్వీయాభిరుచుల కనుగుణ్యంగా నిర్మించుకొన్న ఆయన సొంత యింటిని ధ్వంసం చేశారు. చివరికి నెరుడా అంత్యక్రియలకు ప్రజలెవ్వరూ హాజరు కారాదని నిషేధించడం వంటి అమానుష చర్యలకు సైతం పూనుకొన్నారు.

(అలెండీతో ప్రారంభమైన ఈ హత్యా పరంపర ఎన్ని వేల మందిని

పొట్టను పెట్టుకుందో సమాచారం తెలిపే నాథుడు కూడా లేకుండా దేశం తలుపులు మూశారు. దేశం మూతులు బిగించారు.)

రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుందుకు ఫాసిస్టులు జరిపిన కుట్రలో ఒక మహాకవి హత్య కావింపబడటం – ద్వితీయ ప్రపంచ యుద్ధం తరువాత ఈ ముప్పయేళ్ల కాలంలోనూ ఇదే ప్రథమం. కనుకనే ప్రపంచ సాహిత్య చరిత్రలో ఈ సంఘటనకు అత్యంత ప్రాధాన్యత వుంది.

పాబ్లో నెరూడాగా విశ్వవిఖ్యాతుడైన ఈ మహాకవికి తల్లి తండ్రులు పెట్టిన పేరు "నెఫ్తాలీ రికార్డో రెయిస్ బసాల్టో" అని. ప్రఖ్యాత ఛెకోస్లోవేకియా మహాకవి 'యాన్ నెరూడా' పేరునుంచి నెరూడా అనే పదాన్నీ, ప్రఖ్యాత ఆధునిక చిత్రకారుడు పాబ్లో పికాసో పేరు నుంచి పాబ్లో అనే పదాన్నీ – వారిరువురి పట్ల తనకు గల అపార గౌరవానికి చిహ్నంగా స్వీకరించి తన నామధేయాన్ని పాబ్లో నెరూడాగా మార్చుకున్నాడు. ఆ మార్పు ఎంత యాదృచ్ఛికంగా జరిగినా అదే ఒక మహత్తర సంఘటనగా మారి పాబ్లో నెరూడాకు అపరాజిత విశ్వకవిగా కీర్తిని ప్రసాదించింది.

నెరుడా తన 19 వ ఏట ప్రచురించిన 'ఇరవై ప్రేమగీతాలూ, ఒక నిరాశా గీతం' అనే తొలి కవితా సంపుటి ప్రపంచ ప్రఖ్యాతి నార్జించుకుంది.

1924 లో ప్రచురితమైన ఈ గ్రంథం ఒక్క స్పానిష్ భాషా ముద్రణల్లోనే (2,50,000) రెండు లక్షల ఏభయి వేల ప్రతులు అక్షరాలా అమ్ముడుపోయాయి. స్పెయిన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైన రోజులలో చిలీ రాయబారిగా నెరుడా స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఉంటున్నాడు. ఆ సందర్భంలో ఫాసిస్టులు విజృంభించి స్పెయిన్ ప్రజలను మేధావులను దారుణంగా హత్యలు జరిపి, వర్ణనాతీత దురంతాలు జరపడం నెరూడా ముఖాముఖీ పరిశీలించాడు. వేలాది స్పెయిన్ పౌరులు ప్రజాతంత్ర వాదులు, కవులు, కళాకారులు రాక్షస హత్యలకు గురిచేయబడ్డారు. అందులో ప్రధానుడు స్పెయిన్ ఆధునిక జాతీయ కవి గర్షియా లోర్కా.

ఈ హత్యా సంఘటనలు నెరూడా రాజకీయ అవగాహనలను మార్చివేశాయి. అతని మేధా జీవితంలో కొత్తమలుపు సంభవించింది. 1943 లో చిలీకి తిరిగి రాగానే అతను కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించాడు. దానితోపాటు అతని కవితా కంఠంలో సైతం నూత్న స్వరాలు ఆవిర్భవించాయి. అతని ప్రారంభ యౌవనం నుంచీ వెలువడుతున్న కవితావాణిని ఇది పూర్తిగా మార్చివేసింది. రీతి గతంగానూ వస్తుగతంగానూ కూడా ఈ మార్పు స్పష్టమైన నవ్యోజస్సును ద్యోతకం చేసింది. ఈ కాలంలో నెరుడా రచించిన కవిత్వమంతా ఫాసిజానికి వ్యతిరేకంగా గురిపెట్టబడిన ఫిరంగి మ్రోత! సామాన్య మానవుల శ్రమ జీవన స్వేద జలధిలో స్వార్థపరత్వం సుఖజీవన విలాస యాత్ర సాగించడం అతని కవితా హృదయం సహించ లేకపోయింది. పాఠకులు రేఖా మాత్రంగా అతని కవితా మహత్వాన్ని యీ క్రింది అనువాదం ద్వారా అవగతం చేసుకోగలరు: ఈ కవితా శీర్షిక 'ఓడ':

"మనం ఎప్పుడో చెల్లించేశాం
ఈ ప్రపంచానికి బాకీ ఉన్న కిరాయి
అయితే మరి, మనల్ని ప్రశాంతంగా
కూర్చుని కాస్త తిననీయరేం వీరు ?
కష్టాల్ని అదమరచి కాస్త కులాసాగా
మబ్బుల రంగుల్ని అవలోకిద్దా మనుకుంటామా
చలికాలపు మధ్యాహ్నాల హాయిగా
ఆతప స్నానంలో మైమరుద్దా మనుకుంటామా
సముద్రం మించి వీచే ఉప్పని గాలిని సుఖంగా
పీల్చు కుందా మనుకుంటామా —
నిజాయితీగా చెప్పండి మీరు ?
మేమెవరినైనా చిత్ర హింసలు చేశామా ?
చెప్పరేం చెప్పండి !
మా గురించి ఒక్కటే నిరాడంబరపు మాట -
మేమంతా యాత్రికులం.
మేమంతా చరిత్ర తరంగాల మీదుగా
పయనిస్తూంటే మమ్మల్ని అనుసరిస్తోంది కాలం !
పురోగమిస్తున్న మానవ సాగరం
సదాశయ వేలా వలయితం !
ఎర్రని గులాబులు మమ్మల్ని చూసి చిరునవ్వుతూ
వీడ్కోలు చెబుతున్నాయి ; సెలవడుగుతాయి.
మా నీడల క్రింద పరచుకొన్న పుడమి
వెలుతురు వైపుగా సాగిపోతుంది.
మేమూ - మీరూ
ఒకే కాల జలధిలో తేలుతున్నాం.
అంతా అనవరత యాత్రికులం !
ఐతే దేనికి మీకంత తాపత్రయం ?
ఎందుకు మీకంత ఆగ్రహోదగ్రం ?
చేతిలో రివాల్వర్ ధరించి
మీరెవరి కోసం వెదుకుతున్నారో చెప్పండి !
మాకు తెలియనే తెలియదే
మా సర్వస్వం కొనిపోబడిందన్న సంగతి.
కప్పులూ ఆసనాలూ పడకలూ
మా అద్దాలూ ద్రాక్షరసాలూ కొని వేయబడ్డాయి.
ఆఖరికి మా గగనాన్నీ సాగరాన్నీ సైతం
మానుంచి కొల్లగొట్టారు మీరు !

ఇదంతా మాకిప్పుడిప్పుడే తెలుస్తోంది.
ఇదంతా తిందామని కూర్చుందుకు
మాకో టేబిలు కూడా లేదాయె!
ఇలా జరగడానికి వీల్లేదని
మేమిప్పుడిప్పుడే గ్రహించాము.
మా మనసుల నిండా ఆలోచనలు ప్రవహించాయి
ఆలోచనలు చర్యలుగా పరివర్తించాయి.
ఇకపై మీరు మమ్మల్ని మభ్యపెట్టజాలరు!

మేమీ ఓడకు చేరుకొనే సరికల్లా
సర్వం చీకటి మయంగా ఉంది.
మేమూ నిల్చుని ఉన్నాం నగ్నంగా
మన మందరం ఒకే స్థలం నుంచి వచ్చామా –
మనమంతా నరనారీ హృదయ రేఖలమై
నేరుగా పుడమి కవతరించామా –
మన కందరికీ మొదట తెలిసింది ఆకలి
తర్వాత కదా తెలిసింది మొలిచాయని పళ్ళు
మేమూ రెక్కల్ని విప్పుకున్నాం
చాకిరీలతో ముక్కలు చేసుకుందుకు!
చారడేసి కన్నుల్ని తెరిచాం
మన చుట్టూవున్న ముళ్ళను పరికించడానికి.
ఓడలో ఖాళీ లేదని చెప్పడానికి
ఎవ్వరికీ హక్కు లేదు!

ఈ లోకాన్ని ఎలా కలయ తిరగగలం?
టేబులు ఒకటైనా లేకుండా తిండి ఎలా తినగలం?
ఒక కుర్చీయో బల్లో లేకుండా కూర్చోడం ఎలా?
మా జీవితాలు అపహాస్యమై పోయిన హాస్యోక్తులు . . .
కనక ఇదే చివరి మాట; నిర్ణయించుకొండి
పెద్ద మనుషుల్లారా మాకింక తాలిమి లేదు
ఈ దుస్థితిని మేం త్వరగా అంతరింప చేస్తాం!
ఇక మా నిశ్చయానికి తిరుగు లేదు.
ఇకనైనా కొంచం తీవ్రంగా ఆలోచించండి.
సముద్రం గంభీరంగా గర్జించడాని కింకెంతో
ఆలస్యం పట్టదు; ఇదే వినండి మా హెచ్చరిక!
అప్పుడు రక్తం కుంభీపాతంగా వర్షించక మానదు!

మమ్మల్ని కూడా సాదరంగా పలకరించేందుకు
మీ రాజసం అంగీకరించదు.

మమ్మల్ని మనుషులుగా గుర్తించి కనీసం
మాతో ఆటలాడు కుందామనైనా తోచదు మీకు
అవును మరి మీరు మాతో స్నేహం
ఎలా నెరపగలరు ? పై బెర్తులో సదుపాయంగా
కూర్చుని ప్రయాణించే రాజబాబులు !
మేము తయారుచేసిన వెండి చెమ్చా
మీరు పుట్టక ముందే మీకందించాం !
ఐనా మీకిక్కడ పాపం సుఖ సంతృప్తులు లేవు
ఈ విధంగా రోజు లెన్నాళ్ళో గడవవు !
నేనా ఈ అసౌకర్య యాత్ర సాగించలేను
దుఃఖం మారుమూల క్రీనీడల్లో దాచుకొని
ఎంతకాలం చిరునవ్వుతూ బ్రతకను ?
ప్రేమలెరుగని కళ్ళతో, ఆకలి నిండిన నోళ్ళతో –
మా చుట్టూ విషవక్త్రంలా హేమంత శీతువు
మేమిలా నిలబడి పోయాం వివస్త్రులమై!
లేమి . . . లేమి . . . లేమి . . .
ఎన్ని చలికాలాలు గడిచినా ఒకే దీర్ఘ దరిద్రం !
మా కాళ్ళకా బూట్లు లేవు
ఎలా నడవగలం ? సూది మొనల మంచు రాళ్ళలో ! ?

ఇలా సాగిన ఓడ అనే కవితలో వర్గవైరుధ్యం కళామయంగా చిత్రిస్తాడు నెరుడా ! కవితాభివ్యక్తిలో వ్యంగ్య వైభవం ఎంత ప్రాధాన్యత వహించాలో నెరుడాకు బాగా తెలుసు. జలరాసి దుర్భర జీవితానికి ప్రతీకగా నిలుపబడితే – ఓడ లోకపు జీవన యాత్రకి ప్రతీకగా నిలుపబడుతుంది. కలిమి లేముల వర్గ వైరుధ్యంతో లోకంలో శాంతి సౌష్ఠవాలు అభాస మవుతున్నాయి. ఈ విషమ పరిస్థితి ఎక్కడ ఉన్నా మహాకవి నెరుడా, లోకం గుండె లోపల గుండెలా అలారం మ్రోగిస్తూనే ఉంటాడు. నెరుడా కళామయ కవితా కంఠం హెచ్చరిస్తూనే ఉంటుంది.

నా దేశం.... పాబ్లో నెరూడ

నా చిన్న దేశంలో
చిరువేరులన్నా నాకు మనసే,
వెయ్యిసార్లు చావు నాకు రాసున్నా
అక్కడే చస్తాన్నేను,
వెయ్యి జన్మలు నాకు రాసున్నా
అక్కడే పుడతాన్నేను,

అంబరాన్ని అందుకునే
అటవీ దేవదారుల దగ్గిర –
తుపానులు రేగించే
దక్షిణ వాతూలం దగ్గర –
నిన్ననే కొనుగోలు చేసిన
గంటల దగ్గిర.

ఆంగ్ల మూలానికి అనుసరణ : పుప్పాల లక్ష్మణరావు

'వుద్ధరిణి'

(మినీ కథ)

వి. కె. విశ్వనాథ శర్మ

"నువ్వొట్టి సోర్దపరుడివయ్యా!"

"అలాటి వాణ్ణయితే నీ వూసెత్తే వాణ్ణి కాదు."

"మరి నువ్వు సేసిందేంటయ్యా! నేను బికారి ఎదవనని పదిమందికీ సూపించావ్. నన్ను డబ్బునోళ్ళు పెత్తందార్లు సితగ్గొట్టారన్నావ్. నా బార్య బిడల్ని సొసుతైనారని బజార్నెట్టావ్. ఆకలి .. ఆకలి అని అరిసే అనాకారులుగా, అమాయకులుగా చేసావ్. ..."

"నిన్ను కించ పరచాలని కాదు. పది మందీ నీ మీద జాలి పడాలనే చేసాను."

"ఎందుకయ్యా? అంత తెలివిగా తప్పుకుంటావ్? ముందు నీ కసలు జాలేసిందా?"

"మళ్ళీ మొదటి కొస్తున్నావ్ పద్దయ్యా! నిన్ను చూసి నా గుండె కరగబట్టే ..."

"నీకే కాదయ్యా! నన్ను సూసి నోళ్ళు కందరికీ గుండె కరుగుద్ది. కళ్ళు కాలవలౌతయ్ మరి ఆదుకుందెవురు? నా గోసీ గుడ్డను మార్సిందెవురు? నా బార్యా బిడ్డల ఆకలి తీర్సిందెవురు? మాటల్లో మురిపించటమేగదయ్యా అందరికీ సేతయింది?"

"పద్దయ్యా! నువ్వు అతిగా వాగుతున్నావ్. ఏదో అట్టడుగున అలమటించి పోతున్నావని దయ తలిస్తే ఇష్టమొచ్చినట్టు కూస్తున్నావా? అసలు మీరు అలానే చావాలి. మిమ్మల్ని వుద్ధరించమని లోకానికి చెబటం నాదే తప్పు."

"హు! వుద్దరింపు! ... ఎక్కడ నేర్చావయ్యా ఆ మాట. ఎవురు నేర్పెరయ్యా! ఔన్లే .... సదువుకున్నోడివి. సమాజసేవ సేస్తున్నోడివి. నాబోటోళ్ళ కదల్ని ఒకటికి పది కల్పించి రాసి డబ్బు సేసుకుంటున్నావ్. నా పొట్ట ఎండిపోయిందని లోకానికి సెబుతూ నీ పొట్ట నింపుకుంటున్నావ్. నా బోటోడికి పైసా దరమం సెయ్యలేనోడివి, నా కద కన్నీటి కదగా సెప్పిపది మందినీ దరమం సెయ్యండని సెబుతావ్. బావుందయ్యా నీ వుద్ధరింపు."

పేలవంగా నవ్వేడు పద్దయ్య.

"పద్దయ్యా! ..." తన వ్యక్తిత్వానికి జల్లెడ తూట్లు పొడుస్తున్న 'పద్దయ్య పాత్ర' మీద కోపంగా, వెర్రిగా అరిచాడు ప్రఖ్యాత కథా రచయిత పరశురామయ్య. అతని కలం పేరు 'వుద్ధరిణి.'

యీశ్వరుడంటారు 'నువ్వు గొప్ప శాంతిలో వున్నావు – ఆ సంగతి గుర్తించగల శక్తి ఇంకా నీ మనసుకి లేదు" అని.

ఐనా, కోడి కూరలేని శాంతి అదేం శాంతండీ! ఎవరన్నా నవ్వుతారు. పోనీ ఆవకాయ ఐనా లేదు. ఎందుకంటీ ఆవకాయలేని స్వర్గం! .... (పుట 287)

మాట్లాడకు. ఆలోచించకు. చెయ్యకు, కాని మాట్లాడకండా, చెయ్యకండా, ఆలోచించకండా వుండాలని ప్రయత్నం చెయ్యకు - అగిపో మాటల్ని, ఆలోచనల్ని వాటి ఇష్టం ఒచ్చినట్టు జరగనీ. నువ్వు చెయ్యకు. చెయ్యనని కూచోకు, మాట్లాడకు, మాట్లాడసనకు, నువ్వు నీగా ఆలోచించకు. ఆలోచనల్ని వాటి దోవన వాటిని పోనీ.

అదీ భగవాన్ వేదాంతం! (పుట 81) – 'మహాస్థాన్‌లో' చలం

ఆడపిల్లల తండ్రి

కథానిక

చామర్తి దుర్గాప్రసాద్

అతను దాదాపు రెండు సంవత్సరాలు ఇంటికి, దేశానికి దూరంగా ఉన్నాడు. ఆ రోజుల్లో ఏకాంతాన్ని, ఒంటరితనాన్ని, దిగులునీ చంపడం తెలీక అనేక భాషల సాహిత్యంలో వస్తున్న తీరు తెన్నులు పరిశీలించాడు.

అగ్ని పర్వతాలు, అనంత సముద్రాలు, జెట్ విమానాలు, ఎడారుల నిట్టూర్పులు, ప్రళయాల గర్జనలు ఆ భాషల్లో వస్తున్నాయి.

అతనికీ ఉద్రేకం వచ్చింది. కాగితం మీదికి కలం ఎక్కింది. ఇంటి నుంచి వచ్చిన ఉత్తరంలో విషాదమయిన ఆత్మహత్య చదవగానే అతనికి నిద్ర పట్టలేదు. నాలుగు రోజులు పెనం మీద వేగిపోయ్యాడు. ఆ సంఘటన నవల్లో పాత్రకి ఊపిరి పోసింది. ఆ తర్వాతే అతనికి నిద్ర పట్టింది.

మరోసారి టీ. వి. లో భారత దేశంలో వీధులు చూసి, అన్నం కోసం అలమటిస్తున్న అనాథల కడుపుల్ని చూసి, దరిద్రుల గుంపుల్ని చూసి స్నేహితులు "ఈ దురంతం ఎందుకు ఆపలేక పోయినారు – సిగ్గు వెయ్యడం లేదూ" అన్నప్పుడు, అతనికి తను తింటున్న ప్రతి రొట్టి ముక్కా ఎవరి దగ్గరి నుంచో తను కాజేశాననిపించింది. ఆ నవల్లో పాత్ర కది ఆహార మయింది.

వరద మూలాన జరిగిన బీభత్సం కోసం తాము పంపిన డబ్బు చేరవలసిన చోట్లకి చేరలేదని ఒక సంస్థ చేసిన ప్రకటన అతని దృష్టికి వచ్చినప్పుడు, తన ప్రజల అవినీతి పట్ల కోపమూ, అది సహిస్తున్న తనలాంటి వారిపట్ల అసహ్యమూ కలిగినై. తల ఎత్తుకొని తిరగలేకపోయాడు. కాగితం మీద ఆ అసహ్యం లావాలా ప్రవహించింది.

తన బాధలకి రూపకల్పన ఆ కాగితాలు. తన్ని బాధల నుండి కాపాడి ఓదార్చినవే ఆ కాగితాలు.

తన ఊపిరి, ప్రాణం, చేతన అవి.

ఈ నవలని కస్టమ్స్‌లో మర్చిపోయి ఎంత ప్రయత్నించినా దొరక నప్పుడు, అతనికి ఎంతో కావల్సిన ఆత్మీయుల్ని పోగొట్టు కున్నంత బాధ కలిగింది. అతని ముఖాన్ని చూసి 'కస్టమ్స్‌లో బాగా టాక్స్ వేశాడా' అని అడిగారు మిత్రులు "అంత డబ్బు మిగల్లేదేమో! డబ్బు తెచ్చి కారు కొందామను కున్నాడు. ధరలు పెరిగినై". ఇలా వెక్కిరించారు.

తన బాధ ఎవరికి తెలుసు?

ఇంటికి రాగానే పార్సెల్ ఎదురు చూస్తోంది. పదేళ్ల క్రితం ప్రచురిస్తానని తీసుకున్న ప్రముఖ సంస్థ తిప్పి పంపిన తన నవల. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం రాసింది.

కష్టపడి పెళ్ళి చేసి పంపిన కూతురు గీత చెడి వచ్చి నంత బాధ కలిగింది.

ఆ పార్సెల్‌ని బీరువాలో పెడు తుంటే కనపడ్డాయి, ఎన్నో వ్రాత ప్రతులు – దిగులుగా కన్నె చెర విడి పించ మంటూ.

ఒక్కర్తెకూ పెళ్ళి చేయలేని తను మరో కూతుర్ని కనడం ఎంత పాపం!

ఆ పాపానికి ప్రాయశ్చిత్తం తను అనుభవించ వలసిందే.

సాలె గూడు కవి

ఎస్వీ

క్రవీ !
ఇప్పుడిప్పుడే సాహితీ ప్రపంచంలోకి అడుగెట్టి
భావి తరాలకి పథ నిర్దేశం చేయనున్న నువ్వు
ఆ అస్పష్టపు భావజాలపు గేయేంద్ర జాలంలో యిరుక్కుపోయి
నీకే అర్థం తెలీని వక్రరేఖల నిర్మాణాన్ని కావించి
వాటిలో ఏదో సంకేత ముందనీ - సందేశముందనీ
సందేహం తప్ప మరేమీ సాధించలేని
నీ భ్రమల పరిధుల్ని దాటి
పరస్పర భజనల తప్పట రావాల్ని వొదిలి
విశాలమైన అభ్యుదయ కవితా ప్రస్థానం లోకి రా !
ఇంకా - నీకు నువ్వే ఒక గమ్యాన్ని నిర్మించుకోలేక
ఎటు వీచే గాలికి అటు ఊగిసలాడి పోతూ
కొందరు ఉద్రేకవాదుల సాహితీ ఏకపాత్రాభినయాలను వీక్షించి
ప్రస్తుతిస్తూ - నువ్వూ వాళ్ళ పిల్ల కవిగా మారి
వారి కన్‌ఫ్యూజియన్ పద చిత్రాల్లో ఏదో వుందని
ఎండిన మొక్కలా ఊగిపోతూ
నాలుగు పుస్తకాలు నెమరేసి
అయిదో నాడు కవిత్వమిదంటూ కక్కెయ్యడానికి యత్నించే నువ్వు
ఆకాశ స్ఖలనాలను ఊహించి ఆనందించడం కాదు కవీ !
అరిగిన చెప్పుల కింది యదార్థాల్ని గ్రహించు -
బార్‌లో విస్కీ తాగి కవితాపిండాల్ని ప్రసవించడం కాదు కవీ !
నేరుగా చెమటోడ్చి బాధల గాథల్ని విరచించు -
చదవ్వాల్సింది కేవలం పుస్తకాలే కాదు కవీ !
ఎద పలికే జీవితపు అనుభవాల అగాథాల్ని పఠించు
నిన్ను - నువ్వూ - నీ చుట్టూరా నలుగుర్నూ పొగిడితే చాలదు
నువ్వు మార్చాలనుకుంటున్న సమాజం అర్థం చేసుకోవాలి -
అందుకే - నీ అస్పష్టపు భావాజాలాన్ని వొదిలేయ్ కవీ !
వాస్తవికపు జీవ జ్వాలల్ని రగిలేయ్ రవీ !

గాలి సార్వత్రికం, ప్రాదేశికం కాదు. దురితవిలంబితాలు పట్టవచ్చునే కాని, ప్రపంచం అంతటా వీస్తుందది.

కనక, ప్రపంచంలో వొకచోట పుట్టిన నూతనభావాలు, నూతనాభిరుచులూ మరోచోటా ముమ్మకుంటా యెప్పటికయినా. అవి కవులను, రచయితలనూ స్వయంగా ఉద్రిక్త పరుస్తాయి. దానివల్ల నూతన నిర్మాణాలున్నూ జరిగిపోతా యెక్కడికక్కడ. — శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

సమకాలీన సంఘం, సాహిత్యం

అక్కిరాజు రమాపతిరావు

ముందేం జరుగుతుందో స్పష్టంగా తెలియదు కాబట్టి, వర్తమాన పరిస్థితులను గడచిన కాలంలో క్రమక్రమంగా వచ్చిన మార్పులతో పోల్చుకుంటూ దిగులు పడటమో, ధైర్యం తెచ్చుకోవడమో ఏదో చెయ్యాలి.

ఇప్పటి పరిస్థితులు నింపాదిగా శ్రద్ధగా జాగ్రత్తగా ఆలోచిస్తే చాలా నిరాశకే అనుకూలంగా వున్నాయి, అలంబనంగా వున్నాయి. ఇప్పటి పరిస్థితులు ఏమిటి ? వీటిని ఏవిధంగా చక్కదిద్దుకోవాలి అని బుద్ధిమంతులు ఆలోచించడం లేదు. నిరాశ పడిపోయి చేతులు పిసుక్కుటూ కూచొనిపోవడం మంచిది కాదు. కాని ఏదో చేస్తున్నట్లు చూస్తున్నట్లు ఆలోచిస్తున్నట్లూ హంగామా చేయడంవల్ల ప్రయోజన మేముంది? ఎక్కడ చూసినా అలసభావం, అవగాహన లేకపోవడం, ఏదో విధంగా అప్పటి కాపబ్బం గడుపుకొని దాటుకొని పోవడానికే చూడ్డం. చదువుకున్న వాళ్ళని లేదు, చదువుకోని వాళ్ళని లేదు. నా పని గడుపుకుంటే చాలు, నాకు కావలసిన ప్రయోజనం సిద్ధిస్తే చాలు అనుకోవటమే.

ఇటీవల ఆంధ్ర బ్యాంక్ వాళ్ళు 200 గుమాస్తా ఉద్యోగావకాశాలను ప్రకటిస్తే డబ్భై అయిదువేల దరఖాస్తులు వచ్చినట్లు హిందూ పత్రిక రాసింది. మహా భయంకరమైన ప్రమాణాలతో నిరుద్యోగ సమస్య తరుముకొని వస్తున్నది. అయినా కమిటీలు, సలహాలు, సంప్రదింపులు, వృత్తి విద్యావకాశాలు, ఉపాధి కల్పన కోర్సులు అంటూ పెద్ద పెద్ద కబుర్లు పత్రికల్లో కనబడ్డం తప్ప నిర్మాణాత్మకంగా, సుసంఘటితంగా సమాజ చైతన్యం ముందుకు కదలటం లేదు.

విశ్వవిద్యాలయాలలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, స్తుతిప్రియత, కులాభిమానాలు, అర్హతకు నిరాదరణ, అనర్హతకు అవకాశాలు అని విద్యార్థులు, పిన్నలు పెద్దలు అందరూ చెప్పుకుంటున్నారు. విశ్వవిద్యాలయా లన్నిటా అలజడులు, ఆందోళనలు, అశాంతి, పత్రికలలో నిత్యకృత్యాలుగా కనపడుతున్నాయి. ఈ మధ్య ఉస్మానియా విశ్వవిద్యాలయాధ్యాపకులపై కొందరు విద్యార్థులు చేయి చేసుకోవడం జరిగింది. సిటీ బస్సుల్లో ఈ దౌర్జన్య కాండకు దారితీసిన పరిస్థితులను గూర్చి, ఔచిత్యా నౌచిత్యాలను గూర్చి పౌర జనాభిప్రాయంలో వివిధ దృక్పథాలు వెల్లడైనాయి. విద్యార్థులలో అసంతృప్తికి, వాళ్ళకు జరిగిన అన్యాయాలకు అది ఒక బాహ్య ప్రకటనం మాత్రమే అన్న అభిప్రాయాన్ని వెల్లడించిన వాళ్ళు కూడా వున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలకు ఇంత లంచమిచ్చాం, ఇంత ఖర్చుపెట్టామని బహిరంగంగా బస్సుల్లోనూ, రోడ్ల మీదా చెప్పుకుంటూనూ వున్నారు.

సామాజికమైన బాధ్యతలు గాని, సంఘటితమైన ప్రతిఘటన కాని ఎక్కడా కనపడవు. అశాంతి, అల్లరి, కసి, క్రోధం అదుపులో పెట్టుకోవడానికి అతికష్టం

మీద శ్రమ పడుతున్న వాళ్ళూ; ఇది మా కర్మం, ఈ పరిస్థితులు మారవు, ఇది ఇంతే అని సరిపెట్టుకొనే నిరాశాపరులూ; అత్యున్నత స్థాయి నుంచి అట్టడుగు స్థాయి వరకు ఆత్మవంచన, అబద్ధాలు, ఇవీ ఇవాళ సాధారణ పరిస్థితి.

ఇటీవల అభ్యుదయ రచయితల వార్షిక సమావేశాలు జరిగాయి కదా. సాంఘిక సమస్యలను గూర్చి ఏమైనా వాళ్ళు చర్చించారా? చాలమంది అలవాటు చేస్తున్న అల్పస్థాయి పత్రికల ధోరణులను గూర్చి ప్రకటించారా? యువ చైతన్యాన్ని సంఘటిత పరచడానికి ఏమాలోచనలు చేశారు? విశ్వ విద్యా లయాలు వాడుక భాషను ఆమోదించాలన్న తీర్మానానికి ఎప్పుడో కాలదోషం పట్టింది. అదొక గొప్ప సమస్య కాదు. వీళ్ళు ఏ భాషలో ప్రశ్న పత్రాలు రాసినా తర్వాత ఏం చెయ్యబోతున్నారు? కుహనా విద్వాంసులు, కపట పండితులు, వీళ్ళను ఏ విధంగా ఉద్ధరించ గలుగుతారు? ఈ దేశంలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో నూటికి పందొమ్మిది మంది కూడా మహిళల్లో అక్షరాస్యత లేక పోవడం, మగవారిలో కూడా నూటికి ముప్ఫైకొక్కడా అక్షరాస్యత చేరకపోవడం గురించి ఆలోచించారా? ఆధునిక భాషా శాస్త్ర పరిశోధనల పేరిట, ద్వితీయ భాషా బోధనా మధ్యమంగా తెలుగుని దిద్దితీరుస్తారట. అహో ఆత్మవంచన, డంబాలు. అమెరికాలో తెలుగు భాషని గూర్చి అద్భుతమైన పరిశోధ జరుగు తున్నది నీకు తెలుసా, తెలీకపోతే ఎందుకు పనికి వస్తావు అంటున్నారు. మాండలిక భాషాధ్యయనం స్పుట్నిక్కు వేగంతో ఆకాశపు దారులంట ప్రయాణం చేయిస్తారుట.

సుమారు నూరేళ్ళ క్రితం, అంటే 1881 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశపు జనాభా 16 కోట్ల పైచిలుకు కొన్ని లక్షలు. 1936 లో ముప్ఫై అయిదో ఆరో కోట్లు. పంధొమ్మిది వందల అరవైరెండు ప్రాంతంలో నలభై రెండు కోట్లు, మళ్ళీ 1981 వచ్చే నాటికి 61 కోట్లు మించవచ్చు. నూరేళ్ళలో అంకెలు తిరగబడ్డా యన్నమాట. గ్రామాల్లో ముఠాకి, అనారోగ్యం, అవివేకం, అమాయ కత్వం. ఎప్పుడిక పరిష్కారం కావడం? నగరీకరణం ద్వారా పెరిగిపోతున్న అనర్థాలకు అంతెక్కడ?!

1881 లో విద్యాధికులలో సంఘాన్ని సరిదిద్దుకోవాలని ఎంత ఆర్తి వుండేది! ఎన్ని ప్రయత్నాలు చేశారు! ఎంతటి భావ విప్లవం తీసుకొని రావాలని కృషి చేశారు! ఇప్పుడలాటి ప్రయత్నాలు ఎక్కడైనా జరుగుతున్నాయా సొంత లాభం చూసుకోకుండా!

స్వప్రయోజన తత్పరత్వం ఉండకూడదని ఎవరంటారు? స్వార్థం ఉండ కూడదని ఎవరంటారు? – సాముదాయిక ప్రయోజనాలకు భంగం కలిగించ కుండా వున్నంతవరకు! మంచి నీళ్ళకు నోచుకొని దేశంలో వ్యక్తి స్వేచ్ఛ పేరిట మద్యపాన నిషేధాన్ని వ్యతిరేకించే మేధావి వర్గపు ఉన్మాద భావ స్వాతంత్ర్యాన్ని గూర్చి నవ్వాలా? ఏడ్వాలా? మనుషులు కల్తీసారా తాగి సామూహిక మరణాలు పాలవుతున్నారు. నూరు సంవత్సరాలు గడిచినా అవివేకపు మత కలహాలు మాసి పోలేదు. 1882 వ సంవత్సరంలో సేలంలో జరిగిన మత కలహాలలో సంభవించిన

ప్రాణ నష్టాన్ని గూర్చి, ప్రజల్లోని అవివేకాన్ని గూర్చి నొచ్చుకుంటూ వీరేశలింగం వివేకవర్ధనిలో రాశాడు. దేవాలయం ముందో, లేదా మసీదు ముందో, వీరి ఊరేగింపో, వారి ఊరేగింపో సాగి వెళ్ళడంలో పాటించాల్సిన మర్యాదలు పాటించక పోవడంవల్ల ఆ కల్లోలాలు జరగడం ఎంత సిగ్గుచేటు అన్నాడు వీరేశలింగం. అదోనిలోనూ అలిగడ్‌లోనూ ఇవాళ్ళ కూడా ఈ అల్లర్లకు, అశాంతికి కారణాలేవిటి ? మానవ జీవితంలో నయం కాని వ్యాధులలాగానే, ఈ సంఘర్షణలు, సంఘాత మరణాలు సాగుతూ వుండవలసిందేనా!

"కోర్టు ప్రమాణాల బద్ధముల న్యాయములకు, పోలీసు స్టేషనులు దొంగతనములకు, మ్యునిసిపాలిటీ మురికికి, దేవతాలయములు వెలయాండ్రకు, తీర్థముల పరిశుద్ధికి, కల్మి పాపమునకు, విద్య మోసముకు హేతు భూతములుగా దోచెడిని" అన్నారు అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారు తమ నాటి పరిస్థితులను గూర్చి చెపుతూ. ఇప్పుడు దేవతాలయముల్లో వెలయాండ్ర గౌరవం మాత్రం కనపడదేమో !

వెలయాండ్ర బాధే కాదు. రౌడీల ప్రాభవం కూడా తప్పిపోయింది రాజకీయ ప్రయోజనాల విషయంలో తప్ప. ఇంకా పెత్తందార్లు, వాళ్ళ నమ్మినబంట్లు, గ్రామీణ ప్రాంతాలలో తమ బలాన్ని అడపా దడపా ప్రదర్శిస్తూనే వున్నట్లు వింటూ వున్నాం, కంటూ వున్నాం. అయితే ఏభై అరవై సంవత్సరాల క్రితం వరకూ, చిన్న చిన్న నగరాలలో కూడా ఈ రౌడీ ముఠాలు, వారిని కొందరు పెద్ద మనుషులు పోషించటం, ఊళ్ళోవాళ్ళు ఈ రౌడీలకు భయపడటం జరుగుతూ వుండేది. నాటక ప్రదర్శనల వాళ్ళూ, మున్సిపాల్టీ రాజకీయాల వాళ్ళూ ఈ రౌడీ ముఠాలపై ఆధారపడుతూ వుండేవాళ్ళు ప్రకాశం పంతులుగారి స్వీయచరిత్రలో ఆయన కాకినాడలో ఇటువంటి రౌడీ ముఠాతో తలపడ్డం వుంది.

ఈ మధ్యనే విశ్వనాథ సత్యనారాయణ గారి ఆత్మకథ వెలువడింది. మేఖల అనే విశ్వనాథ స్మారక సాహిత్య పత్రికలో ఆయన యిలా రాశారు :

"ఆనాడు బందరు పట్టణములో పెద్ద పెద్ద రౌడీ ముఠా లుండెడివి. నాకు తెలిసిన దానిని బట్టి చూడగా నప్పటి బందరు బెజవాడ ఏలూరు మొదలగు పట్టణములు కొద్దిలో చికాగో పట్టణముల వంటివి. ఎక్కువ భాగము రౌడీల ముఠాలు పరిపాలించెడునట్టివి. మా పాఠశాల వెనుక పెద్దబంగర బయలు. కోపములున్నచో నక్కడికి రమ్మనుట. రెండు పక్షములచ్చట చేరుట. కర్రలతో చేతులతో తలపడుట. ఒక్కొక్కప్పుడు కత్తులతో . . ."

ఈ బాధలిప్పుడు తప్పి పోయినాయి. అంత తీరిక కాని వోపిక కాని సమాజంలో ఇప్పుడెవ్వరికీ లేదు. ఇది మంచికి వచ్చిన మార్పే. దర్శి చెంచయ్యగారి 'నేనూ – నా దేశం'లో కూడా ఈ రౌడీమూకల ప్రస్తావన వుంది. కావలిలో ఆయన ఒక రౌడీతో తలపడటం వాడి పొగరు కాస్తా అణచటం గురించి చెప్పారు.

అన్నట్లు చెంచయ్య గారు గుర్తు రాగానే ఒక విషయం బాధిస్తుంది "నేనూ – నా దేశం" వంటి గొప్పరచనను గూర్చి యువతరం వాళ్ళలో ఎందరికి తెలుసు? విద్యాలయాలలో, విద్యాధికారులలో పండితోత్తములకు, అధికారమ్మన్యులకు

ఎందరకు తెలుసు? ఈ గొప్ప గ్రంథాన్ని ఏదో స్థాయిలో పాఠ్యపుస్తకంగా గాని రిఫరెన్సు గ్రంథంగా గాని పెట్టరు. తలచుకోరు. ఒక సాహిత్య వేత్తను, తగిన అధికారాలను అనుభవించిన వ్యక్తిని దరిశి చెంచయ్యగారి 'నేను-నా దేశా'నికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావలసి యోగ్యత వున్నది కదా, ఎందుకు రాలేదు? ఎప్పుడైనా ఎవరైనా అనుకొన్నారా? ఆలోచించారా అని అడిగితే, ఇష్టం లేని ప్రశ్నను అడుగుతున్నట్లుగా ఆయన అనుకున్నట్లు స్పష్టపడింది.

బహిరంగంగా అనడానికి సంకోచించ వచ్చునేమో కాని, విశ్వ విద్యాలయ స్థాయిలో కాని, ప్రభుత్వ యంత్రాంగం పూనుకొని నిర్ణయించే స్థాయిలో కాని, పాఠ్య పుస్తక నిర్ణయంలో అనేకతవలు, అక్రమ లావాదేవీలు ఎన్నో జరుగుతుంటాయని అందరూ అనుకొంటూనే వుంటారు. అంటూనే వుంటారు. కాని పిల్లి మెళ్లో గంట కట్టడానికి ఏ ఎలుకకీ ధైర్యం వుండదు కదా. బలంలేని వాడా జోలికిపోతే భంగపాటు తప్పదనే భయం మాత్రం వుండదా!

ఇక ఘోరాతిఘోరమైన దౌర్భాగ్యం, నేటి సినిమా వ్యాపార ధోరణి. జీవితంతో ఏమాత్రం పొత్తు కలవదు. అత్యంత అవాస్తవికమైన ధోరణులతో అది తరుణ హృదయాలను భ్రమల పాలు చేస్తున్నది. అంతేకాని సామాజిక బాధ్యతాజ్ఞానాన్ని కాని మానసిక వికాసాన్ని గాని ఏమాత్రమూ కలిగించడం లేదు.

ఇక సాహిత్యం సంగతి. వికాసం కన్నా వినోదం ప్రాధాన్యం. లేదా ఫాషనబుల్ తిరుగుబాటు ధోరణి. ఆత్మ వంచనతో కూడిన వుత్తుత్తి విప్లవ పృక్పథపు కబుర్లు. లేదా అర్థం కాని అతి నవ్యత వస్తువులోనూ, అభివ్యక్తీకరణలోనూ, నేల విడిచి సాము చేయడం, నినదించడం, అస్పష్ట సాంకేతిక ధోరణుల్ని ఆశ్రయించడం. మంచి పుస్తకాలకి ఆదరణ లేకపోవడం. వాటిని చదవక పోవడం, లాభసాటి వ్యాపారమే ప్రధాన ప్రయోజనమనుకొన్న వాళ్ళే గ్రంథ ప్రచురణ, విక్రయ పంపిణీ వ్యవస్థను అనుశాసించగల దౌర్భాగ్య పరిస్థితులు బలం పుంజుకుంటూ వుండడం, పబ్లిక్ గ్రంథాలయాల కొనుగోళ్ళ మీద ధ్యాసను కేంద్రీకరించి ప్రచురణకర్తలు అనుచితమైన పోటీకి దిగడం.

(అహం)భావ విప్లవం .... అదృష్టదీపక్

భ్రమను తప్పించి
తక్కిన వాళ్లెవరికీ
తలకాయల్లేవనుకునే
తలతిక్క మేధావులు
గాడిదనీ, గుర్రాన్నీ
ఒకే గాట కట్టబోతారు.

ఉన్మాదాన్ని విజ్ఞానమనీ,
ఉద్రేకాన్ని విప్లవమనీ
వెర్రిగా నమ్మమంటారు.
గమ్యానికి చేరాలనే కంగారులో
మూడడుగులు ముందుకి
పదడుగులు వెనక్కి గెంతుతుంటారు!

ఈ గ్రంథాలయాలు అనారోగ్యకరమైన కొనుగోలు విధానాన్ని అనుసరిస్తూ వుండడం. అధికార ప్రాపక రచయితల సంఖ్య పెరుగుతూ వుండడం. వాళ్ళకు ముందుగా గుర్తింపులు. బిరుదులకోసం, పదవులకోసం, గుర్తింపులకోసం, బహుమతులకోసం, అరాటాలు, ఆశ్రయింపులు. కల్పనా సాహిత్యానికున్న గిరాకీ తక్కిన సాహిత్య ప్రక్రియలకు లేకపోవడం. ఉత్తమ సాహిత్యాభిరుచులను ప్రోత్సహించే ప్రయత్నాలు సంస్థలు కాని, వ్యక్తులు కాని, రచయితల సంఘాలు కాని చేయక పోవడం, ఇవన్నీ నేటి సాహిత్య సమస్యలు.

ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ వున్న వాళ్ళకు అసంతృప్తి. ఉద్యోగం లేని యువకులలో అశాంతి. నిత్య జీవితావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోతూ వుండడం, పుండుమీద కారంలా ధరలు పెరగడం లేదు, తగ్గుతున్నాయన్న ప్రభుత్వ యంత్రాంగ ప్రచారం. అధికోత్పత్తులు సాధిస్తున్నామన్న ఆర్భాట ప్రచారం. ద్రవ్యోల్బణం అరికట్టమన్న ప్రచారం. ఇవి సాంఘిక సమస్యలు.

మధ్యతరగతి కుటుంబాలలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు జీవన్మరణ సమస్యగా బాధించడం. కట్నాల బెడద ఏమాత్రం తగ్గకపోవడం. ఈ వ్యాధులకు మూల కారణాలే మిటన్న విచికిత్స చేసి సంగతి సందర్భాలు కనుక్కోలేకపోవడం. సుమారు అరవై సంవత్సరాలకు పూర్వం వరకట్న దురాచారానికి బలి అయి పోయిన వంగ మహిళ స్నేహలతా దేవి వృత్తాంతం కవులను ఉత్తేజపరచి కావ్యాలు పలికించింది. కాని కట్నాలు మాత్రం రూపుమాపలేకపోయింది.

ఆచార్య ప్రపుల్ల చంద్ర రే తన స్వీయ చరిత్రలో అర్థశతాబ్ది క్రితమే యూనివర్శిటీ చదువుల వెర్రి వ్యామోహాన్ని గూర్చి, పట్టభద్రుల సామూహికోత్ప త్తిని గూర్చి హెచ్చరించాడు. స్నేహలతాదేవి విషాద గాథ వంటిదే మృత్యుంజయ సీల్ అనే తరుణ నిరుద్యోగ యువకుని ఆత్మహత్యా వృత్తాంతాన్ని తన స్వీయ చరిత్రలో ఉదాహరించాడు. ఆనాటి వార్తా పత్రికలలో నుంచి ఈ వార్తను తీసి ప్రముఖంగా వ్యాఖ్యానిస్తూ ప్రపుల్ల చంద్ర రే రాబోయే రోజులను గూర్చి హెచ్చరించాడు. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

1978 వ సంవత్సరంలో రాజశేఖర చరిత్ర వచ్చినప్పుడు ఆధునిక సాహిత్యంలో అది ఒక పెద్ద మైలు రాయి అనుకున్నారు. సాహిత్య చరిత్రలో అది ఒక పెద్దమలుపు అనుకున్నారు. సంఘంలోగల లోపాలను గూర్చి చర్చించేందుకు, చేయగల పనులు చేసేందుకు, సమాజంగా ఏర్పడడం అనేది ఆ సంవత్సరమే మొదలు. ఆ తరవాత ఇప్పటికి నూరు సంవత్సరాలు గడిచాయి. రాక్షసుల రక్త బిందువుల నుంచి క్రొత్త రాక్షసులు జన్మించేట్లు, కొన్ని సాంఘిక దురాచారా లను రూపుమాపాము అనుకొంటే, అంతకన్నా తీవ్రమైనవి, వికృతమైనవి తలలెత్తుతు వుండడం, వీటిని పరిష్కరించుకోలేక సతమతమవుతూ వుండటం జరుగుతూన్నది.

సుమారుగా ఇంకా ఇరవై సంవత్సరాలలో, ఈ శతాబ్దం కూడా కాలయ వనిక వెనక్కు వెళ్లిపోతుంది. ఆగామి తరాల వారు ఈ శతాబ్దంలో బుద్ధిమంతులు ఏం చేశారంటే చెప్పగలిగింది ఏమీ లేదు. స్వాతంత్ర్యం సంపాదించిన మాట

వాస్తవమే. అయితే దాన్ని సంపాదించుకోవడానికి ప్రేరకమైన సదాశయాలను వేటినీ సిద్ధింప చేసుకోలేక పోతున్నాము. 'మాలపల్లి' నవలలో స్వాతంత్ర్యం వచ్చేసిన తర్వాత భారత కేంద్ర శాసన సభ, రాష్ట్ర శాసన సభలు చేసిన చట్టాలు, చేపట్టవలసిన కార్యక్రమాలు అని భావుకతతో ఉన్నవవారు ఒక అధ్యాయంలో వివరించారు. ఆయన నవల రాసిన తరువాత అర్ధశతాబ్దం గడిచినా, స్వాతంత్ర్యం వచ్చి ముప్పై సంవత్సరాలు గడిచినా, పెట్టుబడిదారీ వ్యాపార సరళి, గుత్తాధిపత్యం, స్వార్ధపరత్వం, అక్రమ లాభార్జనలు విజృంభిస్తూనే ఉన్నాయి. ఆగామి తరాల దేహ మనోవికాసాలను తీర్చి దిద్దవలసిన విద్యాసంస్థల నిర్వహణ విషాదకరంగా వుంది. ప్రపంచ పరిస్థితులే సామాన్యంగా ఇట్లా వున్నప్పుడు మన దేశం గురించి చెప్పాల్సిందేముంది ? దీన్ని చూడండి.

"I do not need to tell you that a statistical analysis of the business community in the United States, which remifies throughout the world, reveals that the world's commerce is largely in the hands of some 330 executives who, with perhaps less than 1000 others, control the world's economy. Neither schools nor churches, nor even governments, have any basic impact on the control exercised by these business executives through interlocking directorates and international cartels." చాలా ఆశ్చర్య పడవచ్చు. పాండిచ్చేరి అరవిందాశ్రమం నుంచి వెలువడే పత్రికలోని డా॥ హోవార్డ్ జాన్ జిట్కో వ్యాసం లోనికి ఈ వాక్యాలు.

అయ్యో సంఘమా ? సాహిత్యమా ! తమసోమా జ్యోతిర్గమయ.

ఒకప్పుడు - ఇప్పుడు . . . . 'కోణార్క'

ఒకప్పుడు —
నా జీవితపు 'గోరీ' కట్టబడ్తున్న
దనుకున్న కాలంలో...
ఎన్నిసార్లు ఈ గుండు సూదుల
కాలి బాటలంట నడిచానో !
నా హృదయపు కన్నీటి ఆవిరిని
ఆకాశం వీపు మీద -
మేఘాల రూపులో . . . . .
పులిమి పులిమి పేర్చేవాణ్ణి
నా మెదడు గుళ్ళో
ఓర్పును ప్రతిష్టించి
సహనం వెల్తుర్లో పూజిస్తూ -
ఆశతో తాదాత్మ్యం చెందుతుండే వాణ్ణి
మరి ఇప్పుడు —
వైరాగ్యాన్ని, పిరికిదనాన్ని
ఈజిప్టు పిరమిడ్ల కింద పాతిపెట్టి
కర్మ సిద్ధాంతాన్ని -
నా ధైర్యకరవాలంతో ముక్కలు చేసి
భూమి గుండెను పరిశీలిస్తూ
ముందు తరం భవిష్యత్తుకు
'ప్రీప్లాన్'లు గీస్తున్నా
నేనొకప్పుడు నమ్మిన
సృష్టికర్త వంశం గుండెల
మైదానం మీద,
వెలుగు రేఖలు విచ్చుకునే దిక్కుకు...
ఉషస్సును పిండుకొని తాగాలని
పరుగుదీస్తున్నాను.
ముందు తరాల భవితవ్యాన్ని,
నా కళ్ళ ఫ్లడ్‌లైట్ల నిండా పులుముకొని
చీకట్లని చీల్చుకుంటూ...

బలం ఉన్నవాడి కన్న బలం లేనివాడు బలవంతుడు

(స్కెచ్)

మంథా వెంకట రమణారావు

ఇదెలా సాధ్యం అని మీరడుగుతారని నాకు తెలుసు.

ఏనుగ బలవంతురాలా మావటీవా? పులి బలవంతురాలా వేటగాడా? ప్రజలు బలవంతులా వారినేలే మంత్రా?

విడిగా చూస్తే ఏనుగా, పులీ, ప్రజలూ బలవంతులని వేరే చెప్పనవసరం లేదు. కాని మావటీకి అంకుశం ఇచ్చి ఏనుగని ఎక్కించగానే వాడు బలవంతుడౌతున్నాడు. ఆయుధం పట్టుకోగానే వేటగాడు బలవంతుడౌతున్నాడు. వోట్లు సంపాదించి ఎన్నిక గెలిచి, మంత్రి పదవి కొట్టీగానే ప్రజల కన్న మంత్రి బలవంతుడౌతున్నాడు.

ఒక చదువుకున్నవాడు లక్షమంది చదువురాని వాళ్లకన్న బలవంతుడు. ఓ మోసగాడూ, వంచకుడూ వంద మంది సన్మార్గుకన్న బలవంతుడు. ఓ దోపిడీ దారు లక్షమందిని దోచుకో గలుగుతున్నాడు.

ఓ ఎం ఎల్. ఏ. తన నియోజక వర్గంలోని అందరికన్నా బలవంతుడు. ఓ మంత్రి వందమంది ఎం.ఎల్.ఏ లకి సమానం. ఒక ముఖ్యమంత్రి అందరు మంత్రులకన్నా అధికుడు.

సమస్త పృథివీ పతులకన్నా, మంత్రులకన్నా, ప్రభుత్వాలకన్నా, దాని చట్టాలకన్నా అతి బలవంతుడు ఓ అర్భకుడిలా అగపడే పోలీస్ కాన్స్టబుల్. ఎలానంటారా? మీరు ఎన్ని చట్టాలు ఏర్పరచండి. వాటిని అమలు జరిపేదెవరు? దోషిని పట్టి, కోర్టుల ముందు హాజరు పరిచే దెవరు? సాక్ష్యాలు సేకరించేదెవరు? ప్రొహిబిషన్ అమలు జరిపేదెవరు? ముండల కంపెనీల మీద రెయిడ్లు చేసేదెవరు? రేప్స్ జరుగుతే రేపిస్టెవడో వెతికేదెవరు? ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించబడకుండా చూసేదెవరు? దొంగతనం జరిగేక దొంగకోసం వెతికేదెవరు?

ప్రభుత్వమా? కలక్టరా? ఎస్పీవా? సి. ఐ. వా? కాదండి కాదు! అతి అర్భకుడిలా అగపడే పోలీసెంకటసామి లా ఎండ్ ఆర్డర్ మెంటేన్ చెయ్యాలి. న్యాయం ధర్మం నెలకొల్పాలి! ప్రభుత్వ యంత్రాంగం అంతా ఈ అర్భకుడి భుజస్కందాల మీద నిలబడి ఉంది. పాలనా, దండనా వ్యవస్థంతటికీ పోలీసు కాన్స్టబుల్ పునాది రాయి.

వెంకటసామి తలచుకుంటే కేసు బనాయించగలడు. బనాయించిన కేసు నించి తప్పించగలడు. దొంగని పట్టాగలడు. పట్టిన దొంగని వదిలి పెట్టించాగలడు. సాక్ష్యాలు బనాయించి నిర్దోషిని దోషిగా కోర్టులో నిలబెట్టగలడు. నిజమైన దోషిని, సాక్ష్యాలు చాలక కోర్టులచేత విడుదలా చేయించగలడు. కళ్లముందు కూనీ జరిగినా, కూనీ చేసినవాడు కనిపిస్తున్నా, వాడు కూనీ కోర్ కాదని వదిలి పెట్టగలడు. ఏ మారుమూలో జరిగిన కూనీ కేస్‌లో దోషిని నిమిషాలమీద పట్టనూగలడు.

ధర్మానికుండే నాలుగు కాళ్లలో పోలీసువాడో కాలు, మంత్రి రెండో కాలు, బ్యూరోక్రట్స్, న్యాయస్థానాలూ మూడో కాలు, అందరినీ కంట్రోల్ చేసే

డబ్బు నాలుగో కాలు. ఈ నాలుగు కాళ్లూ నిలబెట్టే ధర్మమే ధర్మంగా నిలబడుతోంది. తక్కిందంతా అధర్మం కింద చెలామణీ ఔతోంది.

ఈ పునాది రాయి అయిన కాన్స్టేబుల్ ఎలా ఉన్నాడు? ఈ పునాది రాయి బంకమట్టే కాని నల్లసేనం రాయి కాదు. కాబట్టి ఈ బంకమట్టిని కాస్త తడిపి ఎవరు పడితే వారు తమకి కావల్సిన నమూనాగా మలచుకోవచ్చు. చాలీ చాలని జీతం, ఊరంతటి మీదా పవరూ మనిషికిస్తే ఆ మనిషి ఏంచేస్తాడో, ఈ కాన్స్టేబులూ, అతడి పైవాడూ, ఆ పై వాడి పైవాడూ, అందరూ అదే చేస్తారు. ఐహిక సుఖాలకీ, సంపదలకీ పవరు ప్రాతిపదిక కనక, పవరున్న ప్రతి వాడూ దానిని తన సంసారం మంచికీ ఇతరుల నెత్తిమీద భస్మాసుర హస్తం వెయ్యడానికీ ఉపయోగిస్తున్నాడు.

నెలకి మూడొందలు కూడా జీతం లేని పోలీసు జవాను వెంకటసామి ధనలక్ష్మినీ, అధర్మాన్నీ కాలదన్ని సామాన్యుడి తరపున నిలబడి న్యాయాన్ని నిలబెట్టజూస్తే (అది కలలో మాటే అనుకోండి) అతని ఉద్యోగం ఊడడం ఖాయం. వెంకటస్వామిని పీకేసి అప్పలస్వామిని వేస్తారు.

ధర్మాన్ని స్థాపించడానికీ, న్యాయాన్ని ఇవ్వడానికీ ఎన్నో చట్టాలూ, ఇన్ని ట్యూషన్సూ ఉన్నాయి. బ్రోథల్ ఏక్ట్ ఉంది – వ్యభిచారం నిర్మూలమయిందా? ఆ చట్టమే లేకపోతే, సాని దాని సంపాదనలోంచి ఎవరికి వెళ్లవల్సిన వంతులు వాళ్లకి వెళ్లవు. చట్టాలు ఉండడం వల్లనే అవి అమలు జరిపే మనుష్యులకి పవరు దొరుకుతోంది. పవరు దుర్వినియోగ పరచడానికీ ఉంది కాబట్టి, చట్టాల ధర్మమా అని కిందనించి మీది వరకూ పాలనా యంత్రాంగం తాను తిరగడానికి గ్రీజు సంపాదించుకుంటోంది.

ప్రొహిబిషన్ పెట్టగానే తాగుడు పోయిందా? తాగేవాడు ఎలానో ఓలా తాగుతూనే ఉన్నాడు. ఇదివరకు కల్లు కొట్టు వాడు బుడ్డీలు సరఫరా చేస్తే ఇప్పుడు పోలీస్‌వాడే సరఫరా చేస్తాడు.

ప్రతిదానికీ ధర ఉంది. ఏ వస్తువైనా, సేవనైనా కొనొచ్చు, అమ్మవచ్చు. ఆ ధర చెల్లించగానే ఆ అర్భకుడిలా అగపడే వాడు లక్షమంది చెయ్యలేని మీ పని త్రుటిలో చేసి పెట్టేస్తాడు.

అందువల్ల, శక్తి ఉన్నట్టు అగపడే వాడు నిజంగా శక్తిమంతుడు కాడు! బలం లేనట్టు అగపడేవాడు బలం లేని వాడూ కాడు!

బలం ఉన్నవాడ్ని వాడుకొని, బలం లేనివాడు బలం సంపాదించి ఎప్పుడూ ఓ ఏలుబడి ఏలుతూనే ఉన్నాడు. ప్రజల్ని వాడుకొని రాజకీయుడూ, సైనికుల్ని వాడుకొని డిక్టేటరూ, డివైన్ రైట్ థియరీని రుజువించి రాజూ, రాజ్యాలని చేపట్టి, డైనాస్టీలు సాపించి ఓ ఏలుబడి ఏలుతున్నారు!

ఇప్పుడు చెప్పండి ... బలం ఉన్న వాడికన్న బలం లేనివాడు బలవంతుడా, కాదా?

లాయరు : ముందీ మాట స్పష్టం కానీ ఆ రోజు రాత్రి చాల చీకటిగా వుందంటావు. అయినా 500 గజాల దూరంలో జరిగిన కారు ప్రమాదాన్ని చూసేనంటావు. ఇంతకీ, ఒకటి చెప్పు. చీకటి రాత్రివేళ నువ్వెంత దూరం చూడగలవు?
సాక్షి : పది లక్షల మైళ్ల దూరం వరకూ చూడగల ననుకుంటా. చంద్రుడెంత దూరంలో వున్నాడంటారు?

సముద్రానికీ సూర్యునికీ మధ్య

కథానిక హిందీ

హిమాంశు జోషి

తెలుగు : నిర్మలానంద్ కాత్యాయన్

నిన్నరాత్రి అతను ఓ విచిత్రమైన కల కన్నాడు – ఆ కలలో అప్పటిదాకా నడుస్తున్న ప్రభుత్వం పతనమై పోయి నట్లు, దాన్ని కొందరు అపరిచిత వ్యక్తులు హస్తగతం చేసుకున్నట్లు, గద్దె దింపబడిన మంత్రి మండలికి వ్యతిరేకంగా వచ్చిన అవినీతికి సంబంధించిన ఆరోపణలను పరిష్కరించేందుకు సైనిక న్యాయస్థానికి ఆ బాధ్యత వప్పగించినట్టు "దేశంలోని అవినీతి పరులందరికీ మూకుమ్మడిగా మరణ దండన విధింప బడుతుం" దని కొత్తగా ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకున్న విప్లవ పరిషత్తు అధ్యక్షుడు ఆకాశవాణి ద్వారా దేశ ప్రజల్ని ఉద్దేశించి చేసిన ఒక ప్రసంగంలో స్పష్టం చేసినట్టూ.

అతని చేతులకి కాళ్లకి సంకెళ్లు తగిలించి, బందీని చేసి, కన్నాట్ ప్లేస్ నడి బజారు గుండా పట్టపగలే ఊరేగించి, లాల్ ఖిల్లా వేపు ఈడ్చుకు పోతున్నారు అతణ్ని. లజ్జభారంతో అతని మెడ వాలిపోయింది. ఒళ్ళంతా చెమటలు పోసేశాయి. ఎవరూ తనని గుర్తు పట్టకుండా వుండేందుకుగాను అతను తన మొహాన్ని ఖద్దరు రుమాలుతో కప్పేసుకున్నాడు. అయితే అతని కళ్ళు మాత్రం నిర్జీవంగా కనిపిస్తున్నాయ్. రోడ్డు కిరుప్రక్కలా నిలబడివున్న ప్రజల కళ్ళు కసితో, అసహ్యంతో అతణ్ని గుచ్చి గుచ్చి చూస్తున్నాయ్. అయినా అతనవేవీ పట్టించుకోవడం లేదు. అతని కళ్ళ ముందు కనుచూపు మేరంతా పొగమంచు ఇసుక మేటలా తెరకట్టి వుంది.

అతనికి మొహం తిరిగిపోయింది. ఊపిరి సలపడం లేదు. కాళ్లు చేతులు ఒక్కసారిగా గిలగిలా కొట్టుకున్నాడు. కొలిమి తిత్తిలా అతని గుండెకాయ కొట్టుకుంటోంది. స్నానం చేసినట్టుగా ఒళ్ళంతా ఒకటే చెమట. గాలిలో ఎండటాకులా, వయసు మీద పడటం వల్ల కృశించి పోయిన అతని దేహం గజగజా వణుకుతోంది. డెబ్బయి ఏళ్ళ తన రాజకీయ జీవితంలో ఇలాంటి కలని అతనెప్పుడూ కని ఎరుగడు. భయంతో అతడి రోమ రోమం నిక్కబొడిచింది. . . .

ప్రక్కనే టేబిల్ మీద వున్న టెలిఫోను గంట గణగణ మ్రోగడంతో ఒక్క ఉదుటున లేచి, అతను చేతనా జగత్తులోకి వచ్చాడు. నవనాడులూ కూడ తీసుకొని, మంచం దిగి తడబడుతున్న అడుగులతో అతను ఫోను దగ్గర కెళ్ళాడు. 'హ . . హ . . లో . . . లో . . .' మాటలు స్పష్టంగా రావడం లేదు. నాలిక పిడచగట్టుకు పోయి, అంగుడిని అంటుకుపోయింది.

జవాబుగా దబ్బున విసిరేసినట్టుగా, టెలిఫోను స్టాండు మీద రిసీవరుని పడేసి, ఓపిక నశించిన వాడికి మల్లె గచ్చు మీద దభీమని చతికిల పడిపోయాడు. ఎవరో తడిచిన తవ్వాలుని పిండేసినట్టుగా అతని

ఒంట్లోని శక్తంతా ఒక్కసారిగా పోయి నట్టుగా అయ్యింది.

అలాగే కొంత సేపు నేల మీద కూచున్నాక, కొంచెం శక్తిని పుంజు కొని, అతికష్టం మీద మంచం కోడుని ఆసరాగా చేసుకొని లేచి నిలబడి, నీళ్ల కూజా దగ్గిరి కెళ్లి అతను గ్లాసులోకి నీళ్లు వంపుకొని, గటగటా తాగేశాడు. కాస్త తెప్పిరిల్లి నట్టయింది. తర్వాత మంచం దగ్గిరికి నడిచి వచ్చి, పక్క మీద శవంలా పడిపోయాడు. కంటికి కునుకు రావడం లేదు. ఇంటి కప్పుని తదేకంగా చూస్తూ మంచం మీద అలాగే పడివున్నాడు అతను.

ఇలాంటి కల గతంలో తన కేన్నడూ రాలేదే! మరి ఇవాళే ఎందు కొచ్చినట్టు? నిజానికి దేశానికి తను కలలో చూసినట్టుగా దుస్థితి సంభ వించబోతుందా? నేటి దేశ కాల పరి స్థితుల్ని చూస్తుంటే ఎలాంటి భయం కరమైన పరిస్థితి దాపురించినా ఆశ్చర్య పడనక్కర్లేదని పిస్తోంది. ఏ క్షణంలో ఏం జరిగినా జరగవచ్చు. ముందు రోజు రాత్రి తను పడుకునే ముందు ఇరాన్‌లో సంభవించిన విప్లవం గురించే ఆలోచిస్తూ పడు కున్నాడు. బహుశా ఆ ఆలోచన ప్రభావమే కావచ్చు యీ కల. రేడియోలో కూడా ఏదో ఆఫ్రికా దేశం గురించి కూడా తను ఇటువంటి వార్తనే విన్నాడు. ఇలాంటి అరాజక స్థితి దేశంలో నెలకొని ఉన్నంత కాలం దేశానికి ఎలాంటి ముప్పు రానున్నదో గదా? లోలోపలే రగులు కొంటున్న అగ్నిపర్వతం ఏదో ఒక నాడు బ్రద్దలు గాక మానదు. అప్పుడు... వీల్లేదు! వీల్లేదు ఇలా ఎన్నటికీ జరగడానికి వీల్లేదు...

తన మనసులో ముసురుకొంటున్న ఆలోచనలను ఒక్కసారిగా అతడు విదిలించి వేశాడు, ఈ దేశంలో అలా ఎన్నటికీ జరగదు, బ్రతికినంత కాలం ఇహ తను బ్రతకబోతాడా ఏవన్నా నా? ఎంత కాలం గడిస్తే అదే పదివేలనుకుంటాడు తను.

మిగిలిన రాత్రంతా ఇటువంటి ఆలోచనలతోనే సతమత మవుతూ, నిస్పృహాయంగా మంచం మీద పొర్లు తూనే వున్నాడు అతను. తెలతెల వారుతుండగా నిద్ర పట్టింది. కాస్తంత తేరుకున్నాడు కూడా. అయితే నౌకరు బెడ్ టీ తీసుకొచ్చి, అతనికి నిద్రా భంగం కలిగించాడు. నౌకరు సహా యం లేకుండా అతను పక్కమీంచి లేవనైనా లేవలేకపోయాడు.

టీ కప్పుని అందుకోబోతుంటే అతని ఆశ్చర్యానికి అంతం లేదు. ఏళ్ల తరబడి చేతులకు వేసిన సంకెళ్లు అప్పుడే తొలగించినట్టుగా చేతుల మీద నీలిరంగు మచ్చలు తీరివున్నాయ్.

నాటి దిన పత్రిక లన్నిటినీ తీసుకువచ్చి, నౌకరు టీపాయ్ మీద వుంచి, గదిలోంచి వెళ్లిపోయాడు. దినపత్రికల్ని తెరచి చదవడానికి అతనికి మనసు పోలేదు. విస్ఫారిత నేత్రాలతో గోడకి వ్రేలాడుతున్న ఫోటోని తదేకంగా అతను చూస్తు న్నాడు. ఉన్నట్టుండి ఒక్క సారిగా ఆ ఫోటోలో వున్న బొమ్మ మాయమై, కేవలం నల్లని రంగు ఫ్రేం మాత్రం మిగిలి ఉన్నట్టని పించింది. ఆ రంగు కూడా క్రమంగా వెలసి పోసాగింది.

ఫోటో మీద నుంచి తన దృష్టిని మరల్చుకున్నాడు అతను.

యుందుగా ఏర్పాటు చేయబడ్డ ఆ నాటి కార్యక్రమాలన్నీ వరుసగా రద్దు చేయబడినాయ్. ఆ రోజుల్లా అతణ్ని పరామర్శించడానికి వచ్చి పోయే డాక్టర్లతో, మిత్రులతో, శ్రేయోభిలాషులతో గడిచిపోయింది.

వరుసగా కొన్ని రోజుల సపర్యల మూలంగా అతడి ఆరోగ్యం కొంచెం చక్కబడింది. మళ్ళీ ఎప్పటిలాగే అతడి దైనిక కార్యక్రమాలు ఆరంభమయినయ్. అయినా ఒక విధమయిన మానసిక వ్యాధి అతణ్ని పట్టి పీడిస్తూనే వుంది. క్షణం అతను తన జీవితాన్నే నెమరు వేసుకోసాగాడు. గతం నుంచి తను ఎంతగా పారిపోదామనుకుంటున్నాడో, అది అ తగా భయంకరమైన రూపం దాల్చి, అతణ్ని హడల గొట్ట సాగింది.

ఎప్పుడో అర్ధ శతాబ్దం క్రిందట తను కాలేజి చదువుకి స్వస్తి చెప్పి, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకి వెళ్ళాడు. తల్లి చనిపోయింది. తండ్రి పోయి చాలా కాలం అయ్యింది. తమ్ముడు మేనమామ పంచని చేరి, చదువు సాగించాడు.

"దేశసేవ ఒక సాధన. ఒక తపస్సు దేశంలోని ప్రతి పౌరునికీ కట్టుకోడానికి వంటి నిండా బట్ట లభించే దాకా నేను వంటి మీద పూర్తిగా బట్టలు వేసుకోను. అందరికీ తల దాచుకోడానికి పంచ లభించే వరకూ నేను యింట్లో నివసించను. దేశంలో సగటు మనిషి ఏ తిండయితే తింటాడో, నేనూ అదే తింటాను"-యివి గాంధీ అన్న మాటలా? కావే! తనే... తనే అన్న మాటలు!

కాదు. కాదు. ఇది ఎంత మాత్రమూ నిజం కాదు. కేవలం ఒక కల. ఒక భ్రమ. ఈ దేశంలో సత్యాగ్రహమంటూ జరగనే లేదు. అసలు గాంధీ అనే వ్యక్తి ఈ దేశంలో పుట్టనే లేదు. అందరికీ పిచ్చి పట్టినట్టుంది. అందుకే మాటిమాటికీ అతణ్ని స్మరిస్తూవుంటారు. రాబిన్సన్ క్రూసో లాగ మనసులో ఒక అద్భుతమైన ద్వీపాన్ని కల్పించుకొని, అందులో ఒక నాయకుణ్ని ఊహించుకున్నాము. అంతే...

మరి కొన్నాళ్లు పోయాక, అతను మరొక కల కన్నాడు.

... అతను మింటో బ్రిడ్జి దాటి లాల్ ఖిల్లా మైదానం చేరేసరికి పూర్తిగా డస్సిపోయాడు. ఇహ అతడు అడుగు ముందుకి వేయడం తనవల్ల కావడం లేదు.

ఆ సమయంలో అక్కడ కనాట్ ప్లేస్‌లో లాగ జనం రద్దీగా లేరు. అంతటా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయ్ రాత్రికిమల్లే. భయంకరమైన నిశ్శబ్దం. తన చేతులకు బేడీలకు బదులు కట్టివున్న తాళ్లను తానే మోసుకుంటూ, వంటరిగా సాగిపోతున్నాడు. తన వెంట ఒక పోలీసు కూడా లేడు.

... లాల్ఖిల్లా గేట్ చేరుకున్నాడు. ఎవరో వచ్చి, తలుపు తీసారు. ఆ గేటు తెరచిన వ్యక్తికి ముమ్మూర్తులా తన రూపే! తనపోలికే! తను వేసుకున్న వంటి బట్టలే అతనూ తొడుక్కున్నాడు. ఏమీ తేడా లేదు – అద్దంలో తన ప్రతిబింబం చూస్తున్నట్టుగా.

లోపల వరండాలో నిలుచున్న సెంట్రీది కూడ అచ్చు గుద్దినట్లుగా తన రూపమే.

... అతనిప్పుడే ఒక సైనిక న్యాయస్థానం ఎదుట చేతులు కట్టుకొని నిలుచున్నాడు. వెన్నెముక లోంచి

వణుకు పుట్టుకొస్తోంది.

"దేశ ద్రోహానికి మించిన నేరం ఏదైనా వుందా"

లేదన్నట్టు అతను తల ఆడించాడు.

"నువ్వు నేరం చెయ్యలేదూ?"

"ఆఁ!"

"ఇంత డబ్బు అక్రమంగా ఆర్జించి ఏం చేసుకుంటావ్? ఏమిటి నీ అభిప్రాయం?"

అతను పెదవి కదపనే లేదు.

"ఇరవై కోట్ల రూపాయల వ్యయంతో ఐదేళ్లపాటు రాత్రనక, పగలనక శ్రమించి సప్తపర్ణి నది మీద నిర్మించిన వంతెన తొలి వర్షాలకే విరిగిపోయి, కొట్టుకుపోయింది. సిమ్మెంటుకి బదులుగా ఇసుక పాలు హెచ్చు కలిపించి సొలగు లక్షల రూపాయలు నువ్వు వెనకేసుకున్నావు. అవునా?"

"అవునండి!"

"వంతెన విరిగిపోవడం వల్ల ఎన్ని గ్రామాలు కొట్టుకుపోయాయో, ఎంత మంది ప్రాణాల్నే పోగుట్టుకున్నారో నీకేవయినా తెలుసా?"

సమాధానం లేదు.

"ఒక్క సారిగా ధాన్యం ధర హెచ్చించడం వల్ల ఒకే ఒక్క రాత్రిలో నలభై లక్షల రూపాయలు నీకు ముట్టాయి. అవునా?"

"అవునండీ"

"రాజస్తాన్‌లో, బీహారులో సంభవించిన కరువు కాటకాల వల్ల ఎన్ని వేల మంది ఆకలి చావులు చచ్చారు? ఎంత మంది రోగిష్టి పిల్లలు వైద్య సదుపాయాలు సకాలంలో అందక, ఉన్నా మందులు కొనుక్కొనే ఆర్థికస్తోమత లేక చనిపోయారు?

"... ప్రాంతీయ విభేధాల వల్ల, మత కలహాల మూలంగా దేశంలో దఫ దఫాలుగా జరిగిన హింసాకాండల్లో పరోక్షంగా నీ చెయ్యి వుందని రుజువయ్యింది. ఈ హింసా ప్రవృత్తిని ఆధారంగా చేసుకొని, గత ఇరవై ఏళ్లుగా జలగలా అధికారాన్ని హస్తగతం చేసుకొని నువ్వు కులుకుతున్నావు. ఈ వ్యవస్థని డొల్లగా మార్చేసింది నువ్వు.

"... నీ స్వార్థంకోసం ఉజ్వలమైన దేశ భవిష్యత్తునే నీకు అనుకూలమైన విధంగా మార్చేసున్నావ్. ఒక వర్గాన్ని కాదు, సంఘాన్ని కాదు, ఒక ప్రాంతాన్ని కాదు అప్పుడే పుట్టిన పసి పాపలాంటి దేశాన్నే మొత్తంగా పట్ట పగలే హత్య చేసేశావ్. చూసుకో! చూసుకో! నువ్వే చూసుకో – నీ రెండు చేతులకి వేడి రక్తం ఎలా అంటుకొని వుందో! చూడు!"

... అతను కట్లతో వున్న తన రెండు చేతుల్ని ఎత్తి చూసుకున్నాడు. అవి రెండూ నిజంగానే రక్తంతో తడిసి ఎర్రగా వున్నాయ్.

... గట్టిగా ఒక పొలికేక వేశాడు.

అతను అరిచిన అరుపుకి బంగళాలో వున్నవారంతా ఉలిక్కిపడి లేచారు. ఆదరా బాదరాగా అతడి దగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. అతని శరీరమంతా మంచు గడ్డలా చల్లబడి పోయివుంది. గడ్డిపోచలా శరీరం గజగజ వణికిపోతోంది.

మూడో నాటికి గాని అతనికి స్పృహ రాలేదు విపరీతంగా దాహం వేస్తోంది. మంచి నీళ్ళు కావాలని చేతితో సౌంజ్ఞ చేయబోయి, తన చేతుల్ని చూసుకున్నాడు. అరిచేతులు, చేతి వేళ్లూ అప్పుడే ఎర్రటి వార్నిష్ పూసినట్టుగా వున్నాయి.

ఎయ్యి సార్లయినా అతను తన చేతుల్ని సబ్బుతో కడుక్కున్నాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆ ఎరుపు రంగు పోనే లేదు.

ఆ తరువాత ఆ ఎరుపు రంగు కని పించకుండా వుండడంకోసమని, అతను రెండు చేతులకూ గ్లోవ్స్ తొడుక్కోవడం సాగించాడు..

కొన్ని మాసాలు ఆసుపత్రిలో గడిపి ఆరోగ్యం చక్కబడగానే డిస్చార్జయి, అతను యింటికి తిరిగి వచ్చాడు.

ఒకనాడు నౌకరు "దొర గారూ! మన బంగళాకి వెనకాతల బేడీలు, సంకెళ్ళు రెండు జతలు దొరికినాయ్. వాటి ప్రక్కనే ఇద్దరు తెల్ల రుమాలు నలిగిపోయి పడివుంది" అన్నాడు.

అది విని అతను బెల్లం కొట్టిన రాయిలా కిమ్మనలేదు. అలాగే నిలబడి పోయాడు.

బంగళా బయట కాపలా కాస్తున్న సాయుధ భటుని మొహం తను కన్న కలలో లాల్ ఖిల్లా సైనిక న్యాయ స్థానంలో ఉన్నతాసనం మీద దర్పంగా కూర్చున్న ముఖ్య న్యాయాధి కారిని పోలివుందనిపించింది అతనికి. అతడు ఒక్కటొక్కటిగా అతనికి భయం పుట్టించే ప్రశ్నలు వేశాడు.

ఒక్క రోజున అతను సెంట్రీని పిలిచి, "నువ్వెప్పుడయినా లాల్ ఖిల్లాకి వెళ్లావా?" అంటూ అడిగాడు.

"వెళ్ళాను దొరా!" సెంట్రీ సవినయంగా జవాబు చెప్పాడు.

"ఎప్పుడెళ్ళావ్?"

"ఎప్పుడో అయిదేళ్ళ క్రిందట."

"ఎందు కెళ్ళావ్?"

"డ్యూటీ వేస్తే వెళ్ళాను దొరా!

"అయితే మళ్ళీ పోలేదా?"

"పో..లే..దు..దొ..రా..!"

"నీకు ప్రమోషన్ వచ్చినట్టుగా యీ మధ్య నువెప్పుడైనా కల గన్నావా?"

ఈవేళ పెద్ద దొర ఏవిటిలా వింతగా తనని అడుగుతున్నాడు? ఎంత ఆలోచించినా అతనికి అంతు చిక్కడం లేదు. అయినా దొరగారు అడిగాక ఏదో ఒక సమాధానం చెప్పకపోతే బాగోదు. అందువల్ల కొంత సవరించుకొంటూ – "మూడేళ్ళ నాడు చనిపోయిన నా కూతురు కనిపించింది

బానిస

ఏ. సూర్యప్రకాశ్

నగరం ఒక కారాగారం
నగరజీవి ఒక ఖైదీ
కళలకు సంకెళ్ళు
ఆశలకు సంకెళ్ళు
నాల్కలకు సంకెళ్ళు
కాళ్ళకు సంకెళ్ళు
ప్రతి పౌరుని చేతులకూ
సడిచెయ్యని సంకెళ్ళు
తన బ్రతుకు బుక్కునుంచి
ప్రశ్నార్థకాలను
ఆశ్చర్యార్థకాలను
బహిష్కరించాడు!
అలవాట్లకు బానిస
పరిస్థితులకు బానిస
అందరికీ బానిస
జీవితంతో రాజీ
సంఘంతో రాజీ
అన్నిటితో సర్దుకుపోతాడు
దేన్నీ ఎందుకని ప్రశ్నించడు!

దొరా! అంతే'' అన్నాడు.

"అంతేనా! మరేం లేదూ?''

"లేదు, దొరా!'' అనేసి సెంట్రీ అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

అయినా అతని ఆలోచనలకి అంతమే లేకుండా పోయింది. తనకిలాంటి కలలే ఎందుకు రావాలి? ఏదో ఒక నాడు ఈ దేశ రాజకీయ పరిస్థితే అకస్మాత్తుగా మారిపోతుందా? గతంలో తను చేసిన తప్పులన్నీ వెలుగులోకి వస్తాయా? ఇన్నాళ్లుగా తను కష్టపడి సంపాదించుకున్న ఈ పరువూ, ఈ ప్రతిష్ఠా మంట గలిసి పోవలసిందేనా? దేవుడు కరుణామయుడు. చల్లగా చూస్తాడు. అలాంటి వేమీ జరగవనుకో ... ఒక వేళ జరిగే పక్షంలో......

ఈ ఆలోచన రాగానే తన శరీర మంతా కుంచించుకు పోతున్నట్టు అనిపించిం దతనికి. శూన్యంలోకి చూస్తూ అలాగే బొమ్మలా నిలబడి పోయాడు.

మరి కొన్నాళ్ళకు అతను తను ఎలక్షనులో గెలుపొందిన ప్రాంతాన్ని పర్యటించేందుకు వెళ్ళాడు. వరద వచ్చి ఆ ప్రాంతంలో ఒక వంతెన కూలి పోయింది. ఎంతగానో జన నష్టమే కాకుండా గొడ్డూగోదా, ఇళ్ళూ వాకిళ్ళూ, పంట చేలూ - అన్నీ తుడిచి పెట్టుకు పోయాయి ఎటు చూసినా నిరాశ్రితుల హాహాకారాలే వినిపిస్తున్నాయి.

ఆ జనం మధ్య పరామర్శిస్తూ తిరుగుతున్న అతనికి ఒక చోట పులిస్తరాకు నాకూతూ ఓ ముసలమ్మ కనిపించింది. ఆమె మొహం చనిపోయిన తన తల్లి పోలికలా కనిపించి, అతను క్షణం సేపు పెదవుల మీద వేలు వుంచుకొని, సర్వమూ మర్చి పోయి, అక్కణ్నే నిలుచుండిపోయాడు.

మరి కొంచెం దూరం వెళ్ళేసరికి బురదగా వున్న ఆ కచ్చా రోడ్డు మీద ఎనభై తొమ్మిదేళ్ల ముసలివాడొకడు కారు క్రింద పడిపోయాడు. రక్తం మడుగులో గిలగిల తన్నుకుంటున్నాడు - గోచి పాతతో, చేతిలో ఓ కర్రతో. అతని మొహం సరిగ్గా తన బంగళాలో తన డ్రాయింగ్ రూం గోడకి గోల్డ్ ఫ్రేం కట్టి వేలాడదీసిన ఫోటోలోని వ్యక్తిని (తన తండ్రిని) పోలి వుంది.

అతణ్ని నిద్రలేమి జబ్బు ఆవరించి, రాత్రీ పగలూ కూడా కంటి మీద కునుకు పడితే ఒట్టు!

చాలా రోజుల తర్వాత ఆవేళ రాత్రి ఆతడికి నిద్ర పట్టింది. నిద్రలో మళ్ళీ ఓ కల.

కోర్టంతా ప్రేక్షకులతో పిటుపిటలాడి పోతోంది-ఇసుక వేస్తే రాలదన్నట్టుగా. మిడతల దండుకి మల్లె లక్షలాది జనం కోర్టు హాలంతా నిండి పోయారు. దేశ దేశాల్నించి విలేకర్లు కూడా వచ్చారు ఈ కేసు గురించి వినడం కోసమని.

ఆవేళ తీర్పు వినిపించే రోజు.

ఎదురుగా ఒక గెద్ద అదే పనిగా తిరుగుతోంది. నల్లటి తెరలాంటిది తొలగించ బడింది. చీఫ్ జస్టిస్ తీర్పు వినిపించడానికి కూర్చున్నాడు. ఆ జస్టిస్ మొహం తన బంగళా సెంట్రీని పోలి వుంది.

"కేసు పూర్వాపరాలను పూర్తిగా విచారించిన మీదట కోర్టు వారు ఒక నిర్ణయానికి వచ్చారు. నువ్వు నీ నలభై ఏళ్ళ రాజకీయ జీవితంలో, ప్రజాసేవ పేరిట మూడు కోట్ల పాతిక లక్షల రూపాయలు వెనకేసుకున్నావ్. దేశంలో

అవినీతి ప్రబలడానికి నువ్వు వేసిన ఎత్తు గడలు కారణం. తుచ్ఛమైన నీ స్వార్థం కోసం ప్రాంతీయ తత్వాన్ని, జాతీయ దురహంకారాన్ని వ్యాపింపజేస్తూ వచ్చావు. అందువల్ల ఈనాడు దేశం మళ్ళీ రెండుగా చీలిపోయే దుస్థికి దిగజారి పోయింది. దేశంలో అంతః కలహాలు విపరీతంగా పెరిగి పోవడానికి పూర్తి బాధ్యతా నీదే . . . నీదే! . .''

చీఫ్ జస్టిస్ యీ విధంగా తీర్పు చెబుతూంటే అతని మొహంలో కత్తి వాటున నెత్తురు చుక్క కూడా లేకుండా పోయింది. మొహం పాలిపోయింది.

చీఫ్ జస్టిస్ యింకా చదివాడు :

''అందువల్ల నీకు కోర్టు వారు ఎటువంటి శిక్ష విధించినా, అది తక్కువే అవుతుంది.''

''అయినప్పటికీ –

''నీ మొహానికి మసి పూసి, దేశం నలుమూలలకూ నిన్ను తిప్పాలి. అది చూసి ప్రజలు నీ మొహం చూసి అసహ్యించుకొని, నీ మొహం మీదే నవ్వాలి వారి విశ్వాసాన్ని నువ్వు నిలువునా నాశనం చేసేశావు. ప్రజలు యీ విధంగా నిన్ను చూసి అసహ్యించుకుంటున్నా, అపహాస్యం చేసినా చావకుండా యింకా నువ్వు బ్రతికి వుంటే, చాందినీ చౌక్‌లో పట్టపగలు నీపై ఉరిశిక్ష అమల జరిపించాలి . . .''

కోర్టు తీర్పు యింకా పూర్తి కాకుండానే అతను మొహం తిరిగి పడిపోయాడు . . .

మర్నాడు ఉదయం అతను పడుకొని వున్న పందిరి మంచం మీదనే చనిపోయి వున్నాడు. అతని మెడ చుట్టూ ఉరిపోసినట్టుగా గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అతని మొహం నల్లబడి పోయివుంది మసి పూసినట్టుగా.

పెద్ద మనుషులు . . . . ఎమ్వీ రమేష్

పేరుకు మాత్రం పెద్ద మనుషులు
చేసేవన్నీ చిల్లర పనులు
ఒళ్ళుతెలియకుండా తాగడం
మంచి చెడు లేకుండా వాగడం
వావీ వరుస లేకుండా వ్యభిచరించడం
నీతి నియమం లేకుండా వ్యవహరించడం
పక్క వాడిని దగా చేయడం
దొరికినంతా దోచుకోవడం
స్వార్థ పరత్వానికి పట్టంకట్టి
మంచితనానికి సమాధి కట్టి
పరుల కష్టంపై బ్రతికే పరాన్నభుక్కులు
ఎవరిచ్చారు వీరికి హక్కులు
ఎల్లకాలం అందుకోలేరు సలాములు
ఒకనాటికి కాక తప్పదు గులాములు

కేంద్ర విద్యా మంత్రి డాక్టరు పి. సి. చుంచర్ భువనేశ్వర్‌లో జనవరి 15 న ఉత్కళ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తూ, 31 సం. రాల స్వాతంత్ర్యానంతరం సైతం దేశంలో సుమారు 23 కోట్ల మంది వయోజన నిరక్షర్యాలున్నారనీ; 6.5 కోట్ల మంది పిల్లలకు ప్రాథమిక విద్య లభించలేదనీ : బడికి వెళ్ళే పిల్లలలో 60 శాతం ప్రాథమిక విద్య చివరలో చదువు మానివేస్తున్నారనీ చెప్పారు.

కథానిక ఉజ్బెకిస్తాన్

డాన్ క్విక్సోట్

ఇస్మాయిల్ షిక్లీ

ఆయన పక్కకు తప్పుకొన్నాడు. రొమ్ములో ఎడమ పక్కన ప్రారంభమైన నెప్పి, క్రమంగా పెరిగి, రెక్కా గూడుకి వ్యాపించింది. అది గుండెకి సంబంధించినదని ఆయనెరుగును. ఇతరుల కళ్ల పడకుండేందుకు కిటికీ వేపు తిరిగేడు. అవసరానికుంటాయని ఎప్పుడూ వెంట వుంచుకొనే మాత్రల్లో ఒకటి తీసి నాలుక క్రింద పెట్టుకొన్నాడు. కిటికీ లోంచి బయటకు చూస్తున్నట్లు నటిస్తూ, అక్కడే కదలకుండా నిలుచున్నాడు.

ఇటువంటి పరిస్థితి ఏర్పడి చాలకాలమయింది. ఆయనింకా శాస్త్ర చర్చలలో పాల్గొంటూనే వున్నాడు. న్యాయమైనవో, అన్యాయమైనవో విమర్శలకు గురి అవుతూనే వున్నాడు. అప్పుడప్పుడు ఆకాశరామన్న వుత్తరాలూ వస్తున్నాయి. తన జ్ఞానం అంతా నూరిపోసి, చేయట్టుకు నడిపించి, తమ కాళ్లమీద నిలబడ గలిగేటట్లు చేసిన తన మాజీ శిష్యులు ఈవేళ మంచి డిగ్రీలు, ఉన్నతోద్యోగాలు సంపాదించి తనను బహిరంగంగా, అన్యాయంగా నిందించడం, వీలయి నన్నివిధాల హింసించడమూ జరుగుతూంది. వాటన్నింటికీ ఆయన తలవొంచి భరిస్తున్నాడు, కాని ఇప్పుడు తగిలిన దెబ్బ దుర్భరం, అనుకోనిదీను. నూతన విద్యా సంవత్సరారంభంలో తన సహచరుల్ని కలుసుకొనీ, పిచ్చాపాటీ మాట్లాడుతున్న సమయంలో ఈ వేళ యిది జరగడం.

అంతా హాలులో చేరేరు. పెద్ద సెలవుల అనంతరం తిరిగి వచ్చిన విద్యార్థులు సంతోషంగా, ఉత్సాహంగా తమ టీచర్ల చుట్టూ చేరి, అభిమానంగా కబుర్లు చెప్తున్నారు. ఉరమని పిడుగులా అప్పుడు జరిగింది. విద్యార్థులలో ఒకడు టీచర్లతో హస్తచాలనం చేస్తున్నవాడల్లా ఉమిద్-మాలిమ్ దగ్గరకొచ్చేసరికి చెయ్యి వెనక్కి తీసుకొన్నాడు. విద్యార్థులంతా తెల్లబోయారు. టీచర్లు మర్యాదగా ఆ విషయం గమనించనట్లే నటించేరు. ఏమయితేనేం జరగవలసింది జరిగింది. దెబ్బ తగిలింది. తానో ఘనకార్యం చేసినట్లు ఆ విద్యార్థి నిర్లక్ష్యంగా ఆ గుంపు విడిచిపోయేడు. అతని తరగతి విద్యార్థులు అతని నాపేరు .

"సులేమాన్! ఏమిటా పని? మతిగాని పోయిందా?"

"ఏం?"

"నీకంత సాయం చేసినందుకు ఇదా చెయ్యవలసిన పని?"

"నా కాయన చేసిందేమిటో!"

"ఏముందీ, ఒక టెరం టెరమంతా తన జేబులో డబ్బుతీసి, స్కాలర్‌షిప్‌గా నీకు ఇచ్చేడు."

"ఇస్తే ఇచ్చేడు. నన్ను పరీక్షలో ఫెయిల్ చేయకపోతే, అల్లా ఇవ్వనక్కర్లేకనే పోయేది."

ఆఖరు వాక్యం అందరూ వినాలనే గట్టిగా, గొంతు చించుకొని అరిచేడు.

ఆ మాత్ర వేసుకున్నాక ఉమీద్-మాలీమ్ గుండె నొప్పి సర్దుకొంది. అది గుండెలకి చేరుకొన్నట్లు, గుండె కాయ విస్తరిస్తున్నట్లూ అనిపించింది. గట్టిగా

పిల్చుకున్నాడు. గుండెను నొక్కిపట్టి నట్లున్న సన్నని నొప్పి క్రమంగా తగ్గింది. "సులేమాన్‌కి నా మీద అంత కోపం ఎందుకు? తమాషాగా వుందే — వానికి నేను చేసిన అపకారం ఏమిటి?" — జరిగినదంతా గుర్తు చేసుకొనడానికి ప్రయత్నించేడు...

పరీక్ష ప్రశ్నల పత్రం ఎత్తుకుంటూంటే, సులేమాన్ చేతులు వణికేయి. విద్యార్థి వేషానికి సరిపడని విధంగా దుబ్బు మీసాలు మెలి తిప్పేడు. పత్రం తీసుకొనగానే మొదట మొహం ఎర్రబడింది. తరవాత తెల్లబారింది. ప్రశ్న పత్రంలో వున్నదేమిటో సరిగ్గా చూసుకోకుండానే దానిని అక్కడే వుంచేసి, మరొకటి తీసుకోబోయేడు. ఉమీద్ — మాలీమ్ ముఖంవేపు చూసి, ఆగేడు.

"దాని బదులు మరొకటి తీసుకో వచ్చునా?"

"ఆహా! నీ కా హక్కువుంది."

రెండో పత్రం కూడా తీసుకొని పక్కన పెట్టేసేడు. కాలుతున్న ఇనుము కడ్డీ ముట్టుకున్నట్లు ముఖం పెట్టేడు. జాలిగా ఉమీద్ వంక చూసేడు. రెండు ప్రశ్న పత్రాల్ని వదిలెయ్యడం నియమ విరుద్ధం. అయినా ఉమీద్ తల ఎగరేసి సులేమాన్‌కు అనుమతి నిచ్చేడు. అతని ముఖం ఇంతయింది. మూడో పత్రం తీసుకొని గదిలో ఆ కొసనున్న డెస్కు దగ్గరికెళ్లి కూర్చున్నాడు. కాగితాలూ, కలం తీసేడు. కనుబొమ్మలు ముడేస్తూ జుట్టు సర్దుకున్నాడు. మరి కాస్సేపట్లో దేని కోసమో ఆదుర్దాగా జేబులు వెతుకున్నాడు. అతడు వెతుక్కుంటున్న దేమిటో ఉమీద్ ఎరుగును. కాని చూడనట్లే నటించేడు. తరవాత ఏం చేస్తాడో చూస్తున్నాడు.

విద్యార్థులొక్కొక్కళ్ళే వచ్చి ప్రశ్న పత్రాలు తీసుకున్నారు. ప్రశ్నలకు సమాధానాలిచ్చేరు. కాని, సులేమాన్ సీటుకి అతుక్కుపోయి కూర్చునే వున్నాడు. తన తరవాత వచ్చినవాళ్లు పరీక్ష ప్యాసై వెళ్లిపోతున్నా, అతడు గమనించనట్లే నటించేడు. క్రమంగా గది ఖాళీ అయింది. తామిద్దరే మిగిలేరు. ఇంక ఆలస్యంచేసి ప్రయోజనం లేదు. లేచి వచ్చి, ఉమీద్ ఎదుట, కుర్చీలో భారంగా కూలబడ్డాడు. కాగితాలు తిరగేసి, బోర్డువేసి ముడతలు సాపు చేస్తున్నాడు.

"చెప్పు... వింటున్నా."

"ఒకటో ప్రశ్న .... ప్రొఫెసర్ గారు, చెప్తే నమ్ముతారో నమ్మరో గాని, నన్ను ఎప్పుడూ దురదృష్టమే వెన్నాడుతూంది. ఎప్పుడూ నాకు తెలియని ప్రశ్నలే వస్తున్నాయి."

"నీకు తెలిసిందే చెప్పు."

"థేంక్యు, ప్రొపెసర్. ఒక్క నిముషం. జ్ఞాపకం చేసుకోనివ్వండి."

సులేమాన్ ముఖాన ఛాయగా ఆలోచనా ప్రయత్నం కనబడింది. అతడేదో గుర్తు చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతని చొక్కా మాసివుంది. టై ముడి మరకలతో వుంది. ఉమీద్ గమనించి, ఈ కుర్రవాడు స్కాలర్‌షిప్ మీదనే బతుకున్నాడని గ్రహించేడు. వాడి పట్ల కఠినంగా వుండరాదను కొన్నాడు. ఏదో కొంత మరచిపోయినా సరే. నెపోలియ నంతవాడు 'పరీక్షల' పేరు చెప్తే వణికిపోయే వాడంటారు.

"నేనిచ్చిన లిస్టు పుస్తకాలలో ఏం చదివేవు?"

"అన్నీ చదివేసేను, ప్రొఫెసరు గారూ."

"సరి. వాటిలో ఒకటి, రెండు పుస్తకాల పేర్లు చెప్పు."

"ఒక దాని పేరు ... ఉండండి ... ఇంత లావు పుస్తకం ... ఒక్క నిమషం ..."

"నే నెక్కడికీ పోవడం లేదు. బాగా ఆలోచించుకొనే చెప్పు."

సులేమాన్‌కు ముచ్చెమటలూ పట్టేయి. ఒక్కొక్క సీటుకి అయిదుగు రేసి పోటీ చేసిన సెలక్షన్ పరీక్షలలో ఇతడెలా నెగ్గేడా అని ఉమీద్‌కు ఆశ్చర్యం కలిగింది. అందులో న్యాయంగానే పాసై వుంటే ఇప్పుడింత కష్టం ఎందుకు? దిక్కుముక్కు లేని అనాధుడేమో. యుద్ధంలో మగణ్ణి పోగొట్టుకున్న వితంతు మాతకి మిగిలిన ఆశ ఇతడొక్కడేనేమో?

"ఇదో, ఇల్లా విను, సులేమాన్." ఉమీద్ గొంతు నెమ్మదిగా, విచారభరితంగా వినిపించి, తల నిమురుతున్నట్లుగా అనిపించింది.

"నీకు తోచిన ప్రశ్నలేవో మూడు చూసుకొని, వాటికి సమాధానం చెప్పు."

జేబు రుమాలు తీసి సులేమాన్ ముఖాన పట్టిన చెమట తుడుచుకున్నాడు. పలుమారు దగ్గాడు. కంఠం సవరించుకొన్నాడు. ఉద్వేగం తగ్గి, స్థిమితపడి అతడు సమాధానాలు చెస్తాడనీ, నిశ్శంకంగా పాస్‌మార్కులు వేయాలనీ ఉమీద్ భావం. ఆయనో తమాషా మనిషి. విషయం తెలియని విద్యార్థికి మార్కులు వెయ్యకపోతే ఇబ్బందేముందీ? గుడ్‌బై చెప్పెయ్యడమే. కాని, ఉమీద్ స్వభావం వేరు. అయ్యో అనుకుంటాడు. బాధపడిపోతాడు. నీరసంగా శరీరం చేసేస్తాడు. ఇంట్లో అందరి మీదా చిరు బురులాడుతాడు. ఎవ్వరూ చూడకుండా రెండు మాత్రలు నోట వేసుకుంటాడు. నిద్ర పట్టక దొర్లుతాడు.

వీళ్లని చూసి పాపం, అయ్యో అనుకోవాలా? చావనీ అనుకుంటాడు, తరుచు కోపంతో మండిపోయి. నువ్వే వీళ్లకి టీచరువు కావు. నీతోనే ప్రారంభం కాలేదు. నీతోనే ఆఖరు కాదు. క్విక్సాటిక్‌గా వ్యవహరించకు. ఎన్నో ఏళ్లుగా బోధకుడుగా రూపొందించుకొన్న నైతిక సూత్రాన్ని తన్ని పారేయాలనుకొనేవాడు. తాను పాస్ మార్కులు వేసిన ఈ అరకొర చదువు విద్యార్థుల చేతిలో పిల్లల్ని పెడితే వాళ్ళకేం చెప్తారు, తన సహచరులంతా అదే విధంగా వ్యవహరిస్తే దేశం ఏమవను అనిపించేది. మన భవిష్యత్తూ, మన తరువాతి తరం గతీ ఏమవుతుంది? – అనుకొనేవాడు. ఓ మారు తన సహచరులతో చర్చ వచ్చినప్పుడు తానన్న మాటలు గుర్తు వచ్చేయి. మీ సలహాలు పాటించి, న్యాయాన్నీ నిష్పక్షపాతాన్నీ విసర్జించి వ్యవహరిస్తే అక్షరజ్ఞానం లేని టీచర్లు, డాక్టర్లు, ఇంజనీర్లూ, లాయర్లు వుండే విచిత్రమైన భవిష్యత్తును నిర్మించుతాము. ఏమంటారు? ఇటువంటి భవిష్యత్తునే కోరుతారా? యూనివర్సిటీ డిగ్రీలున్న పరమ అజ్ఞానులు పోగైన సమాజంలో తన పిల్లలు జీవించాలని కోరుకొనేవారెవరో చెప్పండి. ఏమన్నా అనండి. నాకు మాత్రం అటువంటిది ఏమాత్రం నచ్చదు సుమండి" అన్నాడు, ఆ రోజున.

హఠాత్తుగా తన ఆలోచనలలో తాను పడిపోయాననిపించింది ఉమీద్‌కు.

"కానీ, చెప్పు. వింటున్నా."

"ప్రొఫెసరు గారూ! ఇష్టం లేక పోయినా చెప్పక తప్పదు. టీచరు కుండ వలసిన నేర్పు మీకు లేదు. విద్యార్థి వేపు అల్లా తేరిపారిచూస్తే, వాడు తనకొచ్చినవి కూడా మరచి పోతాడు."

ఉమీద్ ఆ మాటలకి గంద్రగోళ పడ్డాడు. చిరునవ్వు నవ్వేడు.

"నువ్వు చెప్పింది నిజమే నను కుందాం. కాని సులేమాన్, మరిప్పుడేం చేయడం?"

"ఏ విద్యార్థి ? విద్యార్థికి వీలయిన పద్ధతిలో వ్యవహరించాలి."

"అంటే ఏమిటని."

"ఏమిటో చూసు కోవలసింది, మీరు." టీచరు ముఖంలో భావాలు మారడం గమనించి, సులేమాన్ తాను తొందరపడ్డానని గ్రహించేడు. ఉమీద్ - మౌలీమ్ ఏ విద్యార్థికీ ఉప కారానికి మార్కులు వెయ్యడని అతడు బాగా ఎరుగును.

"ఇదిగో, సులేమాన్, ఇవన్నీ వట్టి కుంటి సాకులు. ఇప్పటికి వెళ్ళు. బాగా చదువుకుని మళ్ళీరా."

సులేమాన్ చర్రున కుర్చీ వెనక్కి తోసి, లేచి నిల్చుని మహా కోపంతో అరవసాగేడు.

మొదటి సంవత్సరం నుంచీ మీరు నా మీద కక్షగట్టి హింసిస్తున్నారు. చెయ్యాలనే గంద్రగోళ పరుస్తున్నారు. మనిషి అనేవాడికి మంచి చెడ్డల జ్ఞానం తెలిసి వుండాలి."

"నిజమేనోయ్, నాయనా. మంచి చెడ్డలు తెలిసి వుండడం అవసరమే నోయ్."

ప్రొఫెసర్ మాట అర్థమయింది. సులేమాన్ లేచి తలుపు భళ్ళున మూసి, వెళ్ళిపోయేడు.

రెండు రోజులయాక మాస్కోలో ఏదో మీటింగు వుండి ఉమీద్ వెళ్ళేడు. వెళ్ళే ముందు డీన్‌ను కలుసుకొని, సులేమాన్ మిగతా పరీక్షలో పాసయితే తానూ అతనికి పాస్ మార్కులు వేస్తా నన్నాడు. స్కాలర్‌షిప్ గ్రాంటు రాక పోతే చాలా బాధపడతాడన్నాడు. డీన్ ఒప్పుకొన్నాడు. సులేమాన్ పేరు రాసుకొన్నాడు. 'గుర్తు పెట్టుకొంటా' నన్నాడు.

ఆయన బాకూ తిరిగి వచ్చేసరికి శీతాకాలపు సెలవులయిపోయి చాల నాళ్లే అయింది. తాను క్లాసు తీసుకున్న రోజునే సులేమాన్ కోసం చూసేడు. కనబడలేదు. అతడేమయ్యాడని మిగతా టీచర్లని అడిగేడు. వాళ్ళూ చూడలేదు. క్లాసు కాగానే హాస్టలు కెళ్ళేడు. సెలవులు తరువాత సులేమాన్ రాలేదని సూపరింటెండెంటు చెప్పేడు. సెలవుల కెళ్లిన వాళ్ళు వెంటనే రాక పోవడం విద్యార్థులల్లో మామూలే గనక మరో రెండు రోజులా చూద్దా మనుకున్నాడు. ఓ వారం గడిచినా సులేమాన్ రాలేదు. డీన్ ఆఫీసుకు వెళ్ళి పరీక్ష రికార్డులు తిరగేసి చూసేడు. సులేమాన్ మిగతా పరీక్షలన్నీ పాస య్యేడు. ఒక్క మార్కు తక్కువ రావడం చేత స్కాలర్‌షిప్ మాత్రం రాలేదు. ఉమీద్ - మౌలీమ్ మాట మరచి పోయానంటూ డీన్ చాలా నొచ్చుకున్నాడు. ఉమీద్‌కు కష్టం అనిపించింది. ఆ కనుబొమ్మల ముడి చూసిడీనూ కష్టపెట్టుకున్నాడు.

"నన్ను ఫోర్జరీ చెయ్యమనా మీ వుద్దేశం ? మీకు అంత కష్టమని

పించేటట్లయితే మొదటి నుంచీ జాగ్రత్త తీసుకుని ఉండాలి.''

ఆ మాట నిజమేనను కున్నాడు, ఉమీద్. తప్పు నాదేనను కొన్నాడు. ఎడ్రసు కావాలన్నాడు.

డీన్ గంట నొక్కేడు. సెక్రటరీ వచ్చింది. ఆమె సులేమాన్ ఎడ్రసు వెతికి చెప్పింది. ఉమీద్ వ్రాసుకున్నాడు. బాకూ రమ్మని సులేమాన్‌కు వెంటనే టెలిగ్రామ్ ఇచ్చేడు.

కాలేజీ గేట్‌లో ఇద్దరూ ఎదు రయ్యారు. ఎంతో ప్రియబంధువును చూసినట్లు ఉమీద్ పలకరించేడు. కరచాలనం చేసి, ఆప్యాయంగా అడిగేడు

''క్లాసుకి రావడం లేదేం?''

''ఇంక చదవ దలుచుకోలేదు.''

''ఏం?''

''కష్టం'' – అంటూ సులేమాన్ తల ఎత్తి ఉమీద్ వంక చూసేడు. ''ఇంతవరకూ గ్రాంట్ వచ్చేది కనక ఏదో గడిపేవాణ్ణి. ఇప్పుడది రాదు నా పేరు తీసేశారు.''

ఉమీద్ విచారించేడు. తన మూలంగా ఓ కుర్రాడు రెండు సంవత్స రాల చదువు మానవలసి వస్తుందే అని పించింది. సులేమాన్ భవిష్యత్తంతా ఇప్పుడింక ఉమీద్ మీదనే ఆధారపడి వుందనిపించింది. అతడు కాలేజీ మాన కుండా నిలబడి, శ్రద్ధగా చదువుకుంటే, ఉన్నతవిద్య పొంది, మంచి వుద్యోగం సంపాదించుకో గలుగుతాడు. వదిలేస్తే, ఏమయిపోతాడో భగవంతుడికే ఎరుక. చెడ్డ సావాసాలు మరగవచ్చు. ఏం చెయ్యాలో తోచక, తప్పుదారులు పట్టిన కుర్రవాళ్లని ఆయన ఎందరినో చూశాడు.

''కాలెజి మానకు.''

''బతికే దారే లేదే.''

''ఈ టెరమ్ మట్టుకి నీ గ్రాంటు నేను ఇస్తా.''

సులేమాన్ ఆశ్చర్యపడ్డాడు. టీచ రును కళ్ళప్పగించి చూసేడు. తన ప్రత్యర్థిని బోల్తా కొట్టించేనన్న విజయ గర్వం అతని కళ్ళలో కనిపించినట్లు ఉమీద్‌కు ఒక్క క్షణం అనిపించింది. కాని, ఆ ఆలోచనను అణుచుకున్నాడు.

''ప్రొఫెసరు గారూ. మరి నాకు పాస్ మార్కులు వేస్తారా ?''

''బాగా చదువుకుంటేనే.''

మాత్ర వేసుకున్న తరువాత ఎప్పుడూలాగే ఉమీద్ – మాలీమ్‌కు నీరసంగా వుండి ఏ పనిమీదా వుత్సా హం లేకుండా పోయింది. కిటికీ కొంచెం తెరిచేడు. రాలిపోయిన ఆకుల నుంచి వచ్చే కసరు వాసన గాలిలో తేలి వచ్చింది. చల్లని అపరిశుద్ధమైన గాలితో ప్రాణం హాయనిపించింది. హఠాత్తుగా చిన్నప్పుడు విన్న పేద రాసి పెద్దమ్మ కథ జ్ఞాపకం వచ్చింది. తన వయసు పిల్లకాయలందర్నీ పోగు చేసి, మల్బరీ చెట్టుక్రింద కూర్చుండ బెట్టి అలీ – కాష్ ముసలమ్మ అనేక తరహాల కథలు చెప్పేది. అందులో నిజమైనవి వుండేవీ, కేవల కల్పితాలూ వుండేవి. ఇది అలా విన్నది కావచ్చు. లేదా ఏదన్నా పుస్తకంలో చదివీ వుండొచ్చు. ఎక్కడ విన్నదో ఏమో. గాని కథ యిది:

అనగనగా ఒక వూళ్ళో ఒక దొర ఉండేవాడు. ఆయన ఎంతో మంచి వాడూ, గొప్ప శూరుడూ. ఆయనకో మంచి గుర్రం వుండేది. అది దౌడు తీసినా, చుట్టుపక్కల మైళ్లకు వినిపించేలా సకి

లించినా, నువ్వా నేనా అనే పోటీ పందెం గెలిచినా, పడుచు కన్నెల కళ్లలో ఆరాధన కనబడేది. పడుచు కారు రౌతులు ఆయన చుట్టూ చేరేవారు. ఒక రోజున ఆయనకు రోడ్డు ప్రక్కన కదల మెదల లేని అవిటి వాడొకడు కనిపించేడు. కళ్లెం బిగపట్టి గుర్రాన్ని ఆపేడు. ఎక్కడికి కెళ్తున్నావని అడిగేడు. గుర్రం మీద కూర్చుంటావా తీసుకెడతానన్నాడు కాని, అతడు రికాబులో కాలు పెట్టగల ఓపికతో కూడా లేడు. ఆ రౌతు గుర్రం దిగి, ఆ అవిటివాడిని ఎత్తి, జీను మీద పొందికగా కూర్చోబెట్టేడు. ఆ కూర్చున్న మరుక్షణంలో అతడు రికాబులో కాళ్లు తన్ని పెట్టి, కళ్లెం బిగలాగేడు. గుర్రం అసమ్మతి తెలుపుతున్నట్లు సకిలించింది. వెనకకు నడిచింది. అప్పుడా రైతుకు అర్థమయింది. ఆ అవిటి వాడెవడో కాదు. తన పూర్వ శత్రువే. అయ్యో అనుకున్నాడు. కాని ఆ దొంగ వెక్కిరింతగా నవ్వేడు.

"గుర్రం కోసం బాధ పడడం అప్రతిష్ఠ సుమా."

"నేను బాధపడ లేదురా నీచుడా. ప్రజల మీద నాకున్న విశ్వాసాన్ని భగ్నం చేసేవే అనిరా నా ఏడుపు" - అన్నాడు.

ఉమీద్ - మౌలీమ్ చేయి ఎవరో పట్టుకున్నట్లనిపించి తిరిగి చూసేడు. తన పూర్వ మిత్రుడు తన బాధ ఆయనకు కనబడనీయరాదని పక్కకు తిరిగేడు. కిటికీ లోంచి వస్తున్న చల్లని గాలిని ఆప్యాయంగా పీల్చుకున్నాడు. సన్నగా, నీరసం చిరునవ్వు మొగాన కనిపించింది. కాని, ఆ మిత్రుడు అన్నీ గమనించేడు. ఇద్దరూ యుద్ధంనుంచి తిరిగి వచ్చేరు. ఒక్కమారే పోస్ట్ గ్రాడ్యుయేట్ తరగతుల్లో చేరి చదివేరు. హాస్టల్లో ఇద్దరూ ఒకే గదిలో వుండేవారు. రేషన్ కార్డు మీద సజ్జలు ఇద్దరూ కలిసే తెచ్చుకొనేవారు. ఒక గిన్నెలోనే వండుకొని ఒక కంచంలోనే తినేవారు.

ఆయన సర్వం గ్రహించేడు.

"ఏమిటోయ్, ఇప్పుడు సంతృప్తిగా వుందా?"

"ఇప్పుడేమయిందేమిటి?"

ఇద్దరూ ఒక్క నిముషం నిశ్శబ్దంగా వుండిపోయేరు. భుజాల మీద చేతులు వేసుకుని, హుషారుగా గల్లంతుచేస్తున్న విద్యార్థుల మధ్య నుంచి వీధిలోకి వచ్చేరు.

తిన్నగా బీచి రోడ్డు వేపు నడిచేరు. ఉమీద్ - మౌలీమ్ చటుక్కున నిలబడ్డాడు ఏం మాటన్నావన్నట్లు మిత్రుని వేపు చూసి అడుగు వేసేడు. తిన్నగా బీచి రోడ్డు వేపు నడిచారు.

"క్విక్సాటిక్‌గా వ్యవహరించ వద్దని ఎన్ని సార్లు చెప్పాను."

ఉమీద్-మౌలీమ్ ఆగి, తన మిత్రుని వేపు మందలిస్తున్నట్టుగా చూశాడు.

పర్సు దొంగతనం చేసేడని ఒకతని మీద కేసు. వాదనలు విన్నాక తగినంత సాక్ష్యం లేదని జడ్జి కేసు కొట్టేసేడు.

"నిన్ను విడుదల చేస్తున్నాను."

ఆ మాట కర్థం ఏమిటో అతనికి అర్థం కాలేదు.

"నన్ను ఏంచేస్తారు ?"

"విడుదల చేస్తున్నాను. నువ్వింటికి పోవచ్చు"

"అంటే . . . ఇంతకీ ఆ పర్సు నేను వుంచుకోవచ్చునాండి?"

ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్

ఈ మధ్య (డిసెంబరు 31 వ తేదీని) 'హిందూ' పత్రిక మన దేశపు పిల్లలకు సంబంధించిన, అందరూ జాగ్రత్తగా ఆలోచించవలసిన చర్చను ప్రచురించింది. ఈ చర్చలో పాల్గొన్న ప్రముఖ నిపుణులు చెప్పిన దానిపైన వచ్చిన వ్యాఖ్యలు చాల వాటినికూడా ఆ పత్రిక ప్రకటించింది.

చర్చలో పాల్గొన్నవారు, వ్యాఖ్యాతలు దేశంలో పాతుకుపోయి వున్న దారుణమైన పరిస్థితుల్ని బయటపెట్టి తమకు తోచిన పరిష్కారాలను సూచించారు. ఆ దారుణ పరిస్థితులేమిటో ముందు తెలుసుకొని, ఆ తరవాత ఆ పరిష్కార మార్గాలు ఎంతవరకూ సవ్యమైనవో చూద్దాము. (చర్చలో పాల్గొన్నవారు పూర్వపు కేంద్ర ప్రభుత్వ మంత్రి సి. సుబ్రహ్మణ్యం, యిటీవల ఉద్యోగ విరమణ చేసిన మద్రాసు బాలల వైద్యశాల అధిపతి డాక్టర్ బాలగోపాల రాజు వంటి కొందరు ప్రముఖులు. వ్యాఖ్యాతలలో ఒకరు, అంతర్జాతీయంగా ప్రసిద్ధుడైన న్యూరో సర్జన్ డాక్టర్ బి. రామమూర్తి.)

చర్చలోను, దాని పర్యవసానంగానూ వెల్లడైన యదార్థ పరిస్థితులివీ:

దేశపు జనాభాలో సుమారు సగం మంది, అంటే 30 కోట్ల మంది దరిద్రావస్థలో వున్నారు. ఆరేళ్ళ లోపు వయస్సులోని 13 కోట్ల మంది పిల్లలలో వెయ్యి ఒక్కింటికి 125 మంది - అంటే ఎనిమిదో వంతు మంది - మరణిస్తున్నారు గ్రామాలలో అయితే యీ సంఖ్య వెయ్యికి 140 మంది.

పిల్లలే కాదు. తల్లులు కూడా పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారు. ఇందుకు కారణం చాలీచాలని, పోషక పదార్థాలు లేని ఆహారం; అనారోగ్యకరమైన నీరు తాగడం, వ్యాధి నిరోధకమైన కట్టుదిట్టాలు లేకపోవడంవల్ల అంటువ్యాధులకు బలికావడం; ఆరోగ్యాన్ని చెడగొట్టే పరిసరాలు; అజ్ఞానం; మందులు, వైద్యులు అందుబాటులో వుండకపోవడం మొదలైనవి.

పుట్టడానికి ముందర, ఆ తరవాత బిడ్డకు, తల్లికి అవసరమైన మోతాదులో పౌష్టికాహారం అవసరం. కటిక దరిద్రావస్థలో వున్న 50 శాతం జనాభాకు యిది ఆకాశ కుసుమంగా వుంది. స్తోమత వున్నవారు కూడా అజ్ఞానం వల్ల పౌష్టికాహారం తీసుకోవడం లేదు. దేశంలో పాతుకపోయివున్న దారిద్ర్యం, అజ్ఞానం వల్ల ఏర్పడిన దుస్థితి యిది.

ఇలా జనక్షయం జరుగుతూ వున్నప్పటికీ, జనాభా పెరుగుదల ఆగడం లేదు, అది పరుగులు తీస్తూనే వుంది. పూర్వపు ప్రభుత్వం దమనకాండ ద్వారా సంతాన నిరోధాన్ని సాధించదలుచుకుంటే, యిప్పటి ప్రభుత్వం ఆ వక్రమార్గం వొదిలి పెట్టడం అయితే చేసింది గాని, సంతాన నిరోధావశ్య

కతను అశ్రద్ధ చేస్తోంది. ఇందువల్ల భవిష్యత్తులో యిప్పటికంటే ప్రమాద కరమైన పరిస్థితులు వచ్చి పడతాయని తెలిసినా, స్వంత బాధల్లో సతమత మవుతూ వుండడంవల్ల, దానికి తీరు బడి చిక్కడం లేదు.

చర్చలో పేర్కొనబడిన ఒక యదార్థ విషయాన్ని పేర్కొని, డాక్టర్ రామమూర్తి హెచ్చరిక చేశారు. అదేమిటంటే ఆ బిడ్డ తల్లి గర్భంలో వున్నపుడు చివరి దశలోనూ, పసి తనంలోనూ పౌష్టికాహార లోపం వల్ల మెదడు, బుద్ధి వికాసం దెబ్బతింటాయి

గుండే - గుండు

యన్నంరెడ్డి వెంకటరెడ్డి

ఈ సంకుచిత మానస రాక్షసుల
మధ్య
జీవించడం కష్టం కనుక
ఉండడం యిష్టం లేక
ఈ సమాజం నుండి ఎక్కడికో
అంతం లేని అరణ్యాల్లోకి
— పోవాలనుంది!
ఎక్కడ చూచినా, ఎన్నెన్ని
వెతికినా
కనిపించే దృశ్యాలు
అన్యాయాలు - అక్రమాలు -
అసమానతలు
అందుకే —
ఈ సమాజం నుండి పారిపోయి
గుండులాంటి గుండెతో
తిరిగి రావాలని వుంది!!

ఈ కీడు తీవ్రమైనది, శాశ్వతమైనది. తరువాత పౌష్టికాహారాన్ని, విద్యనూ యిచ్చినప్పటికీ యీ కీడును పూర్తిగా సరిదిద్దడం సాధ్యమయే పని కాదు. భారత దేశంలో ఏడాదికి ఒక కోటి పది లక్షల మంది పిల్లలు పుడు తున్నారు. వీరిలో 50 శాతానికి పైగా ఆహారపుష్టి లేనివారు, ఫలితంగా మంద బుద్ధులు. అంటే ఏడాదికి అరవై లక్షల మంది మంద బుద్ధులు దేశజనాభాలో చేరుతున్నారన్న మాట. రెండు దశా బ్దాలలో, యిటువంటి వారు అదనంగా పన్నెండుకోట్లు ఏర్పడుతారు ('హిందు' జనవరి 5, సంపాదక లేఖలు.)

ఈ భయంకర సమస్యకు పరిష్కార మార్గాలు: రేడియో, సినిమా, పత్రికలు, కళాసాధనాల ద్వారా ఆరోగ్య విద్యా ప్రచారం. నిధుల కేటాయింపు. బిడ్డకు విలువైన మానవునిగా గుర్తింపు. పౌష్టికా హారం, వైద్య సౌకర్యాలు వున్న శిశు పోషణాలయాల స్థాపన. తాలూకా స్థాయిని శిశు సంక్షేమం తాసీల్దారు నియామకం. సవ్యమైన మధ్యాహ్న భోజనం ఏర్పాటు. బ్యాంకులు, ఎల్. ఐ. సి, రామకృష్ణ మిషన్, లయన్స్ క్లబ్ వంటి వాటి సహాయం. విదేశాల సహాయం యిత్యాది. ఈ చిట్కావైద్యా లతో యీ భయంకర వ్యాధిని చికిత్స చేయగలమని వీళ్ళ నమ్మకం. వీరిలో ఒక్కరు మాత్రం (శ్రీ సి. సుబ్రహ్మ ణ్యం.) పిల్లలకోసం సామ్యవాద ప్రణా ళికను సృష్టిచేసి సమస్యను పరిష్క రించాలని సూచించారు.

హాస్యాస్పదమైన యీచిట్కా వైద్యుల చికిత్సా పద్ధతులను ఆత్మవంచనగానో, పరవంచనగానో పరిగణించ వలసి

వుంటుంది. ఇటువంటి కుహనా జీవకారుణ్య పద్ధతులు యిప్పుడు దేశంలో ఆచరణలో, లేక కాదు. ఇంకా వీటిని వెయ్యి రెట్లు పెంచినా యీ సమస్య చెక్కు చెదరకుండా వుంటుంది, సందేహించ నక్కర లేదు. అమెరికా వంటి అత్యంత సంపన్న పెట్టుబడిదారీ దేశం సైతం యీ అడ్డదారులు తొక్కి విఫలం కావడం రహస్యమేమీ కాదు.

ఇది తీవ్రమైన సాంఘిక సమస్య. సమాజం అంతటికీ సంబంధించిన ఈ సమస్యను, సమూల సాంఘిక పరివర్తన ద్వారా పరిష్కరించాలన్న ఆలోచనను వెనకకు నెట్టి, ప్రత్యేకించి పిల్లలు కోసం మాత్రం సామ్యవాద ప్రణాళికను రూపొందించాలన్న సలహా (సమాజానికంతకూ లేకుండా పిల్లల కోసం మాత్రం సామ్యవాద ప్రణాళికను ఎలా రూపొందిస్తారో!) అవివేకమైనదైతే, పైన పేర్కొనబడ్డ చిట్కా సూచనలు అసలు సమస్యను దాటవేసేవి.

దోపిడీ వ్యవస్థను రద్దుచేసి సమాజాన్ని సమూలంగా పరివర్తనం చేసిన సోషలిస్టు దేశాలలో సర్వ ప్రజలు, ప్రప్రధానంగా పిల్లలు; మన దేశంలోనూ, దోపిడీ వ్యవస్థలున్న దేశాలలోనూ అనుభవమవుతోన్న దుస్థితి నుండి విముక్తులయ్యారన్నది తెలియని సత్యం కాదు. దీని ప్రస్తావన 'హింమా' పత్రిక నిర్వహించిన చర్చలో ప్రస్తావన మాత్రంగా వచ్చిందే గాని; ఆ చికిత్స ఒకటే మన దేశాన్ని పట్టి పీడిస్తోన్న వ్యాధికి, భవిష్యత్తులో మరింత దారుణంగా మనలను యాతనలకు గురిచెయ్యనున్న వ్యాధికి చికిత్సా సాధనమన్న అవగాహన మృగ్యమై, యీ చర్చ చీకటిలో తడుములాటగా సమాప్తమయింది.

సాహిత్య విమర్శ - ధోరణులు

టి. ఎల్. కాంతారావు

సాహిత్యం సమాజం యొక్క హితవును కోరుతుందని ఇన్ని శతాబ్దాల తెలుగు సాహిత్య సృష్టి అనంతరం ఇవాళ కొత్తగా చెప్పవలసిన పని లేదు. ఈ సత్యాన్ని అంగీకరించిన ప్రతివాడు సాహిత్యానికి ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కూడా ఉందని అంగీకరిస్తాడు. సాహిత్యానికి, అది ఏ కాలంలో ఉద్భవిస్తున్నదో ఆ కాలపు సమాజ స్థితిగతులకు, ఆ సమాజంలో నివశించే అనేకానేక ప్రజా సమూహాలకు విడదీయరాని బాంధవ్యం ఒకటుంటుంది. అంటే కవిత్వానికి వ్యక్తి అంతరంగం కారణమయినా, వ్యక్తి సంఘానికిఅతీతుడు కాడు గనుక, అతడు సమాజంలో అంతర్భాగమే కనుక అతని కవిత్వం కేవలం వ్యక్తినిష్ఠమే కాకుండా సమాజ నిష్ఠమూ అవుతుంది. కవి అంతరంగం సమాజ అంతరంగంలో స్పందించడం అనేది తెలుగు దేశంలో ఆధునిక కాలంలోని ఒకానొక విస్పష్ట లక్షణం. అయితే ఏ కాలంలోను కవులంతా కవితా వస్తుపరంగా ఏకాభిప్రాయం కలిగిన వారు కాదు. కవులలో సిద్ధాంతపరంగా భిన్నత్వం పూర్వం ఉంది; ఇక ముందూ ఉంటుంది. సృజనాత్మక సాహిత్యంలో దృశ్యమాన మవుతున్న ఈ భిన్నత్వం ఏతత్ సాహిత్యాన్ని అంచనాకట్టి విలువలు నిర్ణయించే విమర్శలో కూడ ప్రతీయమానం అవడం ఆశ్చర్యకరమైన విషయం కాకపోగా, సర్వసాధారణమయిన విషయమైంది.

తెలుగు కవిత్వాన్ని కరెక్టుగా కొలవడానికి నిన్న మొన్నటి దాకా సంస్కృతాలంకారిక శాస్త్రాలే ప్రమాణంగా నిల్చాయి. సంప్రదాయ పద్ధతిలో, సంప్రదాయక ఛందస్సులో రాస్తేనే కవిత్వమనే నమ్మకం ఉన్నట్లుగానే అలంకార శాస్త్ర ప్రమాణంతో చేసిందే విమర్శ, మిగిలినది కాదు అని నమ్మేవారు మనలో ఇంకా ఉన్నారు. కవిత్వం ఇట్లాగే రాయాలి; విమర్శ యీ పద్ధతులోనే ఉండాలని శాసించడం సంపూర్ణంగా అజ్ఞానం.

తెలుగులో ఆధునిక విమర్శనాపద్ధతి గత అర్ధ శతాబ్ది వరకూ కొత్త అయితే అయి ఉండవచ్చుగాని ఈ దశాబ్దిలో మాత్రం కొత్త గాదు. లక్షణంతోపాటు అవలక్షణం ఉండవచ్చు కాని. అసలు లక్షణమే లేదు అనుకొనడం ఆత్మవంచన. ఈ దశాబ్దిలో తెలుగు కవితా విమర్శ వలసినంతగా వచ్చింది. అట్లాగే ఈ దశాబ్దిలోనే తెలుగు కవిత్వం కూడా వలసినంతగా వచ్చింది.

విమర్శ ఎంత ఎక్కువగా ఉత్పత్తి అయిందో అంత ఎక్కువగానూ అభిప్రాయభేదాలు కూడా ఉత్పత్తి అయాయి. కవికి వ్యక్తిత్వం ఉన్నట్లుగానే విమర్శకునికి కూడ వ్యక్తిత్వం ఉంటుంది. కవికి సిద్ధాంత భావం ఉన్నట్లుగానే విమర్శకునికి కూడా సిద్ధాంత భావం ఉంటుంది. కనుక అటు కవిత్వంలోను, ఇటు

విమర్శలోను భిన్న ధోరణులుండటాన్ని వ్యతిరేకించ వలసిన అవసరం లేదు. విమర్శలో ఇప్పుడున్న ధోరణులను విశ్లేషించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

కవి ఏ సిద్ధాంత భావనతో రాసినా అది కళాత్మక విలువల్ని కలిగి రసస్థాయికి చేరితే అది ఉత్తమ కవిత్వమనే విమర్శకులు ఒక తెగ. కవి ఏం చెప్పాడు అన్నది వీరికి ప్రశ్నకాదు; ఎలా చెప్పాడన్నది ప్రశ్న. కవిత్వం కవిత్వం కోసమే కాని కవిత్వం ఏ ప్రయోజనాన్నో సాధించడానికి కాదు అని నమ్మ గలిగేటట్లయితే ఈ పద్ధతిని అంగీకరించవచ్చు. నిబద్ధ కవిత్వం రాసినా, అనిబద్ధ కవిత్వం రాసినా, సమాజాన్ని గురించి రాసినా, సన్యాసాన్ని గురించి రాసినా ఉత్తమస్థాయి కళాత్మక విలువల్ని మాత్రమే ఈ విమర్శకులు ఆశిస్తారు. విశ్వనాథ సత్యనారాయగారిని, శ్రీశ్రీ ని, ఇద్దర్నీ వీరు ఒకే దృక్పథంతో ఆనందించగలరు. వీరి విమర్శలో మేధస్సు, శాబ్దికమైన అధికారం, శబ్దాల గారడీ అన్నీ ఉంటాయి. విశ్వనాథ వారు, శ్రీశ్రీ సమాజగతమైన దృక్పథాల్లో పరస్పర వ్యతిరేకులైనా అనితరసాధ్యంగా కవిత్వం చెప్పారు గనుక, ఈ ఇద్దరూ మహాకవులే అనే విమర్శక ధోరణి ఇది. అంటే ఈ జాతి విమర్శకులకు కవిత్వంలో ప్రతిపాదింపబడుతున్న వస్తువు మీద ఈషణ్మాత్రం కూడా అనూకూలంగాని ప్రతికూలం గాని ఉండదు, వస్తువు పురోగమనశీలమా, పాశ్చాద్గమనమా అన్న విచక్షణ ఉండదు. వారికి కావలసినది కవితాపరమైన విలువలు. ఆ విలువల్ని నిర్ణయించడంలో – ధ్వని, రసము, నాయకా నాయిక నిర్ణయం, శబ్దసాధుత్వం, గణ యతి ప్రాసాది దోషాలు మొదలైన అంశాలు ఉోతకర్తలుగా వీరు పరిగణిస్తారు. రసస్థాయి, వ్యంజకత కవిత్వానికి ప్రాణభూతమైన లక్షణాలు కావని ఏ ఆధునిక విమర్శకుడూ ఇంత వరకూ అనలేదు. అయితే మారుతున్న కవితా రూపాలకు మారని ప్రాచీన అలంకారిక శాస్త్రాల్నే విమర్శక ప్రమాణాలుగా భావించి, ఆ ప్రమాణాలతోనే ఈనాటి కవిత్వాన్ని అంచనా వేయడం కన్న మూర్ఖత్వం మరొకటుండదు. తెలుగు కవిత్వానికి, సంస్కృత అలంకార శాస్త్రాల్నే ఇప్పటికీ ప్రమాణాలుగా శిరసావహించడం తెలుగు వాడి దౌర్భాగ్యం.

పాఠకులను దిగ్భ్రాంతుల్ని చేసే విమర్శ

ఇటీవల విమర్శ పేరుతో చెలామణీ అవుతున్న వ్యాస స్వరూపం ఇంకొకటి ఉన్నది. తనకు నచ్చిన కవివి ఒకటో రెండో కావ్యాలు తీసుకుని, దాని లోంచి శతానేక ఉదాహణలిస్తూ, ఉదాహరణ క్రింద 'ఎంత బాగా అన్నాడో చూడండి', 'ఈ శిల్పం చాలా గొప్పది', 'అద్భుతమైన పాదాలివి', 'ఇంత కన్న సామాజిక స్పృహ మరో కవిలో ఉండదు' – ఇలాగా రాసుకుంటూ పోవడం, ఇది విమర్శే కాబోలని పాఠకులు దిగ్భ్రాంతి చెందడం. ఇవాళ వస్తున్న విమర్శలో ఎక్కువ భాగం ఈ కోవకు చెందినదే. ఇలాంటి విమర్శ పుస్తకం మొదట్లో ఇంట్రో, అట్ట వెనుక రచయిత పరిచయాన్ని చూసి గ్రంథ సమీక్ష రాయడం లాంటిది. ఈ విమర్శకులతో ఏ ఒక్కడికీ పేచీ ఉండదు. ఎందుచేతంటే వీళ్ళు వివాదగ్రస్తమైన జాతి కాదు గనుక.

ఈ సమాజ గమనంతో ఏ మాత్రం నిమిత్తం లేకుండా వైయక్తికానందం కోసం కవిత్వం రాస్తారు కొంత మంది. అధిభౌతిక, మార్మికవాద, ప్రతీకాత్మక కవితా ప్రక్రియలు అలాంటివి. వీళ్ళని వ్యక్తివాద కవులు అనడంలో దోషం లేదు. వీళ్ళ దృష్టిలో వ్యక్తిగత అభివృద్ధి సమాజగతమైన అభివృద్ధి. వ్యక్తి తనంతట తానుగా సంపూర్ణ వికాసం చెందడానికి ప్రయత్నిస్తే - సమాజం దానంతటదే వికాసం చెందుతుందనేది వీరి విశ్వాసంగా భావించవచ్చు. ఈ కవిత్వాన్ని భుజాన వేసుకొని ప్రత్యేకంగా విమర్శలు రాసేవాళ్ళు లేరు గాని ఆయా కవులు అప్పుడప్పుడు వారి కవితా ప్రక్రియకు అనుకూలంగా వారి అభిప్రాయాలను వ్యాసరూపంలో వెలువరిస్తున్నారు. వ్యక్తివాద కవుల ముఖ్యాంశం కవిత్వానికి కవి హృదయం మూలం. ఆ హృదయం ఎలా కంపిస్తే అలా కవిత్వం వస్తుంది. కనుక కవిత్వం వ్యక్తిపరమైనదని. కవిత్వం వ్యక్తిపరమైనదనడంలో పేచీ లేదు. వ్యక్తి కేవలం వ్యక్తికాక సమాజ యంత్రాంగంలో అతనొక భాగం. వ్యక్తి ఏకాకి కాడు ; సంఘజీవి. అంచేత అతన్నించి వచ్చిన కవిత్వం ఏకాకితనాన్ని సంతరించుకోజాలదు. మానవుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పబడటానికి సాహిత్యం అవసరమైనపుడు, ఆ బంధంలో సర్వమానవజాతికి సంబంధించిన సమిష్టి లక్షణం ఆ సాహిత్యానికి ఊతం అయినపుడు వ్యక్తివాదం అంతరించి సమిష్టి వాదం పొడుకుంటుంది. ఏమైనా ఈ పద్ధతిలో చెప్పుకోదగ్గ కవిత్వం ఉన్నట్లు, చెప్పుకోదగ్గ విమర్శ లేదు.

స్వంత గొప్ప డబ్బా వాయింపు

విమర్శకులు రెండు తెగలున్నారు. మొదట తెగ కవి విమర్శకులు. రెండవ తెగ కవిత్వం రాయని విమర్శకులు. కవి విమర్శకులు నుంచి వచ్చే విమర్శ వారి కవితా స్వరూపాన్ని సమర్థించు కొనేదిగా ఉంటుంది. అంచేత దానిలో కొన్ని లోపాలుంటాయి. ఈ లోపాలు ఎంత భయంకరమైనవంటే - ఇతరులది కవిత్వం కాదని తనొక్కడిదే కవిత్వమని, ఇతరులది విమర్శ కాదని తనొక్కడిదే విమర్శని దానికి ఉపపత్తులు తన కవిత్వంలోంచే, తన విమర్శ లోంచే చూపించేటంత భయంకరమైనది. ఎప్పుడూ కూడా ఒక కవి గాని ఒక విమర్శకుడు గాని మరే కళాజీవి గాని తనకు తానుగా నేను గొప్పవాణ్ణి, నేను రాబోయే యుగానికి ప్రతినిధిని, నా పూర్వం గాని, నా తరువాత గాని కవిత్వం లేదు, ఉండదు అని అనుకుంటే బుద్ధివున్న రెండో వాడేవడూ పట్టించుకోడు. కాని దురదృష్ట మేమిటంటే - మిగిలిన కవులందర్ని చాకలి, మంగలి షాపులు పెట్టుకో మనడం. ఇది వ్యక్తిగత అహంకారంలోంచి, కీర్తి కండూతిలోంచి పుట్టే విమర్శ. కవి మహాపండితుడు కానక్కర్లేదు. మహాపండితులంతా కవులైనారని గాని, మహా కవులంతా పండితులైనారని గాని గొంతుచించుకొని చెప్పడానికి సంపూర్ణ దాఖలాలు మనకెక్కడా లేవు. ఒకవేళ ఏ కొద్దిమందైనా గొప్ప పండితులు గొప్పకవులు కావచ్చు ; కాని ఇలా చెప్పుకుని యావదాంధ్రదేశంలోను తమ కీర్తి గొప్పని డప్పు వాయించు కుంటున్న కవులు కవినామకులైతే కావచ్చుగాని మహాకవులు మాత్రం

కాదు; యుగ కవులు అంశ కంటే కాదు; రాబోయే యుగానికి ప్రాతినిధ్యం వహించే అర్హత వారికి లేనేలేదు. అట్లా లేదని వారి కవిత్వం ఋజువు చేస్తునే ఉంది.

ఇప్పటికి చరమ రూపంగా కనబడుతున్న సాహిత్య విమర్శ మార్క్సిస్టు విమర్శ. ఇదొక విలక్షణమైన పద్ధతి. మార్క్సిస్టు విమర్శ అనంగానే చాలా మందికి వస్తుపరమైన విమర్శ అని అదంతా ఉత్త రాజకీయ ప్రసంగమని అభిప్రాయం ఉంది. మార్క్సిస్టు విమర్శను సక్రమంగా అవగాహన చేసుకొనక పోవటం వల్లను, అవగాహన చేసుకోవాలనే ప్రయత్నలోపంవల్లను ఇటువంటి అనర్థం సంభవిస్తుంది. మార్క్సిస్టు విమర్శనా విధానంలో వస్తువు, రూపం రెండూ వేరు వేరు కాదు. ఈ రెంటిటి అభేదమే మార్క్సిస్టు విమర్శ చెప్పేది. ఆ సిద్ధాంత దృష్ట్యా వస్తువు రూపాన్ని అన్వేషిస్తుంది. అంటే వస్తువు తన రూపాన్ని తానే ధరిస్తుంది.

మార్క్సిస్టు విమర్శ

మార్క్సిస్టు విమర్శకుడైన వాడు తన సాహిత్య విశ్లేషణలో ముందుగా పరిశీలించేది ఏం చెప్పాడని. సాహిత్యగతమైన వస్తువు అతని విమర్శనా విధానంలో ప్రధానస్థాన మాక్రమించి శిల్ప వివరణ ద్వితీయస్థానాన్ని ఆక్రమిస్తుంది. సందేహ జీవులకు ఇక్కడ వస్తువు, శిల్పం వేరు గదా అనే అనుమానం రావచ్చు. కావ్యం మొత్తంగా పరికించేటప్పుడు ఈ రెండిటికి భేదం ఉండదు. ప్రతిపాదిత వస్తుస్వరూపం ఏమిటి? ఆ వస్తువు ఎవరికోసమైతే రాస్తున్నాడో ఆ వర్గంపై అది చూపించే ప్రభావం మేర ఎంత? - అని విమర్శకుడు విశ్లేషించి తరువాత రూపాన్ని వివరిస్తాడు. మార్క్సిస్టు విమర్శలో రూపాన్నిగురించి ఆలోచన అత్యంత విలువైనది. నినాద ప్రాయమైన అభ్యుదయకర వస్తువుని తీసుకున్న రచన మార్క్సిస్టు విమర్శకుని దృష్టిలో ఉత్తమ రచన కాదు. అభ్యుదయకరమైన వస్తువు వస్తువుని తనలో ఇముడ్చుకోగలిగి అతిసునాయాసంగా తన ప్రభావాన్ని పాఠకులపై ప్రసరింప చేసే రూపావిష్కరణ కలిగిన రచన అతని దృష్టిలో ఉత్తమ మయినది. కనుక మార్క్సిస్టు విమర్శకుడు కళాత్మకమైన విలువల్ని విస్మరిస్తాడనే వాదం ప్రగతి నిరోధకుల వాదమే కాని ప్రగతి వాదుల సిద్ధాంతం కాదు. మార్క్సిస్టు విమర్శకుడి దృష్టి ఈ సమాజాన్ని పాలిస్తున్న ఆర్థిక వ్యవస్థ మీదుంటుంది. ఆ పిమ్మట మతం, కులం మొదలైన మూఢసిద్ధాంతాల మీద కేంద్రీకృత మవుతుంది. అభ్యుదయ రచన అంటే నాదృష్టిలో - వర్గ దృక్పథాన్ని కలిగిన రచన అని. పీడింపబడేవాడు పీడించేవర్గంమీద తీసుకురాబోయే చైతన్య వంతమైన తిరుగుబాటును తన రచనల ద్వారా ద్విగుణీకృతం చేసే రచన ఏదైతే ఉన్నదో అది అభ్యుదయ రచన. ఈ తిరుగుబాటు ఏ మార్గంలో అన్న అంశం మీద భిన్నాభిప్రాయాలుండవచ్చు. అది అప్రస్తుతం. ఈ విధమైన మార్క్సిస్టు విమర్శ తెలుగు సాహిత్యంలో ఇటీవల వేగంగా అభివృద్ధి చెందుతున్న విమర్శ. స్థూలంగా ఈ నాటి విమర్శక ధోరణులు ఇవి. వీటిని గురించి సోదాహరణంగా, సూక్ష్మాంశ పరిశీలనలో వివరించడం ఈ వ్యాసం పరిధిలో సాధ్యంగాని విషయం.

(ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఎనిమిదవ మహాసభలో చదివిన పత్రం)

కూటికి పేదవారైతే...

(మినీ కథ)

వై. ప్రభాకర్ రెడ్డి

రాజా నా పాత స్నేహితుడు. యిక్కడే ఉంటే అలా అయ్యేవాడు కాదు. నిన్న రాత్రి వచ్చాడు. అన్నీ రాచ మర్యాదలే చేసాను. ఆఖరు కోరికగా పిల్లను తెప్పించ మన్నాడు.

ఆలోచించి – "రూములో నీళ్ళు పోసే రామయ్య కూతురు వుంది పిలిపించేదా" అన్నాను.

"వస్తుందా" అన్నాడు.

"వచ్చి వుండింది ఒకసారి" అన్నాను.

మరుసటి రోజు ప్రొద్దున నీళ్ళు పోయడం అయిన తర్వాత రామయ్యను ప్రక్కకు పిలిచాను. వచ్చాడు.

అనుభవం కాబట్టి ధైర్యంగా, "రామయ్యా లక్ష్మిని రాత్రి రూముకు..." అన్నాను.

ముఖం ముడుచుకొని జీరపోయిన గొంతుతో, "బాబూ! మేం కూటికి పేద వాళ్ళం కాని..."

నేను మధ్యలో అందుకొని, "చూడు రామయ్యా! కూటికి పేదలైతే విధిగా అన్నిటికీ పేదవారు కావాలి. తప్పదు. నీకంటే నీ కూతురే జీవితాన్ని బాగా చూచింది. పోయి అడుగు" అన్నాను

రామయ్య గొణుక్కుంటూ బయటికి నడిచాడు.

రాత్రి పది గంటలకు లక్ష్మి వచ్చింది.

గడచిన సంవత్సర మంతటా జర్మను మహాకవి బెర్తోల్ట్ బ్రెహ్ట్ 80వ జయంతిని ప్రపంచం నలుమూలలా అభ్యుదయవాదులు పలువిధాల జరిపారు.

మన దేశంలో కూడా ఇంగ్వా (అఖిల భారత ఇండో – జి. డి. ఆర్. మిత్రమండలి) జాతీయ సమితి చొరవపై, యీ కార్యక్రమాలు జరిగాయి. వివిధ రాష్ట్రాలలోని ప్రముఖ సాహిత్య, సంస్కృతీవేత్తలు, కళాకారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసేవకులు సభ్యులుగా "బ్రెహ్ట్ 80వ జయంతి జాతీయ కమిటీ" ఏర్పాటు అయ్యింది. ఆంధ్ర ప్రదేశ్ నుంచి యీ క్రింది వారు యీ కమిటీలోకి తీసుకొనబడ్డారు: సి. నారాయణ రెడ్డి, తూమాటి దోణప్ప, సెట్టి ఈశ్వరరావు, రక్త కన్నీరు నాగభూషణం, కొంగర జగ్గయ్య, వై. విజయకుమార్, కాట్రగడ్డ గంగయ్య.

ఫిబ్రవరి 10వ తేదీన బ్రెహ్ట్ జన్మదిన సందర్భంగా, సాహిత్య పత్రికలు "అభ్యుదయ", "వీచిక", యువజన – విద్యార్థి పత్రిక "యువజన", కమ్యూనిస్టు పార్టీ దిన పత్రిక 'విశాలాంధ్ర' ప్రత్యేక సంచికలుగాని, ప్రత్యేక వ్యాసాలుగాని, ప్రచురించి తెలుగు పాఠకులకు బ్రెహ్ట్ జీవితాన్ని, రచనల సారాంశాన్ని స్థూలంగా పరిచయం చేసాయి. తరువాత సంచికలలో "కే గారి కథలు" "అభ్యుదయ", "విశాలాంధ్ర" కొన్నిటికి, పద్యాలు కొన్నిటికి పత్రికలు తర్జుమాలు ప్రకటించేయి. 1930 లో రచించబడిన "ఎక్సెప్షన్ ఎండ్ ది రూల్" అనే ప్రబోధాత్మక నాటకాన్ని పరిచయం చేస్తూ సుదీర్ఘ

ఆంధ్రప్రదేశ్‌లో బ్రెహ్ట్ జయంతి

కాట్రగడ్డ గంగయ్య

మైన వ్యాసం "విశాలాంధ్ర"లో వెల్వడింది. ఈ పత్రికలోనే అవంత్స సోమసుందర్‌గారి వ్యాసం, శ్రీకాంత్, పద్మనాభ రెడ్డిగార్ల గేయాలు (తర్జుమా) ప్రచురింపబడ్డాయి.

భారత - జి. డి. ఆర్. మిత్ర మండలి శాఖలు నెల్లూరు, విశాఖ పట్టణాలలోను, 'అరసం' శాఖ కాకినాడలోను, బ్రెహ్ట్‌ను గురించి ప్రత్యేకంగా సభలు ఏర్పాటు చేసాయి. వీటిలో కెంచెం పురుషోత్తమ రావు, అవంత్స సోమసుందర్, డా. పి. చిరంజీవినీ కుమారి, కాట్రగడ్డ గంగయ్య ప్రసంగించి, ముఖ్యంగా "మదర్ కరేజ్", "గెలీలియో", "అమ్మ", "లుకులుస్‌పై అభిశంసన", "3 పెన్నీల ఒపేరా" నాటకాలను పరిచయం చేసారు. తన 20వ వార్షికోత్సవ సందర్భంగా నెల్లూరు ఇప్టా ప్రకటించిన చక్కని సోవెనీర్‌లో బ్రెహ్ట్ గురించి ప్రత్యేక వ్యాసం వెలువడింది. బహిరంగ సభలో ఆయన గురించి ప్రత్యేక ఉపన్యాసం ఏర్పాటు చేసారు కూడా. ఆ సభకు సాహిత్య ఎకాడమీ అధ్యక్షులు బెజవాడ గోపాలరెడ్డి గారు అధ్యక్షత వహించారు. ఈ నాల్గు సభలకు ప్రొఫెసర్లు, లెక్చరర్లు, రచయితలు, నటులు, రంగస్థల దర్శకులు రావడం విశేషం. (ఇదే కాక నెల్లూరులో 2 సభలు జరిగాయి.) బ్రెహ్ట్ జీవితం రచనలు - వీటి గురించి జి. డి. ఆర్. - భారత్ మిత్ర మండలి (బెర్లిన్) పంపిన 40 చిత్రావళి ఉన్న చక్కని ప్రదర్శనను హైద్రాబాద్‌లో నవంబర్‌లో జరిగిన ఆంధ్ర రాష్ట్ర ప్రజా నాట్య మండలి ఉత్సవాలలోను, కాకినాడలో డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర అరసం మహాసభలలోనూ ఆంధ్ర ప్రదేశ్ ఇప్టా ప్రదర్శించింది. వేలాది సంఖ్యలో యీ ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా చూచారు.

అంతే కాదు - పై రెండు రాష్ట్ర మహాసభలలో జరిగిన వివిధ గోష్ఠులలో కొందరు వ్యక్తులు బ్రెహ్ట్ రచనలగురించి, నాటక ప్రదర్శనపై ఆయన సిద్ధాంతాలను గురించి ప్రస్తావించారు కూడా.

అక్టోబర్ నెలలో జి. డి. ఆర్. లోని వైమర్ నగర థియేటర్ డైరెక్టర్ డా. ఫ్రిట్స్ బెనెవిత్స్ రాష్ట్ర ఇప్టా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ, బ్రెహ్ట్ నాటకాలను భారత నాటక రంగానికి అన్వయించు కొనేలా తాను, శ్రీమతి విజయ్ మెహతా, డి. అల్కాజీ మొదలైన భారత రంగస్థల ప్రముఖులు చేసిన సమిష్టి కృషిని వివరించారు. 1979 లో ఇప్టా ఆధ్వర్యాన, బ్రెహ్ట్ నాటక ప్రదర్శనపై తన పర్యవేక్షణలో "వర్క్ షాప్" జరిపే అవకాశాలున్నాయని తెలిపారు.

"శ్రీమతి కారార్ రైఫిల్సు" అనే ఏకాంక నాటికను, "అమ్మ" నాటకాన్ని తెనుగు లోనికి తర్జుమా చేయడానికి కృషి ప్రారంభ మయింది.

జనవరి 79 లో "ఎక్సెప్షన్ ఎండ్ ది రూల్" అనే నాటకం హైదరాబాద్‌లో, (నేటి పరిస్థితులకు అన్వయింప

బడినది) తెనుగులో ప్రదర్శింపబడుతుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఫేకల్టిలో పనిచేస్తున్న బాట్ల శ్రీ రాములు ప్రదర్శనకు దర్శకుడు.

చలన చిత్ర రంగంలోనూ కొందరు ప్రముఖులు బ్రెహ్ట్ రచనలను ఆంధ్ర పరిస్థితులకు అన్వయించి చలన చిత్ర నిర్మాణం చేయాలనుకున్నారు.

1918 – 1956 ల మధ్య బ్రెహ్ట్ రచించిన కొన్ని పద్యాలను (దాదాపు 40) ఎంపిక చేసి, ఒక్కొక్క పద్యాన్ని ఒక్కొక్క ప్రముఖ కవి చేత తెనిగింప చేసి గ్రంథంగా ప్రచురింప చేయడానికి రాష్ట ఇంగ్సా చేస్తోన్న కృషికి, ఎందరో ప్రముఖులు తమ అమూల్యమైన సహకారాన్ని అందించారు. ఈ సంకలనం జనవరి నెలలో హైద్రాబాద్‌లో విడుదల అయింది. 1956-60 మధ్య డా. ఉప్పల లక్ష్మణ రావు గారు బ్రెహ్ట్ రచనలను కొన్నిటిని జర్మన్ భాష నుంచి మన భాషలోకి అనువాదం చేసారు. 1969 – 73ల మధ్య ఇంగ్సా గుంటూరు శాఖ కొండేపూడి లక్ష్మీనారాయణ గారి 'మంచి మనిషి' నీ (బ్రెహ్ట్ నాటకానుసరణ), మద్రాసులోని వికాస సాహితి బ్రెహ్ట్ కృషిని వివరించే కొన్ని వ్యాసాలనూ, ఆయన పద్యాల అనువాదాలనూ గ్రంథ రూపంలో ప్రచురించాయి.

1976 – 77 లలో డా. వి. ఎస్. శర్మ గారు అనువాదం చేసిన "మదర్ కరేజ్", "గెలీలియో" అను నాటకాలను సాహిత్య అకాడమీ ప్రచురించింది. (ఇక్కడ ఉపయోగించిన శైలి మొదలైనవి, మాతృకలకు, బ్రెహ్ట్ ఆలోచనా విధానానికి పూర్తి న్యాయం చేయవు.) పైని వివరింపబడిన దంతా బ్రెహ్ట్ నాటక రంగానికీ, సాహిత్యానికీ, ప్రగతి శీల భావ వ్యాప్తికీ, తన జీవిత కాలంలో చేసిన మహత్తర కృషిని ప్రతిబింబించి, ఆయన 80వ జన్మ దినోత్సవాలు జయప్రదం కావడానికి తోడ్పడుతున్నాయి.

నాగార్జున విశ్వ విద్యాలయంలో ఇంగ్లీష్ సారస్వత విద్యార్థుల పాఠ్య గ్రంథాలలో "కకేషియన్ చాక్ సర్కిల్" కూడ ఉండడం ముదావహం. ఈ రచనను, తదితర బ్రెహ్ట్ ఉత్తమ రచనలు "గెలీలియో" "మదర్ కరేజ్," "మంచి మనిషి." వంటి వాటిని కూడా మన రాష్ట్రంలోని యితర విశ్వ విద్యాలయాలు పాఠ్య గ్రంథాలుగా నిర్ణయించి, ఆ విశ్వ విఖ్యాత నాటక కర్తను తెలుగు వారికి పరిచయం చేయడానికి తోడ్పడ గలవని ఆశిద్దాం.

బ్రెహ్ట్ కవితా సంకలనం

విశ్వ విఖ్యాత జర్మన్ కవి బ్రెహ్ట్ గీతాల సంకలనం జనవరి 19న హైదరాబాద్‌లో ఆవిష్కరింపబడింది. ఇండో- జి.డి ఆర్. మిత్ర మండలి ప్రచురించిన యీ గీతాలను 40మంది తెనిగించారు. గురుజాడ లాగా బ్రెహ్ట్ యుద్ధాన్ని నిరసించిన కవి అని గ్రంథావిష్కరణ జరుపుతూ, సి. నారాయణ రెడ్డి అన్నారు. అస్థానకవి దాశరధి సాహిత్య అకాదెమీ కార్యదర్శి దేవులపల్లి రామానుజరావు, మిత్రమండలి ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ గంగయ్య, మాస్కో ప్రగతి ప్రచురణాలయం తెలుగు శాఖ ఉద్యోగిని కొవలేవా తమారా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ విజిటింగ్ ప్రొఫెసర్, జర్మన్ భాషావేత్త హారీ స్టిజర్ట్, వీటుకూరి ప్రసాద్ సభలో పాల్గొన్నారు.

విప్లవకారుడు

బెర్టోల్ట్ బ్రెహ్ట్

జర్మన్ మాతృకకు అనువాదం:

వుప్పల లక్ష్మణరావు

పస్తులు, పీడలు పెచ్చు పెరిగి
నప్పుడు,
పలువురి గుండెలు బెంగైనప్పుడు
దిటవు పడుతుందతని గుండె.
కూలి పైసలకోసం, మరి గుక్కెడు
టీ నీళ్ళ కోసం
దొరతనం కార్మికుల కైవసం
కావడం కోసం
పోరాటం సంఘటితం చేస్తాడతడు.
ఆస్తినీ, ఐశ్వర్యాన్ని సవాల్జేస్తా
డతడు:
"యెక్కడ మీ పుట్టుక ?"
రాజ్యాంగ మూల సూత్రాల్నే
ప్రశ్నిస్తాడతడు:
'యెవరినుద్ధరిస్తాయి మీ ఆదర్శాలు?'

మహారథులు మొండికేసి
మూగనోము పట్టినప్పుడు
నోరు పెగుల్చుకు గర్జిస్తాడతడు,
దమనకాండ తాండవించగా,
ప్రజలు విధిని నోరార తిట్టగా
హేమా హేమీలని పేరు పేరునా
తూర్పార బట్టుతాడతడు.
పంక్తి భోజనానికి కూర్చున్నప్పుడు
సహపంక్తిని కూర్చుంటుంది
అసంతృప్తి.
అన్నహితవు హరించిపోతుంది
భోక్తలకి
పాయసం వేపాకురస మనిపిస్తుంది,
సువిశాలమైన భోజనశాల
దెయ్యాల గుయ్యారమవుతుంది
వాణ్ణి యెక్కడికి వేటాడినా
అక్కడల్లా అలజడికి పుట్టిల్లవుతుంది.
వాణ్ణి తరిమిన చోటల్లా
అల్లరి యిల్లు కట్టుకు
పిల్లలు పెడుతుంది.

వార్తా సంగ్రహం

కథా రచయితల సమ్మేళనం

విజయవాడలో యీ నెల ప్రారంభంలో జరిగిన తెలుగు కథకుల సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో రచయితలు, రచయిత్రులూ పాల్గొని, దిగజారుతోన్న కథల స్థాయిని గురించీ, సాహిత్యంలో కథలకు ఆదరణ తగ్గుతూ వుండడం గురించీ తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నవ భారతి సంస్థ అధ్వర్యాన జరిగిన యీ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఉస్మానియా, విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి బి. రామరాజు పాఠకులు, ప్రచురణ కర్తలు, రచయితలు సాహిత్య రంగాన్ని కలుషితం చేశారని, సామాజిక పరిస్థితులే సాహిత్యంలో ప్రతిబింబిస్తున్నాయన్నారు; దేశానికి మేలు చేసే వస్తువును స్వీకరించి కథారచన చేయడం అవసరమని చెప్పారు.

ఆస్థాన కవి దాశరథి ధనార్జన కోసం రచనలు చేయడాన్ని నిరసించి, సమాజాన్ని సన్మార్గంలోనికి నడిపించేవిగ రచనలుండాలని అన్నారు. 'ఆంధ్ర ప్రభ' వారపత్రిక సంపాదకుడు విద్వాన్ విశ్వం తెలుగు సాహిత్య విశిష్టత యితరులకు తెలిసేందుకు, దానిని యితర భాషలలోనికి అనువదింప జేయాలన్నారు. ఆంధ్ర పత్రిక సంపాదకుడు శివలెంక

రాధాకృష్ణ కథలకు పాఠకులే పోషకులు కాబట్టి, రచన పాఠకుల అభిరుచి ననుసరించి జరగాలని చెప్పారు.

ఈ సమ్మేళనం కథకులు కాని వారి ఆధిక్యతతో జరిగింది.

కృష్ణశాస్త్రికి సాహిత్య అకాదెమీ బహుమతి

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, గేయాలు, నాటికల సంపుటాలకు 1978 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాదెమీ బహుమతి యివ్వబడుతుంది (రూ. 5000). వివిధ జాతీయ భాషలలోనూ, ఇంగ్లీషులోనూ యీ బహుమతులు యివ్వడం జరుగుతుంది.

వివిధ శాస్త్రాల, పరిశోధనల సమన్వయం

గత నెల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ 66 వ మహాసభలో, వివిధ వైజ్ఞానిక శాస్త్రాలలో జరుగుతున్న పరిశోధనలు సమన్వయంతో జరగాలనీ, శాస్త్రీయ యోజనల నిర్వహణ వికేంద్రీకరింప బడాలనీ, మన దేశంలోనే యింజినీరింగ్ పరికరాలన్నిటి నిర్మాణం; సముద్ర గర్భంలోని అపార సంపదలను వెలికి తీయడానికి కృషి జరగాలనీ సూచనలు చేయబడ్డాయి. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు వృద్ధి చెందాలన్న ప్రతిపాదన కూడా చేయబడింది.

రేడియో, టెలివిజన్లకు కార్పొరేషన్లు

రేడియో, టెలివిజన్లకు కార్పొరేషన్ల ఏర్పాటుకు పార్లమెంటులో బిల్లు పెట్టబోతున్నట్టుగా కేంద్ర సమాచార శాఖ మంత్రి అద్వానీ తెలిపారు. ద్వినియోగం కాకుండా వీటికి స్వతంత్ర ప్రతిపత్తి యివ్వడం అవసరమని ఆయన అన్నారు.

తిరుపతిలో రేడియో స్టేషన్

తిరుపతి దేవస్థానం కట్టడాలను నిర్మించి పెడితే, ప్రభుత్వం తిరుపతిలో రేడియో స్టేషన్ పెట్టగలదని, కేంద్ర సమాచార శాఖ మంత్రి అద్వాని అన్నారని, పార్లమెంటు సభ్యుడు శ్రీ బాలకృష్ణయ్య తెలిపారు.

ఆంధ్ర విద్యార్థులకు విద్యార్థి వేతనాలు

ఏడాదికి విద్యార్థికి రూ. 600 – చొప్పున నలుగురు ఆంధ్ర విద్యార్థులకు (డి. హేమలత – హిందుస్థానీ సంగీతం, సితార్ – ; సి. కె. ప్రదీప్ – వర్ణచిత్ర లేఖనం – ; పసుమర్తి పాండురంగ విఠల్ – కూచిపూడి నృత్యం ; ఆర్. కె. సుబ్రహ్మణ్యం – నటన) కేంద్ర ప్రభుత్వం విద్యార్థి వేతనాలిస్తుంది. సంగీతం, నృత్యం మొదలైన కళలలో నైపుణ్యం ప్రదర్శించిన మొత్తం నూరు మందికి దేశంలో యీ వేతనాలివ్వబడతాయి.

రాష్ట్ర సాహిత్య అకాదెమీ 78 – 79 కి బహుమతులు

రాష్ట్ర సాహిత్య అకాదెమీ 1978 – 79 సం. నికి రెండు ఉత్తమ తెలుగు రచనలకు రు. 3,500 చొప్పున బహుమతులిస్తుంది. ఈ రచనాంశాలు : "తెలుగు కవిత–సాంఘిక సిద్ధాంతాలు", "తెలుగు చాటు కవిత్వం".

దక్షిణాదిని 389 ఫిల్ములు

1978 లో దేశం మొత్తాన 619 ఫిల్ములు నిర్మాణమైతే దక్షిణ భారత దేశంలో నిర్మాణమైనవి 389, అంటే 63 శాతం. ఇవి మలయాళంలో 123, తమిళంలో 105, తెలుగులో 93, కన్నడంలో 54, హిందీలో 9, తుళులో 3, ఇంగ్లీషు, కొంకణి భాషలలో చెరొకటి.

విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాభివృద్ధి, మానవ విలువల తరుగుదల

మద్రాసులో జనవరి నెల మధ్యలో, వర్ధమాన దేశాలలో వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాలకు సంబంధించిన సంఘం అధ్యక్షుడు డాక్టర్ సూరి భగవంతం అధ్యక్షతను జరిగిన సదస్సులో విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాభివృద్ధి ఫలితంగా మానవ విలువలు తరుగుతూ వుండడం గురించి ఆందోళనను వ్యక్తం చేస్తూ ఒక తీర్మానం ఆమోదింపబడింది.

కొండపల్లి కొండపై టి.వి. ప్రసార కేంద్రం

కొండపల్లి కొండపై టెలివిజన్ ప్రసార కేంద్రం నెలకొల్ప బడవచ్చునని, కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ ఎ. వి. యస్. రెడ్డి అన్నారు.

చరిత్ర పరిశోధనలో గ్రామనామాల ప్రయోజనం

చర్చా వేదిక

"చరిత్ర పరిశోధనలో గ్రామ నామాల ప్రయోజనం" అన్న విషయం పైని మద్రాసు విశ్వవిద్యాలయ భాషా శాస్త్ర విభాగంలో చెంగల్పట్టు జిల్లా గ్రామనామాల గురించి పరిశోధన చేస్తోన్న శ్రీ శ్రీపాద జయప్రకాష్, జనవరి 7 న ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ అధ్వర్యాన పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో జరిగిన సమావేశంలో ఒక పత్రం చదివారు (ఈ పత్రం మార్చి సంచికలో ప్రచురింపబడుతుంది). వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆంధ్రోపన్యాసకులు, శ్రీ కేతు విశ్వనాధరెడ్డి తదుపరి జరిగిన చర్చలో పాల్గొన్నారు.

సభా ప్రారంభంలో యిటీవల కాకినాడలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 8 వ మహాసభ విశేషాలను శ్రీ సెట్టి ఈశ్వరరావు వివరించారు.

శ్రీ కేతు విశ్వనాధరెడ్డి కడప జిల్లా గ్రామనామాల గురించి తన పరిశోధనా క్రమంలో తన అనుభవాలను వివరిస్తూ, కడప జిల్లాలోని లంజ కనుమ గుట్టల గురించి చెప్పేరు.

బౌద్ధ ఆరామాల అవశేషాలను మన తెలుగుదేశంలో లంజ దిబ్బలనడం పరిపాటి. ఆ మతంయెడ వైదిక మతానుయాయులకు గల ద్వేషాన్ని ఆ పదం చూపిస్తుంది. ఆ శబ్దం వుపయోగించబడే ప్రదేశం ఒకప్పుడు బౌద్ధారామంగా వుండి వుంటుందని నిరాటంకగా భావించవచ్చు. కడప జిల్లాలోలంజ కనుమ గుట్టలున్నాయి. ఆ పేరును పట్టి అక్కడ బౌద్ధారామావశేషాలు లభించగలవని అధికారులకు సూచించేను. వారక్కడ తవ్వకాలు సాగించేరు. ఒక మహాచైత్య అవశేషాలు, అనేక నాణాలు లభించేయి. ఒకప్పుడచ్చట బౌద్ధమతం వుండేదనడానికి మిగిలినది ఆ పేరే.

"దేశాభ్యుదయం గ్రామాభివృద్ధి మీద ఆధారపడివుంది. ఒక్కొక్క జిల్లాలో వున్న ప్రధాన గ్రామాలు, మజరా గ్రామాలు, మాల పల్లెలు, మాదిగ పల్లెలు, ఎరికల గూడేలు, సుగాలీ, లంబాడీ తండాలు ఎన్నెన్ని వున్నాయో, ఎక్కడున్నాయో నిర్దుష్టంగా తెలిసినప్పుడే వాటి అభివృద్ధికి, పర్యవేక్షణకు, గ్రామ సామాజిక పరమైన సర్వేలకు వీలవుతుంది. ప్రభుత్వ విధానాలు సమర్ధవంతంగా ఊరూరా అమలు జరగడానికి తోడ్పడుతుంది."

ఇంత ప్రాముఖ్యం గల స్థలనామ పరిశోధనకు దేశం మొత్తంలో మొట్టమొదట తెలుగు నాటనే ప్రయత్నం ప్రారంభమయిందనీ, ఆ పని నెత్తుకొన్న ప్రధములు తామేననీ శ్రీ విశ్వనాధ రెడ్డి చెప్పేరు. ఈనాడు ఇతర విశ్వ విద్యాలయాలు కూడా ఈ పరిశోధనకు పూనుకొన్నాయన్నారు.

ఫిబ్రవరి 4 న జరిగే సమావేశంలో పచ్చయప్ప కాలేజీ హిందీ భాషోపన్యాసకులు శ్రీ ఎ. బి. సాయి ప్రసాద్ "దాక్షిణాత్య భాషలలో మొట్టమొదటి నవల" గురించి ప్రసంగిస్తారని సమావేశంలో ప్రకటింపబడింది.

సమీక్ష

పలనాడు వెలలేని మాగాణిరా

(పులుపుల శివయ్య స్మృతి సంచిక)

వెల : రూ. 10-00

ప్రచురణ కర్తలు: ఆంధ్ర ప్రదేశ అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ

విద్యార్థి దశనుండి జీవితాంతమూ వామపక్ష రాజకీయాల్లో అనేక కష్ట నష్టాలు భరించిన కీర్తిశేషుడు పులుపుల శివయ్య మంచి అభిరుచి వున్న సాహిత్య ప్రియుడు. ఆయన పలనాడు గీతం, పలనాడుకే కాదు, యావదాంధ్రానికీ గర్వ కారణం. చికిత్స కోసం మాస్కో వెళ్లి శివయ్య మరణించిన తరవాత, స్నేహితులు, అభిమానులు ఆయన నిస్వార్థ జీవితాన్ని; రాజకీయ కార్యదక్షునిగా, ప్రజాసేవకునిగా, సాహిత్య పరునిగా ఆయన కృషినీ చిత్రిస్తూ మమకారంతో వ్రాసిన అనేక రచనతో పాటు శివయ్య గేయాలు, వివిధ విషయాల పైని, ముఖ్యంగా సాహిత్యాలంశాల పైని ఆయన వ్రాసిన చాలా వ్యాసాలు యీ స్మృతి సంచికలో వున్నాయి.

శివయ్యను తలుచుకొని పాత, కొత్త తరాల ఆయన సహచరులు, శిష్యులు తమ రచనలలో వెల్లడి చేసిన ఉదంతాలు, జ్ఞాపకాలు ఆయన ఎటువంటి సజ్జనుడో, ఎంతగా ప్రేమపాత్రుడైనాడో తెలుపుతాయి. దీనిలో కన్నీటితో రాసిన పంక్తులెన్నో వున్నాయి. ఇటువంటి ప్రజాసేవకులు రాను రానూ కరువవుతోన్న కాలంలో మచ్చలేని యీ మంచి మనిషి జీవితం ఆదర్శంగా వుండదగ్గది.

ఈ సంపుటంలోని శివయ్య 18 గీతాలలో "మార్క్స్ నన్నొక మనిషిని చేశావయ్యా," అన్న శీర్షికతో వున్న గీతం ఆయన ఆత్మకథ వంటిది:

"వెరపులేని తెరపిలేని
పరకలహ మార్గంలో
శ్రమికసైన్య ప్రస్థానపు
పరాకాష్ట విప్లవమని
దారిద్ర్యపు దుఃఖాలకు
చోటులేని శ్రమజీవుల
భూస్వర్గము కమ్మనిజమ్మె
ఫల శృతియను సత్యంతో
కనువిప్పును కలిగించితి
నిదురజెందు నా మనసుకు . . .
శ్రమిక స్వర్గ లోకానికి
ధనిక రాజ్య కూసానికి
నడుమ రేగు సుడిగాలుల
తలక్రిందై ఊగిపోవు. . .
వ్యర్థాశయ జీవితమున
శ్రమిక స్వర్గ వెలుగు రేఖ
ప్రసరించిన కనువిచ్చిన . . .
మార్క్స్ నన్నొక
మనిషిని చేశావయ్యా !"

రాజకీయ విషయాల గురించిన వ్యాసాలేకాక "గాంధీజీ హత్య, మత దురహంకార ఫాసిస్టు కృత్యము-రచయితల కర్తవ్యం," "తెలుగు సారస్వతంలో దేశభక్తి," "తెలుగు కవితలలో లెనిన్", "రాజమండ్రిలో పంతులు గారు" (వీరేశలింగం) "గిడుగు గ్రాంధిక భాషావాదుల పాలిటి పిడుగు" వంటి సాహిత్య సంబంధమైన వ్యాసాలు యీ సంపుటంలోవున్నాయి. శివయ్యను స్మరిస్తూ కుందుర్తి ఆంజనేయులు, గంగినేని వెంకటేశ్వర రావు, తుమ్మల వెంకటరామయ్య, సోమ సుందర్, నిడమర్తి ఉమారాజేశ్వర రావు, కొండే

పూడి లక్ష్మినారాయణ, తిరునగరి రామాంజనేయులు వంటి అభ్యుదయ రచయితల వ్రాసిన రచనలున్నాయి.

అభ్యుదయ రచయితల ఉద్యమంతో ఆదినుండీ సన్నిహిత సంబంధంగల శివయ్యను సంస్మరించే యీ సంచిక గత డిసెంబరులో జరిగిన రాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభలో ఆవిష్కరింప బడడం సముచితంగా వుంది.

నల్ల నాగు (కథా సంకలనం)
రచయిత : దాశరథి రంగాచార్య
వెల : రూ. 3-50
ప్రచురణ : విశాలాంధ్ర ప్రచురణాలయం,
చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 4

కీర్తిశేషుడు ఆళ్వారుస్వామి పరవడిని అనుసరించి తెలంగాణా ప్రజా సామాన్యం జీవితాన్ని, పోరాటాలను సమర్థంగా తన నవలలో చిత్రించిన శ్రీ దాశరథి రంగాచార్య 17 కథల సంపుటం యిది. 'పిచ్చుకలు', 'కుక్క పిల్ల' వంటి మంచి కథలతో బాటుగా, 'మళ్ళీ మహాత్ముడు మన మధ్యకు వచ్చాడు' వంటి 'ఊహా చిత్రం' కూడా దీనిలో వుంది. దేశం తలకిందులయి వుండడం వల్ల, మళ్ళీ మహాత్ముడు మన మధ్యకు వస్తే, యీ ఊహా చిత్రంలో అరెస్టు చెయ్యడం జరుగుతుంది– 'ఖద్దరు షర్వానీ బట్టతల చిరాకు ముఖంతో ఒక పొడుగుపాటి వ్యక్తి (నెహ్రూ అని చెప్పకపోయినా తెలుస్తూనే వుంది) వద్దని అడ్డం పడినప్పటికీ. ఇది కథకుని ఆవేదనా ప్రకటనే తప్ప, కథగా రాణించ లేదు.

'నల్లనాగు' కథకునికి నచ్చిన కథై వుండాలి. అంచేత సంకలనానికి ఆ పేరు పెట్టడం జరిగింది. నల్లనాగుగా వర్ణింపబడిన పని మనిషిని పరమ నైష్ఠికుడిగానూ, శ్రోత్రియుడుగానూ కనిపించే గృహస్థు బలాత్కరించ

వనిత ఉరఫ్ పతిత

రాధేయ

ఆత్రంగా చూస్తున్నాయి కొన్ని కళ్లు
ఆనందంగా లొట్టలు వేస్తున్నాయి
కొన్ని నోళ్లు
ఆశగా ముందుకు దూసు
కొస్తున్నాయి కొన్ని చేతులు
ఆత్రంగా నడిచి వస్తున్నాయి
కొన్ని కాళ్లు
అందరికీ అందకుండా పారిపోవాలని
పరిగెడుతూవుంది ... ఓ వనిత
సమాజం ఆమెకు పెట్టిన పేరే ...
పతిత
కానీ ఆమె అడుగుతోంది
మీ పతివ్రతకు నిర్వచనం ఏమిటని.
అన్నీ వున్న వారంతా
ప్రతివ్రతలే ఈ సంఘంలో
కన్నవారి కోసం...
కన్న బిడ్డల కోసం..
కక్కుర్తి పడి శీలాన్ని అమ్ముకుంటే..
పతితా ?
ఇదెక్కడి న్యాయం? మీరే చెప్పండి
అంటోంది!
కాని .. నిలబడి సమాధాన
మిచ్చేవాడెవడు ఈ లోకంలో?..
క్షణం తీరిక లేని తన జీవితంలో
వేటాడే వేటగాళ్లు
వెంటాడే నీటుగాళ్లు
సమాజంలో వీరంతా కామందులు
సాటి స్త్రీల పాలిట రాబందులు

డానికి సంబంధించిన కథ యిది. ఆ పని మనిషి 'నంగనాచి' అని చెప్పి ఇరుగమ్మలు, పొరుగమ్మలు హెచ్చరిస్తే, ఆ యిల్లాలు "మా వారు ... మరో ఆడదాన్ని కన్నెత్తయినా చూడరు. మీరు నిశ్చింతగా వుండండి" అని చెప్పేటపుడు "ఆమె కళ్ళలో గర్వం కనిపించింది." కాని 'మా వారు' నంగనాచి నల్లనాగును అనుభవించడానికి ఎత్తు వేసి, అబద్ధపు టెలిగ్రాం తెప్పించి, భార్యను ఊరికెళ్ళేలాగా చేస్తాడు. కాని 'నంగనాచి'గా పేరుపడ్డ ఆ నల్లనాగు, నైష్ఠికుడుగా భార్య యోగ్యతా పత్రాన్ని పొందిన 'మా వారు' తో సహకరించక పోగా కాటువేసి, పరువు వీధిలో పెడ్తుంది. చెడ్డపేరు సంపాదించిన ఆ పనిమనిషి శీలవతి అయిపోవడానికీ, ప్రవరాఖ్యుడిగా భార్యచేత, కథకుని చేత పరిచయం చేయబడిన ఆసామీ వరూధిని లాగా లైంగిక దౌర్జన్యం చేయడానికి బలమైన కారణమేమిటో యీ కథలో కనిపించదు.

విశ్వాసానికి కుక్కను ఉదాహరణగా చెప్పడం పరిపాటి. కాని 'విశ్వాసం' అన్న కథలో పెంచి పెద్ద చేసిన కుక్క నెల్లాళ్లు ఊరికెళ్లి వచ్చిన కథానాయకుణ్ని పూర్తిగా మర్చిపోయి పరాయి మనిషిగా లెక్కగట్టి కర్చి వేస్తుంది!

ఇదే విధంగా 'విలువల వలువలు' అన్న కథ. తిండి పెట్టలేక కొడుకును భూస్వామికి అమ్ముకున్న పేదరాలు. చాలా కాలానికి గాని వాళ్లు ఒకరినొకరు చూసుకోరు. పాపం, భూస్వామి మంచి వాడు! తన కట్టు బానిసను బంధవిముక్తిణ్ని చేయడానికి సిద్ధపడతాడు కూడా. తల్లిని గుర్తుపట్టాక కొడుకు అమ్మా అని కేకవేసి ఉరికి వెళ్తాడు, తల్లి కౌగిలిలోకి. "తల్లీ కొడుకులు బోరున ఏడ్చారు." కాని "బువ్వ దొరకదు" కాబట్టి తల్లితో వెళ్లనంటాడు. "అన్నం అనురాగం కంటే గొప్పది" అన్న సూత్రం నిరూపించడానికి యీ కథ రాసినట్టుగా వుంది. భూస్వామి తనకు పెట్టే బువ్వలో ఒక ముద్ద నిరాధారురాలైన తల్లికి పెట్టవచ్చును. కట్టుబానిసత్వపు కట్లు తెంచెయ్యడానికి సముఖుడుగా వున్న భూస్వామి యిందుకు ఒప్పుకోని వాడు కాడు. లేకపోతే యింకో చోట పాలేరుగా కుదిరి తల్లిని పోషించ వచ్చును. ఇక్కడ 'అన్నా'నికీ, 'అనురాగాని'కి పోటీ ఏమీ లేదు.

సచి రౌత్ రాయ్ కథలు

అనువాదం: చాగంటి తులసి
వెల: రూ. 4-00
ప్రచురణ: అరుణ పబ్లిషింగ్ హౌస్, విజయవాడ

సచి రౌత్ రాయ్ ఒరియా భాషలో పేరుమోసిన కవి. మూడు దశాబ్దాల క్రితం ఈయన కవితలకు హరీంద్రనాథ్ చటోపాధ్యాయ చేసిన ఆంగ్లానువాద పుస్తకం (Boat man Boy and other poems) ఆంధ్ర పాఠకులకు పరిచయమయింది, ప్రశంసలందుకొంది. ఇప్పుడాయన కథకుడుగా తెలుగు పాఠకులకు పరిచయం అవుతున్నారు. 1940 నుండి 74 వరకూ ఆయన రాసిన తొమ్మిది కథలు యీ సంపుటలో వున్నాయి. అనువాదం సాఫీగా, మంచి తెలుగులో సాగింది. కాని గ్రాంథిక వాసన కొట్టే కొద్ది పదాలు కూడా లేకుండవుంటే బాగుండేది.

శ్రీ శ్రీ పీఠికలో 'కథలన్నీ అచ్చ తెలుగు జీవితానికి సంబంధించి నట్టు

గానే ఉన్నాయి' అని రాశారు గాని నిజం కాదనిపిస్తుంది. ఉదాహరణకు మొట్టమొదటి కథ 'శ్మశాన కుసుమం'. జగ్గూ అనే దౌర్భాగ్యుడు శవాలపైని చేసే పనులు తెలుగు దేశంలో ఊహించడానికి కూడా వీల్లేనివి. 'చెయ్యి' అన్న ఒక పిరికి ప్రేమికుని కథలోని ఆత్మ వంచన చిత్రమైనది. అసహజం కూడా.

సోదర భాషల సాహిత్యాన్నీ, దానిలో కనిపించే ఆ ప్రజల జీవితాన్నీ తెలుసుకోడానికి యిటువంటి అనువాదాలు ఉపకరిస్తాయి.

వికాసవాణి
ప్రచురణ : వికాసం, గొదెవారి వీధి,
బరంపురం - 760 002
వెల : అమూల్యం

అప్పుడప్పుడు ముద్రింపబడే యీ 12 పుటల పత్రిక ఎప్పుడో లిఖిత పత్రికగా వస్తుండేదట. ప్రతి ఆదివారమూ సాహిత్య సమావేశాలు జరిపే వికాసం వంటి సాహిత్య సంస్థలు ; అంతేకాక ఉత్తమ సాహిత్య అభిరుచితోను, స్థిరమైన ప్రగతి శీలంతోను సాగిపోయే సాహిత్య సంస్థలు తెలుగు దేశంలోని బస్తీలలో వున్నవో లేవో తెలియదు. కాని అటువంటి సంస్థ బరంపురంలో వున్నట్టుగా, 'వికాసవాణి' సాక్ష్యమిస్తున్నది. ఈ సంస్థవారే జనవరి మూడో వారంలో ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం తరఫున, అఖిల భారత తెలుగు రచయితల సమ్మేళనాన్ని పెద్ద ఎత్తున జరపబోతున్నట్టు యీ పత్రిక ద్వారా తెలుస్తోంది.

ఈ సంచికలోని రచనలు యించుమించు అన్ని చురుకైనవే, కొన్నయితే చలాకీగా చురకలు వేసేవి. ఇంత చిన్న పత్రికలో మూడు కథలూ, 9 గీతాలూ, ఒక పుట పుస్తక సమీక్ష, ఒక పుట 'బరంపురం కబుర్లు' ముచ్చటగా అమర్చి వున్నాయి.

స్వీకారం

భారతీయ తత్వశాస్త్రం (సులభ పరిచయం)
దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ
ఆంగ్ల గ్రంథానికి తెలుగు :
గూడ సుందరరామయ్య
వెల : రూ. 8 - 00

యుద్ధం, పునర్జన్మ
లియొనిడ్ బ్రెజ్నెవ్ స్మృతులు
వెల : రూ. 8 - 00

మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్ర దృక్పథంతో వర్థమాన దేశాల పరిశీలన
యూరీ పొపోవ్
వెల : రూ. 5 - 00

సోషలిస్ట్ ప్రపంచమూ, జాతీయ విముక్తి ఉద్యమం
జార్జి కిమ్
వెల : రూ. 3 - 00

న్యాయమైన ప్రాతిపదికపై సహకారం (అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పునర్వ్యవస్థీకరణ సమస్యలు)
ఎర్నెస్ట్ ఓబ్మిన్‌స్కి
వెల : రూ. 2 - 50

పై పుస్తకాలన్నిటి ప్రచురణ కర్తలు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 520 004

సమీక్ష కోసం పుస్తకాలు
రెండేసి చొప్పున పంపాలి (సం.)

లేఖలు

ప్రత్యేక సంచిక

అభ్యుదయ రచయితల మహాసభ సందర్భంగా మీరు ప్రచురించిన 'అభ్యుదయ' ప్రత్యేక సంచిక బాగుంది. మన రాష్ట్రంలోనూ, దేశంలోనూ అభ్యుదయ రచయితల ఉద్యమం పుట్టు పూర్వోత్తరాలను సింహావలోకనం చేసిన వ్యాసాలు, తొలి రాష్ట్ర మహాసభ విశేషాలు, దానికి పూర్వం వున్న పరిస్థితుల గురించి వున్న వ్యాసాలు, రాష్ట్ర సంఘ ప్రణాళిక అభ్యుదయ రచయితల ఉద్యమం గురించి ఎంతో సమాచారాన్ని అందజేశాయి. ప్రథమ మహాసభాధ్యక్షుడు తాపీ ధర్మారావు గారి చిత్రం ముఖపత్రం మీద అలంకారంగా వుంది. తక్కిన రచనలు కూడా పూర్వపు సంచికలలో వున్నట్లుగానే 'అభ్యుదయ' ముద్రతో వున్నాయి. సంపాదకులకు నా అభినందనలు.

కే. వి. రాఘవరావు — రాజమండ్రి

'జనగీతం'

మీరు అక్టోబరు మాసము 'అభ్యుదయ' లో ప్రకటించిన కె. పద్మారావు గారి 'జనగీతం' నన్నుఱ్ఱూత లూగించినది. ఈ గేయం ఊహా జగత్తులో విహరిస్తూ వాస్తవాన్ని కప్పిపుచ్చి, నిజమైన కవిత్వానికి గోరీ కట్టే భావ కవులకు చెంపపెట్టు. ఈ గేయం తిలక్ భావావేశాన్ని, శ్రీశ్రీ, చెరబండరాజుల విప్లవోద్వేగాన్ని తలపింపజేస్తుంది.

"ఎండిపోయిన తల్లి గుండెపై పడి పాలు గుంజే బిడ్డడు చుక్క రాక దప్పి దీరక గుద్దుతున్నాడా గుండెనే". ఇది చెరబండరాజు 'వందేమాతరం' గేయంలోని "ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని చూచి ఓదార్చలేని శోకం నీది" అను మాటల నధిగమించి అలరారుచున్నది. ఈలాంటి విప్లవ పూరితమైన గేయాలు భావిలో కూడా తామరతంపరగ వెలువడాలని ఆశిస్తాను.

జి. మోహనరావు — రేవేంద్రపాడు

'బలం' మంచి కథ

డిసెంబరు సంచిక చాలా బాగుంది. కథలు వ్యాసాల స్థాయి మునుపటికన్న మెరుగ్గా వుంది. సదానంద శారదగారి 'బలం' కథ ఇటీవల చదివిన బహుకొద్ది మంచి కథల్లో అతి మంచి కథ. మంచి రచయితలు కేవలం వ్యాపార పత్రికలకే పరిమితమై పోకుండా 'అభ్యుదయ' లాంటి పత్రికలకు రాస్తూ వుండటం హర్షించదగిన విషయం.

జి. సి. జీవి — మద్రాసు

కవికొండల

అభ్యుదయ నవంబరు 1978 సంచికలో శ్రీ సోమసుందర్ 'కవికొండలవారి కవితావైభవం' అనే వ్యాసంలో కవికొండలవారి కథలు సంపుటాలుగా రాకపోవడం దురదృష్టం, అంటూ వ్రాశారు. ఆ మధ్య రాజమండ్రిలోని కాళహస్తి తమ్మారావు అండ్ సన్సు వారు కవికొండల వారి కథలు కొన్నింటిని సంపుటాలుగా ప్రచురించారు. ఈమధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకరు, కవికొండల రచనలపై పరిశోధనకు కూడా పూనుకొన్నారు.

చామర్తి కనకయ్య — కాకినాడ 4

గమనిక

'అభ్యుదయ' కు పంపే మనిఆర్డర్లు, డ్రాఫ్టులు, చెక్కులు; ఏజన్సీలు, చందాలు, అడ్వెర్టైజ్‌మెంట్లకు సంబంధించిన ఉత్తరాలు ఈ దిగువ అడ్రసుకు:

ABHYUDAYA
R-3, Llyod's Estate,
Madras - 600 014

రచనలు, సమీక్షకు పుస్తకాలు, వార్తలు, పాఠకుల లేఖలు, ఎక్స్ఛేంజ్ పత్రికలు మొదలైనవి యీ దిగువ అడ్రసుకు దయచేసి పంపండి:

C. Eswara Rao,
6 B, Sripuram 2nd Street,
Madras - 600 014.

Edited and Published by T. Venkataramiah, at 15, Arniammal Street, Madras - 600 017 and Printed at Stree Seva Mandir Press, Madras - 17 for Sri Venkateswara Printers, Madras - 600 021.